
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 17

మంగళవారం 9-4-2024


క్రోధిని కార్యసాధనంగా మలచుకుందాం! - IIలో


అరుదైన పంటల అడవులు! - IIలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



క్రోధిని కార్యసాధనంగా మలచుకుందాం!

ఉగాది తెలుగువారి తొలిపండుగ. ప్రభవతో మొదలు పెట్టి అక్షయ వరకు తెలుగు సంవత్సరాలు 60. ఈ వరుసలో ఇప్పుడు మనం జరుపుకుంటున్న ఉగాదికి క్రోధి నామ సంవత్సర ఉగాది అని పేరు. క్రోధి అంటే కోపం కలవారని సామాన్యార్థం. క్రోధి అనే పదానికి కొన్ని నిఘంటువులు కోప స్వభావులైన కుక్క, దున్నపోతు అని అర్థం చెప్పినప్పటికీ, దానిని పరిగణనలోకి తీసుకోనక్కరలేదు. అన్ని స్వభావాల లాగే మనిషికి కోపం లేదా క్రోధం కూడా అవసరమే. మనకు ఎంత అవసరమో, అంతవరకు మాత్రమే కోపాన్ని ఉంచుకోవాలి. మిగిలిన దానిని నిగ్రహించుకోవాలి. ధర్మమూర్తి అయిన శ్రీరామచంద్రుడు కూడా కొన్ని సందర్భాలలో కోపించాడు. అలా మన జీవితాలకు అవసరమైన మేరకు మాత్రమే కోపాన్ని ఈ ఉగాది ఇస్తుందని, ఇవ్వాలనీ ఆశిద్దాం.

ఉగాదితో చాంద్రమాన సంవత్సరం మొదలవుతుంది. పౌర్ణమిచంద్రుడు చిత్త లేదా చిత్ర నక్షత్రంతో కూడి ఉన్న మాసాన్ని చైత్రమాసంగా పిలుస్తారు. చైత్రమాసం తొలిరోజు అంటే చైత్రశుక్ల పాడ్యమి రోజు ఉగాది అవుతుంది. చంద్రుడు ఒక నక్షత్రంతో మొదలుపెట్టి, భూమి చుట్టూ తిరిగి మళ్లీ ఆ నక్షత్రం దగ్గరకు రావడానికి పట్టే కాలం నక్షత్ర మాసం అవుతుంది. ఆ రోజు పగలు, రాత్రి సమానంగా ఉంటాయి. కాలానికి సూర్య, చంద్ర గమనాలు ప్రాతిపదిక కాబట్టి ఈ మేరకు చాంద్ర–సౌర సంవత్సరం అవుతుంది.

వ్యావహారిక శకానికి పూర్వం తొలిదశలో సప్తఋషులు నక్షత్ర సంవత్సరాన్ని, చాంద్ర–సౌర సంవత్సరాన్ని కలిపి పంచాంగాన్ని అమలులోకి తెచ్చారు. మూడు, ఐదు సంవత్సరాలలో వచ్చే అధికమాసాలను కలుపుకుని ఐదు సంవత్సరాలతో ఒక యుగం అని పంచాంగ పరంగా అమలు చేశారు. అప్పట్లో ఆ యుగం ఆరంభం శరత్ విషువత్, శరత్ ఋతువులో ఉండేది. ఈ ఐదు సంవత్సరాల యుగంలో మొదటి సంవత్సరంలో మొదటి రోజు యుగాది అయింది; అదే ఉగాది అయింది. ఈ యుగం జ్యోతిష శాస్త్రానికి అనుగుణంగా కూడా రూపొందింది. 'జ్యోతి' అంటే నక్షత్రం అనీ 'షం' అంటే సంబంధించిన అనీ అర్థం. జ్యోతిషం అంటే నక్షత్రానికి సంబంధించినది అని అర్థం.

చాంద్ర– సౌర గమనాల ప్రాతిపదికన మన పంచాంగం నిర్మితమైంది. పంచాంగం ప్రకారం మనకు ఉగాది నిర్ణీతమైంది. విశ్వామిత్ర మహర్షి పంచాంగంలోనూ, కాలగణనంలోనూ కొన్ని ప్రతిపాదనలను, మార్పులను తీసుకు వచ్చాడు. ఆ తరువాత కాలక్రమంలో జరుగుతూ వచ్చిన ఖగోళమార్పులకు తగ్గట్లు గర్గ మహాముని సంవత్సరాదిని వసంత విషువత్‌కు మార్చాడు. ఆర్యభట్టు, వరాహమిహిరుడు దాన్నే కొనసాగించారు. అదే ఇప్పటికీ కొనసాగుతోంది. సాంప్రదాయిక సంవత్సరాన్ని లేదా ఆచార వ్యవహారాల కోసం సంవత్సరాన్ని చైత్ర మాసంతో మొదలుపెట్టారు.

వసంతం, వసంతంతోపాటు ఉగాది... ఈ రెండు ప్రాకృతిక పరిణామాల్ని మనం మన జీవితాలకు ఆదర్శంగా తీసుకోవాలి. వసంత ఋతువు రావడాన్ని వసంతావతారం అని కూడా అంటారు. వసంతావతారం సంవత్సరానికి ఉన్న అవతారాలలో గొప్పది, ఆపై శోభాయామానమైంది. సంవత్సరానికి శోభ వసంతం. వసంతం మనకు వచ్చే ఋతువుల్లో ప్రధానమైంది లేదా కేంద్రభాగం అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే, చెట్లకు కొత్త చివుళ్లు, కోయిలల గానాలు, పచ్చదనం, పువ్వుల కళకళలను తీసుకు వచ్చేది వసంతమే. అందుకే వసంతంలో ఎక్కువ వేడి, చలి ఉండవు. వాతావరణం ఉల్లాసకరంగా ఉంటుంది. వసంతం శ్రేష్ఠమైంది కాబట్టే శ్రీకృష్ణుడు భగవద్గీతలో తాను ఋతువుల్లో వసంతాన్ని అని చెప్పాడు. నాటి కవులు, పండితులు మొదలుకొని కళాకారుల వరకు అందరికీ వసంత రుతువంటేనే మక్కువ.

వసంతాన్ని కుసుమాకరం అనీ, కుసుమాగమం అనీ అంటారు. కుసుమానికి పుష్పం, పండు, ఫలం అని అర్థాలు ఉన్నాయి. ఈ మూడూ మనకు ఎంతో అవసరం అయినవి. తప్పకుండా మనం వీటిని పొందాలి. మన జీవితాలు కూడా నిండుగా పుష్పించాలి, పండాలి, ఫలవంతం అవ్వాలి. వసంతాన్ని ప్రకృతి ఇస్తున్న సందేశంగా మనం గ్రహించాలి. వసంతం ఒక సందేశం దాన్ని మనం అందుకోవాలి, అందుకుందాం.



కాలం ఒక ప్రవాహం

కాలం నదిలాంటిది. ముందుకు ప్రవహిస్తుందే కానీ, వెనక్కి తిరగదు. అలా ముందుకు ప్రవహించే నదిలో ఎన్నో సెలయేర్లు, వాగులు, వంకలు కలిసి ఉన్నట్టే... కాలవాహినిలో తృటి, క్షణం, ముహూర్తం, దినం మొదలైన కాలగతి సూచికలు మిళితమై ఉంటాయి. వీటన్నింటి మేలు కలయికే కాల ప్రవాహం. ఇటువంటి కాలాన్ని ఉగాది రూపంలో ఆరాధించాలన్నది ప్రాచీనుల నిర్దేశ్యం. ప్రతి కొత్త సంవత్సరం శుభపరంపరలతో కొనసాగాలని కోరుకోవడంతోపాటు శుభాచరణకు మనల్ని మనం సమాయత్తం చేసుకుంటూ ముందుకు సాగుదాం.


ఆరు రుచులలో అనేక అర్థాలు

ఉగాదికి సంకేతంగా చెప్పకునే ఆరు రుచుల కలయికలో అనంతమైన అర్థముంది. ప్రకృతి లేనిదే జీవి లేదు. జీవి లేని ప్రకృతి అసంపూర్ణం. కాబట్టి సరికొత్త ప్రకృతి అందించే తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు రుచుల సమ్మేళనంతో తయారయ్యే ఉగాది పచ్చడి సేవనం ఆరోగ్యదాయకం. జీవితమంటే కేవలం కష్టాలు లేదా సుఖాలే కాదు, అన్ని విధాలైన అనుభవాలూ, అనుభూతులూ ఉంటాయి. ఉండాలి! అలా ఉన్నప్పుడే జీవితానికి అర్థం పరమార్థం. ఈ సత్యాన్ని బోధిస్తూనే ఆరోగ్యాన్ని చేకూరుస్తుంది ఉగాది పచ్చడి.

సంవత్సరంలో ఉండే మంచితనం వసంతం. వసంతం ప్రకృతి నుంచి మనకు అందివచ్చే మంచితనం. '...సంతో వసంతవల్లోక హితం చరంతః ...' అని వివేక చూడామణిలో జగద్గురు ఆదిశంకరాచార్యులవారు అన్నారు. అంటే మంచి వాళ్లు వసంతంలాగా లోకహితాన్ని ఆచరిస్తారు అని అర్థం. వసంతం వంటి హితం. హితం వంటి వసంతం మనకు, సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం.

శుభానికి తొలి అడుగుగా, మంచితనానికి మారు పేరుగా అన్ని ఆరంభాలకూ ఆది అయిన తొలి పండుగగా ఉగాదికి విశిష్టత ఉంది. ఇతర పండుగలలా కాకుండా ఉగాది కాలానికి, ప్రకృతికి సంబంధించిన పండుగ. మనిషి కాలానికి, ప్రకృతికి అనుసంధానం అవ్వాలని తెలియజెప్పే ఒక విశిష్టమైన పండుగ.

ఆరు ఋతువులకు ఆదిగా వచ్చేది ఈ పండుగ.



పంచాంగ శ్రవణ ఫలమేమిటి?

ఉగాదినాటి పంచాంగ శ్రవణం గంగాస్నాన ఫలంతో సమానమని శాస్త్రం చెబుతోంది. అంతేకాదు. ఉగాది పంచాంగ శ్రవణం వల్ల, భూమి, బంగారం, ఏనుగులు, గోవులతో కూడిన సర్వలక్షణ లక్షితమైన కన్యను యోగ్యుడైన వరునకు దానం చేస్తే కలిగే ఫలంతో సమానమైన ఫలాన్నిస్తుందని శాస్త్రోక్తి. వీటితోపాటు సంవత్సరానికి అధిపతులైన రాజాది నవనాయకుల గ్రహఫలితాలను శాస్త్రోక్తంగా వినడం వల్ల గ్రహదోషాలు నివారితమై, వినేవారికి ఆరోగ్యాన్ని, యశస్సును, ఆయుష్షునూ వృద్ధి చేసి, సంపదతో కూడిన సకల శుభఫలాలనూ ఇస్తుందంటారు పెద్దలు. కాబట్టి ఉగాదినాడు పంచాంగ ఫలాలను తెలుసుకోవడం వల్ల భవిష్యత్ కార్యాచరణను చేపట్టవచ్చు.

సంవత్సరంలోని ఆరు ఋతువులకు ప్రతీకలుగా తీపి, కారం, చేదు, వగరు, ఉప్పు, పులుపుల్ని తీసుకుని ఆ రుచుల కోసం కొత్త బెల్లం, మిరియాలపొడి, వేపపువ్వు, మామిడి పిందెలు, ఉప్పు, కొత్త చింతపండు కలిపి తయారు చేసిన ఉగాది పచ్చడిని మనం తీసుకుంటున్నాం. నింబకుసుమ భక్షణం అని దీనికి పేరు. ఇది ఉగాది పండుగలో ముఖ్యాంశం. మరో ముఖ్యాంశం పంచాంగ శ్రవణం. ఆదిలోనే ఎవరి రాశి ప్రకారం వారికి సంవత్సరంలో జరగడానికి అవకాశం ఉన్న మేలు, కీడులను ఆయా రాశి గల వ్యక్తులకు సూచనప్రాయంగా పంచాంగం తెలియచెబుతుంది. పంచాంగ శ్రవణానికి ముందుగా మనం అభ్యంగన స్నానం చేసి, మామిడి తోరణాలతో, పుష్పాలతో ఇళ్లను అలంకరించుకుని దైవ పూజ చెయ్యాలి.

ప్రకృతి ఇచ్చిన సందేశాలుగా అందివచ్చిన ఉగాదిని, వసంతాన్ని ఆకళింపు చేసుకుని, ఆదర్శంగా తీసుకుని, మనం మనకు, ఇతరులకు ఈ ఏడాదిలోని అన్ని ఋతువుల్లోనూ హితకరం అవుదాం.

– డి.వి.ఆర్. భాస్కర్

నూతనత్వానికి నాంది

బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించినదీ, ప్రజానురంజకంగా పాలించిన శ్రీరాముడికి పట్టాభిషేకం జరిగినదీ, వెయ్యేళ్లపాటు రాజ్యపాలన చేసిన విక్రమార్క చక్రవర్తి రాజ్యాన్ని చేపట్టినదీ, శకకారుడైన శాలివాహనుడు కిరీటధారణ చేసినదీ, కౌరవ సంహారం అనంతరం ధర్మరాజు హస్తిన పీఠాన్ని అధిష్ఠించిందీ ఉగాదినాడేనని చారిత్రక, పౌరాణిక గ్రంథాలు చెబుతున్నాయి. కాబట్టి నూతనకార్యాలు ప్రారంభించడానికి ఉగాదిని మించిన శుభతరుణం మరొకటి లేదనే కదా అర్థం.

సాగుబడి
రేవతి కార్తె: మార్చి 31 నుంచి

అరుదైన పంటల అడవులు!

- మండుటెండల్లోనూ కన్నుల పండుగ చేస్తున్న సౌరాష్ట్ర రైతుల 'ఫుడ్ ఫారెస్ట్‌లు'
- 5 దొంతర్ల పంటల అడవిలో పండ్లు, కూరగాయలు తదితర పంటల సాగు
- రైతు కుటుంబానికి ఏడాది పొడవునా పౌష్టికాహారంతో పాటు ఆదాయ భద్రత
- గుజరాత్‌లో ఫుడ్ ఫారెస్ట్‌లను 400 మంది రైతులకు ఇటీవల స్వయంగా చూపించిన పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్


రైతు కరన్ని పర్మార్


కరన్ని తోటలో పంటలను ఆశ్చర్యంగా చూస్తున్న రైతు


ఫుడ్ ఫారెస్ట్‌లో నరోత్తమ్‌తో పాలేకర్


గుజరాత్‌లోని వెజల్క గ్రామంలో కరన్ని సృష్టించిన దట్టమైన పంటల అడవి


నరోత్తమ్ ఫుడ్ ఫారెస్ట్‌లో రైతులతో పాలేకర్

నరోత్తం భాయ్ జాదవ్.. చిన్న రైతు. కరన్ని అభయ్‌సింగ్ పర్మర్.. పెద్ద రైతు. వీరిది గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ నగరానికి 150 కి.మీ. దూరంలోని బొటాడ్ జిల్లా. వీరు 9 నెలల క్రితం చెరొక ఎకరంలో 5 దొంతర్ల పంటల అడవి సాగును ప్రారంభించారు. సుభాష్ పాలేకర్ కృషి (ఎస్.పి.కె.) పద్ధతిలో ఎకరానికి 2 టన్నుల ఘన జీవామృతం వేస్తూ, 10–15 రోజులకోసారి ద్రవ జీవామృతం డ్రిప్, పిచికారీ చేస్తూ తొలి ఏడాదే గణనీయంగా ఆదాయం పొందుతున్నారు. ఎత్తు మడులపై కొలువుదీరిన ఈ వత్తయిన ఉద్యాన తోటలు చూపరులకు కన్నుల పండుగ చేస్తున్నాయి. పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. సుభాష్ పాలేకర్ ఈ 5 లేయర్ మోడల్ క్షేత్రాలను మార్చి 31న సుమారు 500 మంది రైతులకు స్వయంగా చూపించి ఆశ్చర్యచకితులను చేశారు. ఈ క్షేత్రాలను సందర్శించిన 'సాక్షి సాగుబడి' ప్రతినిధి పంతంగి రాంబాబు గ్రౌండ్ రిపోర్ట్.

బొటాడ్ జిల్లాలో వార్షిక సగటు వర్షపాతం 500–600 ఎం.ఎం. మాత్రమే. ఎక్కువ మంది రైతులు వర్షాధారంగానే పంటలు పండిస్తారు. పత్తి, గోధుమ, సోంపు తదితర పంటలను ఏక పంటలుగా అక్కడి రైతులు రసాయనిక పద్ధతిలో పండిస్తారు. అయితే, పాలేకర్ పద్ధతిలో పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, దుంపలు, ఇతరత్రా పంటలతో కూడిన 5 దొంతర్ల సాగు అల్ప వర్షపాత ప్రాంతాల్లో సైతం రైతులకు ఏడాది పొడవునా పౌష్టికాహార భద్రతను, ఆదాయ భద్రతను అందిస్తాయని ఈ ఇద్దరు రైతులు రుజువు చేస్తున్నారు. ఈ సుసంపన్న క్షేత్రాలను స్వయంగా రైతులకు చూపించిన సుభాష్ పాలేకర్.. అందుకు దోహదం చేసిన ప్రకృతి సేద్య సూక్ష్మాలను రైతులకు విశదీకరించారు. 3 రోజుల శిక్షణా శిబిరంలో ప్రతి చిన్న విషయాన్నీ విడమర్చి చెప్పి, నోట్సు రాయించారు. శ్రద్ధగా రాసుకున్న ప్రతినిధుల్లో సాధారణ రైతులతో పాటు ఇద్దరు డాక్టర్లూ ఉండటం విశేషం.

5 అడుగుల బెడ్లపై 70 పంటలు!

నరోత్తమ్ భాయ్ జాదవ్ (96872 57381–హిందీ/గుజరాతీ) స్వగ్రామం గుజరాత్ బొటాడ్ జిల్లా రాంపూర్ తాలూకాలోని నగనేశ్. ఆయనకు 5 ఎకరాల నల్లరేగడి మెట్ట భూమి ఉంది. 2017 నుంచి పాలేకర్ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. 9 నెలల క్రితం ఒక ఎకరంలో.. చివరి దుక్కిలో 2 వేల కిలోల ఘనజీవామృతం వేశారు. 5 అడుగుల వెడల్పున ఎత్తుమడులు, పక్కన 3 అడుగుల వెడల్పున కాలువలు ఏర్పాటు చేశారు. బొప్పాయి, చెరకు, అరటి, మునగ, చిక్కుడు, కంది, జామ, సొర, కాకర, టొమాటో, మిరప, పసుపు, గాజర్, ఉల్లి, శనగ, తులసి, సోంపు, బీట్‌రూట్, ముల్లంగి, ఆకుకూరలతో పాటు కొబ్బరి, బాదం, అంజీర, జీడిమామిడి, సీతాఫలం, రామాఫలం, బత్తాయి, దానిమ్మ, అవకాడో తదితర పండ్ల మొక్కల్ని కూడా నాటారు. బెడ్లపై ఆ చివరన, ఈ చివరన వై ఆకారంలో పంగల ఇనుప స్టాండ్లను పాతి.. వాటికి పైన 8, కింద 4 తీగలు కట్టి.. వాటిపైకి చిక్కుడు, ఆనప, కాకర వంటి పంటలను పాకించారు. పంట వ్యర్థాలతో బెడ్లపై మొక్కల మధ్య ఆచ్ఛాదన చేశారు. బెడ్లపైన పంటలకు నాలుగు డ్రిప్ లైన్ల ద్వారా బోరు నీటిని అందిస్తున్నారు. పంటలన్నీటినీ ఒకేసారి కాకుండా 3 నెలల్లో దశల వారీగా నాటామని రైతు నరోత్తమ్ వివరించారు. 'నా భార్య, ఇద్దరు కుమార్తెలు కూడా రోజువారీ తోట పనుల్లో భాగస్వాములవుతారు. ఒక కూలీ కూడా పనిచేస్తుంటారు. హైవే పక్కనే ఉండటం వల్ల పంట ఉత్పత్తులను తోట దగ్గర కొన్ని అమ్ముతాం. మిగతా వాటిని అహ్మదాబాద్‌లో గురు, ఆదివారాల్లో అమ్ముతున్నాం. కిలో రూ. 80 నుంచి 140 ధరకు నేరుగా వినియోగదారులకే అమ్ముతున్నాం..' అన్నారాయన. 5 లేయర్ మోడల్ పంటల సాగుకు ఎకరానికి అన్నీ కలిపి రూ. 3,50,000 పెట్టుబడి పెట్టగా.. ఇప్పటి వరకు 9 నెలల్లో రూ. 2,87,000 ఆదాయం వచ్చిందని, మరో మూడు నెలల్లో పెట్టుబడి పెట్టిన దానికన్నా ఎక్కువ మొత్తంలోనే ఆదాయం వస్తుందని నరోత్తమ్ ధీమాగా చెప్పారు. పండ్ల చెట్లు పెరిగిన తర్వాత ఏడాదికి ఆదాయం రూ. 6 లక్షలకు పెరుగుతుందన్నారు. సుమారు 70 రకాల ఉద్యాన పంటలను 5 దొంతర్లలో సాగు చేస్తుండటం సందర్శకులను ఆశ్చర్యానికి గురిచేసింది.

పంటల అడవులు.. పలు ప్రత్యేకతలు..

నేల: నల్లరేగడి (ఏ నేలలోనైనా చేయొచ్చు) **విస్తీర్ణం:** 1 ఎకరం. **ఎరువు:** సుభాష్ పాలేకర్ కృషి (ఎస్.పి.కె.) పద్ధతిలో సాగు. చివరి దుక్కిలో ఎకరానికి 2 టన్నుల ఘన జీవామృతం (పాలేకర్ ఎకరానికి 400 కిలోలు చాలంటున్నా రైతులు 2 టన్నులు వేశారు). **బెడ్లు:** 5 అడుగుల వెడల్పున ఎత్తు మడులు (బెడ్ల మధ్య 3 అడుగుల దూరం). గడ్డీగాదంతో ఆచ్ఛాదన ముఖ్యం. ఎత్తు మడులపై ఏ పంటైనా పండించొచ్చు. వర్షం ఎక్కువైనా, తక్కువైనా తట్టుకుంటాయి. **పంటల వైవిధ్యం:** ఖాళీ లేకుండా 20–70 వరకు వత్తుగా 4 వరుసలుగా రకరకాల ఎత్తు పెరిగే సీజనల్, దీర్ఘకాలిక పంటలు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, తీగజాతులు, దుంపలు, ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్య పంటలు, పప్పుధాన్యాలు, చెరకు.. బెడ్లపైనే 'వై' ఆకారపు ఇనుప ఫ్రేమ్‌లకు ప్లాస్టిక్ తాళ్లు కట్టి అనేక రకాల తీగజాతి కూరగాయల సాగు. **దేశీ వంగడాలు:** పంట ఏదైనా దేశీ విత్తనమే. ప్రతి రైతూ విత్తన రేతే. **డ్రిప్:** బెడ్లపై 4 లైన్ల డ్రిప్ (మన నేలలకు డ్రిప్ కన్నా స్ప్రింక్లర్లు మేలు: పాలేకర్). 10 రోజులకోసారి నీటితోపాటు ద్రవ జీవామృతం. **పిచికారీ:** 15 రోజులకోసారి ద్రవజీవామృతం. అవసరాన్ని బట్టి కషాయాలు. **దిగుబడి:** నిరంతరం. పూర్తయ్యే పంట పూర్తవుతుంటే విత్తే పంట విత్తుకోవాలి. అనుదినం పనితో పాటు ఏడాది పొడవునా పౌష్టికాహార, ఆదాయ భద్రత. **మార్కెటింగ్:** రైతే ధర నిర్ణయించుకొని, నేరుగా వినియోగదారులకే అమ్మకం. **ఆదాయం:** తొలి ఏడాదే రూ. 2 లక్షల ఆదాయం. ఆరేళ్ల నుంచి రూ. 6 లక్షల ఆదాయం.

ప్రతి రైతుకూ ఫుడ్ ఫారెస్ట్!

5 దొంతర్ల ఫుడ్ ఫారెస్ట్ నమూనా ఒక అద్భుతం. ఆహార సార్వభౌమత్వాన్ని, స్వావలంబనను అందించే ఫుడ్ ఫారెస్ట్ రైతు కుటుంబానికి ఎంతో అవసరం. కనీసం ఒక ఎకరంలో ఏర్పాటు చేసుకోవాలి. అనేక పంటలు పండించుకుంటూ ఇంటిల్లపాదీ తినటం, మిగతా పంటలను నేరుగా వినియోగదారులకే తాము నిర్ణయించిన ధరకు అమ్ముకోవటం ద్వారా ఏడాది పొడవునా మంచి ఆదాయం కూడా పొందవచ్చు. రకరకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో పాటు పప్పుధాన్యాలు, ఔషధ మొక్కలు, మసాలా దినుసులు, చివరకు చిరుధాన్యాలను కూడా పండించుకోవటానికి ఈ నమూనాలో అవకాశం ఉంది. చెరకు సాగు చేసుకొని ఇంట్లోనే బెల్లం తయారు చేసుకోవచ్చు. నీరు నిలవని, సున్నపు రాళ్లు లేని భూముల్లో (రాళ్ల భూమైనా ఫర్వాలేదు) ఫుడ్ ఫారెస్ట్‌ను 5 అడుగుల వెడల్పున ఎత్తు మడులు చేసి, వాటి మధ్యన 3 అడుగుల కాలువలు తవ్వుకోవాలి. బెడ్స్ తయారు చేసుకోవడానికి ముందే వర్షం పడినప్పుడు లేదా తడులు పెట్టి అయినా రెండు సార్లు కలుపు మొలిపించి, నిర్మూలిస్తే ఆ తర్వాత ఇక కలుపు సమస్య ఉండదు. దుక్కిలో ఎకరానికి 400 కిలోల ఘనజీవామృతం సరిపోతుంది. అయితే, గుజరాత్ రైతులు అందుబాటులో ఉంది కాబట్టి 2 వేల కిలోలు వేశారు. దేశీ విత్తనాలు, రకాలే వాడాలి. నర్సరీ మొక్కలు వద్దు. సొంతంగానే మొక్కలను తయారు చేసుకొని నాటుకోవాలి. స్వావలంబన ద్వారా రైతులు అన్ని విధాలుగా సుస్థిరత సాధించాలి. 5 లేయర్ ఫుడ్ ఫారెస్ట్‌ల ద్వారా ఎకరానికి తొలి ఏడాదే రూ. 2 లక్షల (ఆరేళ్ల నుంచి రూ. 6 లక్షల) ఆదాయం పొందుతున్న ఈ రైతుల నుంచి దేశంలో రైతులందరూ స్ఫూర్తి పొందాలి.

– పద్మశ్రీ గ్రహీత డా. సుభాష్ పాలేకర్ (98503 52745)

కనువిందు చేసిన పంటల అడవి

కరన్ని అభయ్‌సింగ్ పర్మర్ (99793 59711 హిందీ/గుజరాతీ) స్వగ్రామం బొటాడ్ జిల్లా రాంపూర్ తహశీల్ వెజల్క. 40 ఎకరాల ఆసామి. మెట్ట వ్యవసాయం. 2019 నుంచి పాలేకర్ పద్ధతిలోనే సేద్యం అంతా. 5 ఆవులు ఉన్నాయి. 6 వేల లీటర్ల జీవామృతం ట్యాంకు కట్టి, నేరుగా డ్రిప్ ద్వారా జీవామృతం పది రోజులకోసారి పంటలకు ఇస్తున్నారు. పది రోజులకోసారి పిచికారీ చేస్తున్నారు. 20 ఎకరాల్లో బీటీ పత్తి వేస్తారు. 5 ఎకరాల్లో పచ్చిగడ్డి, గోధుమ, మిగతా పొలంలో మొక్కజొన్న, శనగ, పెసర, జీలకర, సోంపు వంటి పంటలు వేస్తారు.

ఒక ఎకరంలో 9 నెలల క్రితం పాలేకర్ పద్ధతిలో 5 దొంతర్ల నమూనాలో అనేక పంటలను 5 అడుగుల వెడల్పు బెడ్స్‌పై డ్రిప్‌తో సాగు చేస్తున్నారు. చివరి దుక్కిలో 2 వేల కిలోల ఘనజీవామృతం వేశారు. 5 అడుగుల వెడల్పున ఎత్తుమడులు ఏర్పాటు చేసి 20 పంటలను సాగు చేస్తున్నారు. బెడ్స్‌పై ఆ చివరన, ఈ చివరన వై ఆకారంలో పంగల ఇనుప స్టాండ్లను పాతి.. వాటికి పైన 8, కింద 4 తీగలు కట్టి.. వాటిపైకి చిక్కుడు, ఆనప తీగలను పాకించారు. కరన్నికి చెందిన నల్లరేగడి భూమిలో ఏర్పాటైన 5 లేయర్ తోటలో ఎత్తుగా, ఆకుపచ్చగా ఆరోగ్యంగా ఎదిగిన మధుబిందు అనే దేశీ రకం బొప్పాయి చెట్లు, అరటి గెలలు, ఎత్తుగా ఎదిగిన దేశీ టొమాటో పాదలు, వంగ చెట్లు కన్నుల పండుగ చేస్తున్నాయి. ఆ చెట్లకు ఉన్న కాతను చూసి రైతులు అవాక్కయ్యారు.

మార్చి ఆఖరు నాటికి చుట్టూతా ఒకటి అరా పొలాల్లో సోంపు, గోధుమ పంటలు మాత్రమే కోతకు సిద్ధంగా ఉన్నాయి. కానీ, అనేక పంటలతో పచ్చగా ఉంది కరన్ని తోట మాత్రమే. సుభాష్ పాలేకర్ ఈ ఫుడ్ ఫారెస్ట్ గురించి ఒక్కమాటలో చెప్పాలంటే అద్భుతం అని అభివర్ణించారు.

రైతు కరన్ని మాట్లాడుతూ, తాను 9 నెలల క్రితం మొదట చెరకు నాటానన్నారు. తర్వాత నాలుగు అడుగులకు ఒకచోట అరటి, బొప్పాయి, మునగ, మామిడి, సపోట, జామ, నిమ్మ, కొబ్బరి, అవిశ, పోక, తమలపాకు, ఆపిల్, ఉల్లి, గాజర్ తదితర మొక్కలు పెట్టుకుంటూ వచ్చానన్నారు. అంచుల్లో దుంప పంటలు పెట్టానన్నారు. ఏ పంటైనా మార్కెట్ ధర కన్నా రూ. 20 ఎక్కువ ధరకు అమ్ముతున్నామన్నారు. ఈ 5 లేయర్ ఫుడ్ ఫారెస్ట్‌ను ఎకరంలో నిర్మించడానికి ఇప్పటి వరకు రూ. 1,40,000 ఖర్చు చేశానని, 9 నెలల్లో రూ. 1,38,000 ఆదాయం వచ్చిందన్నారు. మరో 2 నెలల్లో మరో రూ. లక్షకు పైగా ఆదాయం వస్తుందన్నారు.

ఈ ఫుడ్ ఫారెస్ట్‌లో టొమాటో, వంగ మొక్కలు మనిషి ఎత్తు పెరిగి మంచి దిగుబడి ఇస్తున్నప్పటికీ వాటికి వైరస్ ఆశించటాన్ని గమనించిన రైతులు పాలేకర్‌ను వివరణ అడిగారు. నల్లరేగడి భూమిలో నీటిని ఎక్కువగా ఇవ్వటమే ఇందుకు కారణమని పాలేకర్ అన్నారు. డ్రిప్ కన్నా స్ప్రింక్లర్లు మేలన్నారు.

సాక్షి

సత్యమేవ జయతే

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 17

మంగళవారం 9-4-2024



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు

సాక్షి ఉగాది శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



లూటీ లైసెన్స్ రద్దు చేశా

అధికారమంటే లూటీకి లైసెన్స్ వచ్చినట్లుగా భావించిన కాంగ్రెస్ లూటీ లైసెన్స్ విధానానికి చరమగీతం పాడానని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



'రాజ'సం ఎవరిదో...!

రాజస్తాన్‌లో బీజేపీ హిందుత్వ, ఆర్థికాభివృద్ధి పైనే ఫోకస్ చేస్తుండగా, మోదీ ప్రభుత్వంపై వ్యతిరేకతను కాంగ్రెస్ నమ్ముకుంటోంది.

వివరాలు 6లో ▸



కేజ్రీవాల్ పీఏ విచారణ

ఢిల్లీ మద్యం కేసులో కీలక పత్రాల వివరాల కోసం కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు విభవ్ కుమార్‌ను ఈడీ అధికారులు విచారించారు.

వివరాలు 6లో ▸



ఎస్సీ, ఎస్టీ మహిళల ఖాతాలో లక్ష

కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రతి ఎస్సీ, ఎస్టీ మహిళ బ్యాంక్ ఖాతాకు ఏటా రూ.లక్ష జమ చేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు.

వివరాలు 6లో ▸

హస్తం టార్గెట్ @14

మూడంచెల వ్యూహం

14 స్థానాల్లో గెలుపు లక్ష్యంగా కాంగ్రెస్ ప్రణాళికలు

- మొత్తం 17 లోక్‌సభా స్థానాలు మూడు కేటగిరీలుగా విభజన
- ఏ కేటగిరీలో 8, బీ కేటగిరీలో 6, సీ కేటగిరీలో 3 నియోజకవర్గాలు
- 8 స్థానాల్లో కష్టపడితే గెలవొచ్చని భావిస్తున్న అధికార పార్టీ
- 6 నియోజకవర్గాల్లో గెలుపు కష్టమైనా గట్టిగా కృషి చేయాలని యోచన
- 3 స్థానాల్లో గెలుపు అంత సులభం కాదనే భావన
- ప్రతి కేటగిరీకి ప్రత్యేక వ్యూహాలు అమలు చేసేలా కసరత్తు
- జాతీయ మేనిఫెస్టోతో పాటు 23 అంశాలతో కూడిన రాష్ట్ర మేనిఫెస్టో ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రణాళిక
- నామినేషన్ల ఘట్టం ప్రారంభమయ్యాక ఉధృతంగా ప్రచారం



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కనీసం 14 లోక్‌సభా స్థానాల్లో విజయం సాధించాలని కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం మూడంచెల వ్యూహాన్ని అమలు చేయనుంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఓట్లు, ఆ ఎన్నికల తర్వాత పార్టీ బలాబలాల్లో చోటుచేసుకున్న మార్పులు ప్రాతిపదికన రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ స్థానాలను 3 కేటగిరీలుగా విభజించింది. ఏ కేటగిరీ కింద కష్టపడితే గెలుపు సులభమేనని ధీమాగా ఉన్న స్థానాలు, బీ కేటగిరీ కింద ఎంత కష్టమైనా గట్టిగా కృషి చేస్తే గెలుపొందొచ్చని భావిస్తున్న నియోజకవర్గాలు, సీ కేటగిరీలో గెలుపు అంత సులభం కాదని భావిస్తున్న స్థానాలను చేర్చింది. ఈ మేరకు మూడు కేటగిరీల్లో మూడు ప్రత్యేక వ్యూహాలను అమలు చేయనుంది. ఈ మేరకు

మిగతా 11వ పేజీలో ▶

3 స్థానాలపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలోని మూడు స్థానాల్లో గెలుపు అంత సులభమేమీ కాదని కాంగ్రెస్ భావిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో ఎంఐఎం, మెదక్‌లో బీఆర్ఎస్, కరీంనగర్‌లో బీజేపీలను నిలువరించడం కష్టమేనని నాయకత్వం అంచనా వేస్తున్నట్లు సమాచారం. అదే సమయంలో ప్రత్యేకంగా దృష్టి పెడితే గెలుపు అసాధ్యమేమీ కాదని కూడా అంతర్గత చర్చల్లో అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో పరిస్థితి ఎలా ఉన్నా మెదక్‌లో మాత్రం బీసీ కార్డు ఉపయోగపడుతుందని, కరీంనగర్‌లో ధీటైన అభ్యర్థి కోసం వెతుకుతున్నామని, మొత్తం మీద మూడుచోట్లా విజయం లక్ష్యంతో గట్టిపోటీ ఇస్తామని నేతలు చెబుతున్నారు. ముఖ్యంగా పార్టీ జాతీయ మేనిఫెస్టోతో పాటు 23 అంశాలతో రూపొందించిన తెలంగాణ ప్రత్యేక మేనిఫెస్టోను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని, 100 రోజుల రేవంత్ నేతృత్వంలోని ప్రభుత్వ పాలన గురించి ప్రజలకు వివరించి ఓట్లు అడుగుతామని అంటున్నారు. ఇప్పటికే పార్లమెంటు నియోజకవర్గాల వారీ సమీక్షలు పూర్తయిన నేపథ్యంలో ఇక అసెంబ్లీ స్థాయి సన్నాహక సమావేశాలకు సన్నద్ధమవుతున్నామని, నామినేషన్ల ఘట్టం ప్రారంభం నుంచి ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేస్తామని చెబుతున్నారు.

14 సీట్లు కాంగ్రెస్‌వే..

- కొడంగల్ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

-11లో

నిడమనూరు@ 44.5



రాష్ట్రం నిప్పుల కొలిమి..

ఏప్రిల్‌లోనే ఠారెత్తిస్తున్న ఎండలు

- 16 ప్రాంతాల్లో 43 డిగ్రీల కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు.. నగటు సాధారణ ఉష్ణోగ్రత కంటే 2 నుంచి 5 డిగ్రీలు అధికం
- అధిక ఉష్ణోగ్రతలకు తోడవుతున్న వడగాడ్పులు
- నేడు, రేపు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్
- కొన్ని ప్రాంతాలకు మోస్తరు వర్ష సూచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భానుడి భగభగలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వేగంగా వీస్తున్న వడగాడ్పులు జనజీవనాన్ని స్తంభింపజేస్తున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో ఈ స్థాయిలో వరుసగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం గత ఐదేళ్లలో ఇదే తొలిసారి అని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఏప్రిల్ మూడో వారం లేదా చివరి వారంలో వడగాడ్పుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కానీ ఈసారి మొదటి వారం నుంచే వేడి గాలులు వీయడం ప్రారంభమైంది. వాతావరణంలో మార్పులే ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణమని అధికారులు వివరిస్తున్నారు. సోమవారం సాధారణం కంటే 1.6 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రత నమోదైంది.

14 జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు: ఏప్రిల్ 8న రాష్ట్రంలో నమోదు కావాల్సిన సగటు ఉష్ణోగ్రత 39.2 డిగ్రీల సెల్సియస్ కాగా 40.9 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. సాధారణ సగటు కంటే 32 జిల్లాల్లో

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

కవిత బెయిల్ పిటిషన్ కొట్టివేత



ఢిల్లీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. సాక్ష్యాలు నాశనం చేయడంతో పాటు సాక్షులను ప్రభావితం చేయడంలో కవిత ప్రమేయం కనిపిస్తోందని చెప్పింది.

- వివరాలు 5లో▶

ఎంబీబీఎస్ @ 98% పాస్



రాష్ట్రంలో ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థులు రికార్డు స్థాయిలో పాసయ్యారు. గత ఏడాది వరకు ఫైనలియర్‌లో 75 నుంచి 80 శాతం మధ్యే పరీక్ష పాసవగా, ఈ ఏడాది 98 శాతం మంది పాసైనట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు తెలిపాయి.

- వివరాలు 3లో▶

వెంకట్రాంరెడ్డిపై కేసు పెట్టాలి



బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిపై మనీలాండరింగ్ కేసు నమోదు చేయాలని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు కోరారు. లోక్‌సభకు పోటీచేయకుండా అనర్హుడిగా ప్రకటించడంతో ఎమ్మెల్సీగానూ అనర్హత వేటు వేయాలన్నారు.

- వివరాలు 11లో▶

నీళ్లు లేవు.. సార్లు రారు



'మా బడిలో మంచినీళ్లు రావు.. మరుగుదొడ్లు లేవు.. సార్లయితే స్కూల్‌కే రావడం లేదు.. అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డెక్కినం' అని పెద్దపల్లి జిల్లాలోని మహాత్మాజ్యోతిబా పూలే బాలుర గురుకుల వసతి గృహం విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

- వివరాలు 2లో▶



సోమవారం పల్నాడు జిల్లా వినుకొండలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న అశేషజనంలో ఓ భాగం. (ఇన్‌సెట్లో) పల్నాడు జిల్లా చింతలచెరువు వద్ద వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న జగన్

అవ్వాతాతలూ ఆలోచించండి

పింఛనుదారులతో ముఖాముఖిలో ఏపీ సీఎం వైఎస్ జగన్

- వివరాలు 10లో

జర జాగ్రత్త..

అవి ఓఆర్ఎస్‌లు కాదు.. ప్యాకేజ్డ్ జ్యూస్‌లే!

- డీహైడ్రేషన్ చికిత్సకు ఓఆర్ఎస్ అనుకొని ప్యాకేజ్డ్ పండ్ల రసాలు వాడుతున్న బాధితులు
- దీనివల్ల ఆరోగ్యం మరింత క్షీణించి ప్రాణానికే ముప్పు వస్తుందంటున్న వైద్యులు
- డబ్ల్యూహెచ్ఓ ఫార్ములా ఓఆర్ఎస్‌లనే వాడాలని సూచన



సాక్షి, హైదరాబాద్: వేసవిలో చాలా మందికి ఎదురయ్యే సమస్య డీహైడ్రేషన్. అయితే దీని చికిత్సకు తక్షణ పరిష్కారంగా బాధితులు మెడికల్ షాపుల నుంచి ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్ (ఓఆర్ఎస్)ను పోలిన వాటిని వాడుతూ మరింత అనారోగ్యం పాలవుతున్న ఉదంతాలు హైదరాబాద్‌లో ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా చిన్నారుల్లో ఈ సమస్య మరింతగా కనిపిస్తోంది. దీనికి కారణం బాధితులు వినియోగించినవి నిజమైన ఓఆర్ఎస్‌లు కాకపోవడమేనని వైద్యులు నిర్ధారిస్తున్నారు. ప్రస్తుతం నగరవాసులు వినియోగిస్తున్న వాటిలో అనేకం నిజానికి ఓఆర్ఎస్‌లు కావని... అవి కేవలం ప్యాకేజ్డ్ పండ్ల రసాలు మాత్రమేనని స్పష్టం చేస్తున్నారు. అవగాహన లేమితో వాటిని వినియోగించడం అనర్థాలకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు.

సరైన చికిత్స తీసుకోకుంటే ప్రాణాపాయమే..

ఆకస్మిక అనారోగ్యం తద్వారా నీళ్ల విరేచనాలు, వాంతుల వల్ల శరీరం నుంచి లవణాలు,

మిగతా 2వ పేజీలో ▶

బస్సు యాత్రతో 'కారు' ప్రచారం

ఈ నెల 15 తర్వాత ఎన్నికల ప్రచారానికి కేసీఆర్

- తొలుత సభలు నిర్వహించాలనుకున్నా వైఎస్ జగన్ తరహాలో బస్సు యాత్రకే మొగ్గు!
- అన్ని లోక్‌సభ నియోజకవర్గాలను చుట్టివచ్చేలా రూట్‌మ్యాప్‌పై కసరత్తు
- కనీసం వంద అసెంబ్లీ సెగ్మెంట్లలో మినీ మీటింగ్‌లు లక్ష్యంగా టూర్



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన ప్రచార వ్యూహంపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో రెండు లేదా మూడు ఎన్నికల ప్రచార సభలు నిర్వహించాలని తొలుత భావించారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 97 బహిరంగ సభల్లో కేసీఆర్ ప్రసంగించారు. కానీ తాజాగా బహిరంగ సభలకు బదులు రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తే ఎలా ఉంటుందనే కోణంలో సాధ్యాసాధ్యాలపై ముఖ్య నేతలతో చర్చిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ సెగ్మెంట్లలో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు బస్సు యాత్ర

మిగతా 11వ పేజీలో ▶

ఓరుగల్లులో కారెక్కేది ఎవరు?

- రోజుకో పేరు తెరమీదకు!
- వరంగల్ అభ్యర్థి వేటలో బీఆర్ఎస్
- రాజయ్య రాకపై కొనసాగుతున్న సస్పెన్స్
- నలుగురి పేర్లను సూచించిన ఆ జిల్లా నేతలు

11లో



మోదీ హయాంలోనే సురక్షితం

ఒక్క రూపాయి అవినీతి లేదు.. దేశమంతా అభివృద్ధే

- నాడు కీలుబొమ్మ పీఎం.. నేడు బలమైన పీఎం
- కాంగ్రెస్ హయాంలో కల్లోలాలు, కుంభకోణాలే
- మోదీ హ్యాట్రిక్ పీఎం ఖాయం
- జూన్ 8 లేదా 9న మూడోసారి ప్రమాణ స్వీకారం చేస్తారు
- కేంద్ర మంత్రి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



మొయినాబాద్ రూరల్: దేశ ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ హ్యాట్రిక్ సాధిస్తారని, జూన్ 8 లేదా 9న మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేస్తారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. మోదీ హయాంలోనే దేశం సురక్షితంగా ఉందన్న ఆయన దేశంలో పదేళ్ల క్రితం నాటి, ప్రస్తుత పరిస్థితులపై ఆలోచన చేయాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో ఉగ్రవాద దాడులు, మతకల్లోలాలు జరిగేవని గుర్తుచేశారు. గతంలో కీలుబొమ్మలాంటి ప్రధాని ఉండేవారని.. మోదీ రాకతో దేశానికి బలమైన లీడర్ లభించారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన బీజేపీ బూత్ అధ్యక్షుల సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ పార్లమెంట్

మిగతా 11వ పేజీలో ▶

బుల్ సవారీ

సరికొత్త గరిష్టాలకు మార్కెట్లు

సెన్సెక్స్ 494 పాయింట్లు అప్

153 పాయింట్లు ఎగసిన నిఫ్టీ



కొత్త ఆర్థిక సంవత్సరంలో సెకండరీ మార్కెట్లు కదం తొక్కుతున్నాయి. కేంద్రంలో సుస్థిర ప్రభుత్వ ఏర్పాటు అంచనాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ చరిత్రాత్మక గరిష్టాలను తాకాయి. సెన్సెక్స్ 494 పాయింట్లు ఎగసి 74,742 వద్ద ముగియగా, నిఫ్టీ 153 పాయింట్లు జమ చేసుకుని 22,666 వద్ద స్థిరపడింది. ప్రపంచ స్టాక్ మార్కెట్ల ర్యాలీ సెంటిమెంటుకు ప్రోత్సాహాన్నిచ్చినట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఇన్వెస్టర్ల సంపదగా పేర్కొనే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల ఉమ్మడి మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) తొలి సెషన్‌లో రూ. 401 లక్షల కోట్లను అధిగమించింది. మార్కెట్ చరిత్రలో ఇది తొలిసారి.

- వివరాలు 13లో▶

అక్రమ ట్యాపింగ్...

రేవంత్ ఇంటి దగ్గర్లోనూ ఓ వార్‌రూమ్!

- ఓ గెస్ట్‌హౌస్ అడ్డాగా ఎంసీ క్యాచర్ల ఏర్పాటు
- ఆయనతోపాటు కుటుంబీకులపై నిఘా కోసమే
- నేరుగా పర్యవేక్షించిన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు
- డీఎస్పీ ప్రణీత్‌రావు నేతృత్వంలో సాగిన ఫోన్ ట్యాపింగ్
- రాధాకిషన్‌రావు విచారణలో గుర్తించిన సిట్ అధికారులు



సాక్షి, హైదరాబాద్: ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబీకులు, అనుచరులపై నిఘా ఉంచడానికి ఓ గెస్ట్‌హౌస్ తీసుకున్నట్టు తెలిసింది. జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసానికి సమీపంలో ఉన్న దీంట్లో ప్రణీత్‌రావు వార్‌రూమ్ నిర్వహించాడు. ఈ గెస్ట్‌హౌస్ కేంద్రంగానే భారీ సెటిల్‌మెంట్లు కూడా జరిగినట్టు తెలిసింది. పోలీసు కస్టడీలో ఉన్న హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు విచారణలో ఈ విషయాలు గుర్తించిన అధికారులు ఆదివారం రాత్రి ఆ గెస్ట్‌హౌస్‌లో సోదాలు చేశారు. మరోపక్క రాధాకిషన్‌రావు కస్టడీ బుధవారంతో ముగియనుండటంతో సిట్ అధికారులు తమ దర్యాప్తు, విచారణ ముమ్మరం చేశారు. నిఘా అధికారులు చేసిన ఫోన్ ట్యాపింగ్ కారణంగానే 2015 నాటి

మిగతా 11వ పేజీలో ▶

ఇదండీ సంగతి



అలా ఎందుకు రెచ్చగొట్టార్సార్! ఇప్పుడు చూడండి వాళ్ల తడాఖా చూపిస్తున్నారు!



ఎండిన త్రివేణి సంగమం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరిలో మంజీర, హరిద్ర (హల్దీ) నదులు కలిసే త్రివేణి సంగమ ప్రాంతం ఎండిపోయింది. త్రివేణి సంగమాన్ని భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఇక్కడికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు పవిత్ర స్నానాలు ఆచరిస్తుంటారు. అయితే యేటా మే నెలలో ఎండిపోయే ఈ త్రివేణి సంగమం ఈసారి ముందుగానే ఎండిపోయింది. దీంతో భక్తులు సంగమం మధ్యలో పిల్ల కాలువలా ప్రవహిస్తున్న నీటిలోనే స్నానాలు చేస్తున్నారు. ఇక్కడ మోకాళ్ల లోతు వరకు కూడా నీళ్లు లేవు. పిండప్రదానాలకు సైతం జనం ఇబ్బందులు పడుతున్నారు.

చి'వరి'కి ప్రత్యామ్నాయం

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం చింతలూరు గ్రామ పరిధిలోని వాగులో సమీప వ్యవసాయ క్షేత్రాల రైతులు 30కి పైగా బోరుబావులను వేసుకున్నారు. వీటి నుంచి సుమారు వంద ఎకరాల వరి పంటకు నీటిని అందిస్తున్నారు. ఈ బోరుబావులు ఏటా యాసంగి చివరి ఎండిపోతాయి. దీంతో రైతులు చెక్‌డ్యాం దిగువన వాగులో ప్రత్యామ్నాయంగా పంటలను కాపాడుకునేందుకు ఇలా ఏర్పాటు చేసుకున్నారు. వానాకాలంలో వాగులో వరద ప్రవాహం పెరిగినపుడు మోటార్లకు ప్లాస్టిక్ కవర్లు కట్టి ఉంచుతామని, నీరు తగ్గిన తర్వాత స్వల్ప మరమ్మతులు చేయించి బోర్లను వాడుకుంటామని రైతులు చెబుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



అప్పులు, గ్యారంటీల వివరాలు పంపండి

21 ప్రభుత్వ కార్పొరేషన్లకు ఆర్థిక శాఖ ఆదేశాలు


కేంద్రానికి పంపి రుణాలకు అనుమతి తీసుకునేందుకేనని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వివిధ కార్పొరేషన్లు, స్పెషల్ పర్పస్ వెహికిల్స్ (ఎస్పీవీ) ద్వారా తీసుకున్న రుణాలు, చెల్లించాల్సిన వడ్డీలు, ఈ రుణాల కోసం ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీల వివరాలను వెంటనే పంపాలని ఆర్థిక శాఖ అన్ని ప్రభుత్వ శాఖలను కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఇటీవల అన్ని ప్రభుత్వ శాఖలకు లేఖలు రాశారు. ఆయా శాఖల పరిధిలో ఏర్పాటు చేసిన కార్పొరేషన్లు, ఎస్పీవీల ద్వారా 2023-24 నాటికి తీసుకున్న అన్ని రుణాలు, వాటికి ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు, 2024-25లో తీసుకోవాల్సిన రుణాలు, 2025 మార్చి 31 నాటికి వాటి ఖాతాల నిల్వల వివరాలను పంపాలని ఆ లేఖలో కోరారు. ఆర్టికల్ 293(3) ప్రకారం ఈ వివరాలను కేంద్రానికి సమర్పించి అప్పులు తీసుకునేందుకు అనుమతి తీసుకోవాల్సి ఉన్నందున అత్యవసరంగా ఈ వివరాలను పంపాలని ప్రభుత్వ శాఖలకు రాసిన లేఖలో కోరారు. ఆర్థిక శాఖ వివరాలు కోరిన ఈ జాబితాలో డిస్కంలు, స్టేట్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, హౌసింగ్ కార్పొరేషన్, ఐటీఈఅండ్‌సీ, టీఎస్ఐఐసీ, జలమండలి, జీహెచ్ఎంసీ, మెట్రో రైల్, యూఎఫ్ఐడీసీ, టీడీడబ్ల్యూఎస్‌సీఎల్ (మిషన్ భగీరథ), రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్, ఆర్డీసీఎల్, టీఎస్‌డబ్ల్యూఆర్ఐడీసీఎల్, కాళేశ్వరం తదితర కార్పొరేషన్లు ఉన్నాయి.

'హియర్ సే ఎవిడెన్స్' సాక్ష్యంగా చెల్లదు

వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌కు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యం లేదు

- వైఎస్ వివేకా హత్య కేసులో భాస్కర్‌రెడ్డి తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు
- బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వు చేసిన న్యాయస్థానం



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్ రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. హియర్ సే ఎవిడెన్స్ (నాకు మరొకరు చెప్పారని సాక్ష్యం చెప్పడం) చట్ట ప్రకారం సాక్ష్యంగా చెల్లదని, గూగుల్ టేక్ అవుట్ ప్రామాణికమని ఆ సంస్థే ధ్రువీకరణ ఇవ్వదని భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమారెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్ రెడ్డి కోర్టుకు నివేదించారు. అలాంటి సాక్ష్యాలతో అరెస్టు సమర్థనీయం కాదని చెప్పారు. వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు పక్షపాత వైఖరితో సాగుతోందని, కావాలనే ఈ కేసులో తమను ఇరికించారని, బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ భాస్కర్ రెడ్డి, ఉదయ్‌కుమార్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'మూడో చార్జ్‌షీట్ (ఈ కేసులో 2వ మధ్యంతర చార్జిషీట్) దాఖలు చేసే వరకు పిటిషనర్లపై ఎలాంటి ఆరోపణలు లేవు. ఆ తర్వాత నిందితులుగా చేర్చడంలో కుట్ర కోణం దాగి ఉంది. అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించిన వారు కిరాయి హంతకుడు దస్తగిరి (ఏ-4) యథేచ్ఛగా తిరగడానికి మాత్రం పూర్తిగా సహకరిస్తున్నారు. హత్య వెనుక భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ ఉన్నారని గంగిరెడ్డి తనకు చెప్పారంటూ దస్తగిరి వాంగ్మూలం ఇవ్వగా..., గంగిరెడ్డి మాత్రం తాను అలా చెప్పలేదని స్పష్టం చేశారు. దస్తగిరి చెప్పిన విషయానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న సీబీఐ.. ఇతరుల వాంగ్మూలాలను మాత్రం పట్టించుకోవడం లేదు' అని పేర్కొన్నారు. 'రెండున్నర నెలలు ఢిల్లీలో సీబీఐ కస్టడీలో ఉన్నానని దస్తగిరి చెప్పాడు. ఆ తర్వాతే అప్రూవర్‌గా మారి పిటిషనర్ల పేర్లు చెప్పాడు. దస్తగిరి బెయిల్‌కు సీబీఐ పూర్తిగా సహకరించింది. నాటి దర్యాప్తు అధికారి రాంసింగ్‌పై తీవ్ర ఆరోపణలున్నాయి. ఆయనపై సుప్రీం కోర్టులో పిటిషన్లు కూడా దాఖలయ్యాయి. దీంతో అత్యున్నత న్యాయస్థానం కేసు దర్యాప్తు బాధ్యత నుంచి ఆయన్ని తప్పించి, మరొకరిని నియమించింది. హత్య జరిగిన రోజున అవినాశ్‌రెడ్డికి భాస్కర్‌రెడ్డి ఫోన్ చేయడాన్ని కూడా సీబీఐ కుట్ర కోణంగా పేర్కొనడం సమంజసం కాదు. తండ్రి కుమారుడికి ఫోన్ చేయడం కూడా కుట్రేనా? కావాలనే ట్రయల్ కోర్టులో విచారణను సీబీఐ సాగదీస్తోంది. ముఖ్యంగా నాలుగు అంశాలను ఇక్కడ పరిశీలించాలి. ఇందులో మొదటిది పిటిషనర్లపై ఉన్నది ఆరోపణలు మాత్రమే. వాటికి సాక్ష్యాలు లేవు. రెండోది భాస్కర్ రెడ్డి వయస్సు. ఆయన వయస్సు దాదాపు 72 ఏళ్లు. ఆయన ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోవడం మూడో అంశం. ఆయనకు అత్యవసరమైతే 30 నిమిషాల్లో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణకు చేర్చాలి. జైలులో ఉంటే అది సాధ్యం కాదు. నాలుగోది ఏడాదిగా ఆయన జైలులో ఉంటున్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని భాస్కర్‌రెడ్డితోపాటు ఉదయ్‌కుమార్‌కు బెయిల్ మంజూరు చేయాలి. ఇదే హైకోర్టు శివశంకర్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేసింది. అదే వీరికీ వర్తిస్తుంది. సరైన సాక్ష్యాలు లేనప్పుడు నెలల తరబడి నిందితుల పేరుతో జైలులో ఉంచడం వారి హక్కులను హరించడం కిందకే వస్తుందని సుప్రీంకోర్టు పలుమార్లు చెప్పింది' అని నిరంజన్‌రెడ్డి వాదించారు. అనంతరం సీబీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వు చేశారు.

ముగ్గురి ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్..

రాజేంద్రనగర్ (హైదరాబాద్): ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ కుటుంబాన్ని బలి తీసుకుంది. ఆన్‌లైన్ బెట్టింగ్ విషయంలో దంపతుల మధ్య జరిగిన గొడవలే ఈ మరణాలకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చేవెళ్ల మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఆనంద్ (38) ఇందిర (36) దంపతులు. వీరికి శ్రేయాన్స్ (4) ఒక్కడే కొడుకు. పాల వ్యాపారం చేసే ఆనంద్ మూడేళ్ల క్రితం నుంచి బండ్లగూడజాగీర్ సన్‌సిటీ ఏరియాలోని యమున అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్నాడు. ఆనంద్ ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడుతూ బెట్టింగ్‌ల కారణంగా దాదాపు రూ.15 లక్షల వరకు అప్పులు చేసి, ఆర్థికంగా చితికిపోయాడు. దీంతో దంపతుల మధ్య నిత్యం గొడవలు జరిగేవి. 15 రోజుల క్రితం ఇరు కుటుంబాలకు చెందిన వారితోపాటు స్నేహితులు వచ్చి ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడొద్దని, బుద్ధిగా ఉండి కుటుంబాన్ని పోషించుకోవాలని చెప్పారు. అయినా ఆనంద్ ప్రవర్తనలో మార్పు రాలేదు. మూడురోజుల క్రితం మరోసారి ఆనంద్ ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడినట్టు సమాచారం. ఇదే విషయమై సోమవారం ఉదయం నుంచి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. గొడవ జరిగిన సమయంలో ఇందిర తన కుటుంబసభ్యులకు ఫోన్ చేసి జరిగిందంతా చెప్పింది. ఆనంద్ కూడా తన స్నేహితుల తోపాటు బంధువులకు ఫోన్ చేసి తాము ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సమాచారం అందించాడు. దీంతో ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలతోపాటు బంధుమిత్రులు ఫోన్లు చేసినా, ఇద్దరూ లిఫ్ట్ చేయలేదు. దీంతో వారంతా కంగారుపడి అపార్ట్‌మెంట్ వచ్చి చూడగా, మృతదేహాలు కనిపించాయి. వెంటనే రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలాన్ని చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.



ఆనంద్



కుమారుడితో ఇందిర

భార్యను చంపి.. ఆపై ఆత్మహత్య !

ఘటనాస్థలిని పరిశీలించాక...దంపతులు మధ్య గొడవ జరిగి ఉండొచ్చని, ఆ క్రమంలోనే పెనుగులాటలో భార్య చంపి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ తర్వాత కొడుకుకు క్రిమిసంహారక మందు తాగించి, ఆనంద్ కూడా అదే మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. తండ్రీకొడుకు నోటి నుంచి నురగలు వస్తున్న ఆనవాళ్లు కనిపించాయి. అయితే ఇందిర నోటి నుంచి ఎలాంటి నురుగులు రాలేదు. పోస్టుమార్టం నివేదిక తర్వాత అసలు విషయాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు. ఉదయం నుంచే దంపతులు గొడవ పడుతున్నట్టు వాచ్‌మెన్ పోలీసులు తెలిపాడు.

అవి ఓఆర్ఎస్‌లు కాదు.. ప్యాకేజ్డ్ జ్యూస్‌లే!

▶ మొదటి పేజీ తరువాయి

నీరు అధికంగా కోల్పోవడాన్నే డీహైడ్రేషన్‌గా పేర్కొంటారు. ఈ పరిస్థితి ఏర్పడడం వల్ల శరీరంలో రక్తసరఫరా తగ్గిపోతుంది. అది అనంతరం ఫిట్స్ రావడానికి లేదా కిడ్నీ ఫెయిల్ కావడం వంటి తీవ్ర సమస్యలకు కూడా దారితీయొచ్చు. ఈ ప్రమాదాన్ని నివారించడానికి బాధితులకు వెంటనే ఓఆర్ఎస్ ఇవ్వాలని వైద్యులు సూచిస్తుంటారు. డీహైడ్రేషన్ ద్వారా మనం కోల్పోయిన నీటిని, లవణాలను భర్తీ చేసేదే ఓఆర్ఎస్.

అలవాటులో పొరపాటుగా...

కానీ భాగ్యనగరంలో అనేక మంది డీహైడ్రేషన్‌కు గురవగానే ఓఆర్ఎస్‌లుగా భావించి వాటిని పోలిన పేర్లతో ఉండే వాటిని వినియోగిస్తున్నారు. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో కనిపించే వాటిని ఓఆర్ఎస్ఎల్ అని, రీబ్యాలెన్స్ విట్ ఓఆర్ఎస్ మొదలైన పేర్లతో కంపెనీలు అందుబాటులోకి తెచ్చాయి. అయితే వీటిని ఓఆర్ఎస్‌గా వాడకూడదని చిన్న అక్షరాల్లో ఓ మూలకు రాస్తుండటంతో చాలా మంది వాటిని గమనించక ఓఆర్ఎస్‌గా భావించి వాడుతున్నారు.

రివర్స్ రిజల్ట్...

పండ్ల రసాలను ఓఆర్ఎస్‌గా భ్రమింపజేసేలా లేబుల్ అతికించి విక్రయించడంపై ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపి) వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవి అధిక చక్కెరను కలిగి ఉంటాయని, అతిసారాన్ని తగ్గించే బదులు మరింత పెంచుతాయని హెచ్చరిస్తున్నారు. చక్కెర శాతం అధికంగా ఉండే జ్యూస్‌ల వాడకం వల్ల మనం ఏ ప్రయోజనం ఆశించి వాటిని తీసుకుంటున్నామో వాటికి పూర్తి వ్యతిరేక ఫలితాలు వస్తాయని చెబుతున్నారు.

డబ్ల్యూహెచ్‌ఓ ఫార్ములా కీలకం...

కేవలం డబ్ల్యూహెచ్‌ఓ ఫార్ములాను అనుసరించి తయారైన ఓఆర్ఎస్‌లనే వాడాలని ఐఏపీ వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. డబ్ల్యూహెచ్‌ఓ సిఫార్సు చేసిన ఫార్ములా ప్రకారం తయారైన ఓఆర్ఎస్‌లో సోడియం క్లోరైడ్, గ్లూకోజ్, పొటాషియం క్లోరైడ్, ట్రైసోడియం సిట్రేట్ మాత్రమే ఉంటాయని... కాచి చల్లార్చిన లీటర్ నీటిలో ఈ మిశ్రమాన్ని కలిపి 24 గంటల వ్యవధిలో తాగితే డయేరియా వల్ల కలిగే నిర్జలీకరణాన్ని సమర్థంగా ఎదుర్కోవడానికి ఉపకరిస్తుందని వైద్యులు చెబుతున్నారు.

అవగాహన కల్పించాలి..

ఈ సమస్యపై కొన్నేళ్లుగా రకరకాల వేదికలపై పోరాడుతున్నా. అసలైన ఓఆర్ఎస్‌ను పోలిన లేబుల్స్‌తో ఉన్న ప్యాకేజ్డ్ జ్యూస్‌లను వాడటం వల్ల చిన్నారులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్న ఉదంతాలు పెరుగుతున్నాయి. దీనిపై వినియోగదారుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ శివరంజని సంతోష్, పీడియాట్రీషియన్

ఇక గడువు పొడిగించం

- కృష్ణా జలాల పునఃపంపిణీపై ఎస్ఓసీ దాఖలు చేయాల్సిందే
- ఏపీకి స్పష్టం చేసిన జస్టిస్ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్
- ఈ నెల 29లోగా ఎస్ఓసీ దాఖలు చేయాలని ఆదేశం
- మే 15-17 మధ్య తదుపరి విచారణ వాయిదా



సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు, తమకు మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీకి కేంద్రం జారీ చేసిన అదనపు విధివిధానాల (టీఓఆర్)పై స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ (ఎస్ఓసీ) దాఖలు చేసేందుకు జూన్ చివరి దాకా గడువు పొడిగించాలన్న ఏపీ విజ్ఞప్తిని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్-2 తిరస్కరించింది. ఈ నెల 29లోగా ఎస్ఓసీని దాఖలు చేయాలని ఆదేశించింది. ఆ తర్వాతి నుంచి రెండు వారాల్లోగా ఎదుటిపక్షం దాఖలు చేసే ఎస్ఓసీపై కౌంటర్ దాఖలు చేయాలని ఇరు రాష్ట్రాలను ఆదేశించింది. ట్రిబ్యునల్ విధించిన మార్చి 20 గడువు నాటికి తెలంగాణ ఎస్ఓసీ దాఖలు చేయగా ఏపీ ఇంకా దాఖలు చేయలేదు. మే 15 నుంచి 17 వరకు తదుపరి విచారణ నిర్వహిస్తామని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. ఉమ్మడి ఏపీకి బచావత్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్-1) గంపగుత్తగా కేటాయించిన 811 టీఎంసీలతోపాటు ఇతర కేటాయింపులను.. ఏపీ, తెలంగాణ మధ్య పునఃపంపిణీ కోసం కృష్ణా ట్రిబ్యునల్-2కు అదనపు విధివిధానాలను (టీఓఆర్) జారీ చేస్తూ కేంద్రం 2023 అక్టోబర్ 10న గజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ సోమవారం ఢిల్లీలో సమావేశమై అదనపు టీఓఆర్‌పై విచారణ చేపట్టింది. దీనిపై ఇరు రాష్ట్రాల అధికారులు వాదనలు వినిపించారు. ఏపీ గడువు పొడిగింపు అభ్యర్థనను తెలంగాణ వ్యతిరేకించింది. ఏపీలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి ఉన్నందున స్టేట్మెంట్ ఆఫ్ కేసును దాఖలు చేయలేమన్న ఏపీ వాదనను తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకించింది. తమ రాష్ట్రంలోనూ లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కోడ్ అమల్లో ఉన్నా ఎస్ఓసీ దాఖలు చేశామని పేర్కొంది. కేసుల విచారణపై ఎన్నికల కోడ్ ప్రభావం ఉండదని, కాలయాపన కోసమే ఏపీ గడువు పొడిగింపు కోరుతోందని ఆరోపించింది. వాదనలు అనంతరం ఏపీ వాదనలను ట్రిబ్యునల్ తిరస్కరించింది.

1,050లో 789 టీఎంసీలు మావే: తెలంగాణ

ఉమ్మడి ఏపీకి కృష్ణా జలాల్లో ఉన్న 1,050 టీఎంసీల వాటాలో 798 టీఎంసీలను తమకు కేటాయించాలని ట్రిబ్యునల్‌కు సమర్పించిన ఎస్ఓసీలో తెలంగాణ కోరింది. నిర్మాణం పూర్తై వినియోగంలో ఉన్న ప్రాజెక్టులకు 299 టీఎంసీలు, నిర్మాణంలోని ప్రాజెక్టులకు 238 టీఎంసీలు, భవిష్యత్‌లో కట్టనున్న ప్రాజెక్టులకు 216 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 36 టీఎంసీలు కలిపి మొత్తం 789 టీఎంసీలు కేటాయించాలని నివేదించింది. కనీస మొత్తంగా 75 శాతం లభ్యత (డిపెండబిలిటీ) ఆధారంగా 555 టీఎంసీలు, 65 శాతం లభ్యత ఆధారంగా 575 టీఎంసీలు కేటాయించాలని నివేదించింది.

రాష్ట్రం నిప్పుల కొలిమి..

▶ మొదటి పేజీ తరువాయి

అధిక ఉష్ణోగ్రత నమోదు కాగా... 14 జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 42 డిగ్రీ సెల్సియస్ కంటే అధికంగా నమోదు కావడం గమనార్హం. ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో సాధారణం కంటే 3 డిగ్రీ సెల్సియస్ అధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాంతాలు అధిక ఉష్ణోగ్రతలతో కుతకుతలాడాయి. ఈ ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 43 డిగ్రీ సెల్సియస్ కంటే అధికంగా నమోదైంది. సోమ వారం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతం కావడంతో తక్కువ ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ వాతావరణంలో తేమ శాతం పెరగడంతో ఉక్కపోత అధికంగా ఉంది.

తప్పనిసరైతేనే బయటకెళ్లాలి



రానున్న రెండ్రోజులు భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జోగుళాంబ గద్వాల, ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, ములుగు, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నారాయణపేట, సూర్యాపేట, వనపర్తి, వరంగల్ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 41 డిగ్రీ సెల్సియస్ నుంచి 44 డిగ్రీ సెల్సియస్ మధ్యన నమోదు కావచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. గురువారం నుంచి రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు కాస్త తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మంగళ, బుధ వారాల్లో ఆదిలాబాద్, కుమ్రుంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి జిల్లాల్లోని కొన్నిచోట్ల వడగాడ్పుల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. అత్యవసర పనులుంటే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల మధ్య బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తు న్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాగా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మంగళ, బుధవారాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్త రు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ సూచించింది.

సోమవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	38.3	22.7
భద్రాచలం	40.0	26.5
దుండిగల్	36.5	25.0
హకీంపేట్	36.5	25.9
హనుమకొండ	37.5	25.0
హైదరాబాద్	36.7	27.3
ఖమ్మం	39.0	26.4
మహబూబ్‌నగర్	40.4	29.0
మెదక్	41.5	23.4
నల్లగొండ	40.0	24.4
నిజామాబాద్	38.4	26.0
రామగుండం	39.0	25.6

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు (సెల్సియస్‌లలో)

ప్రాంతం	ఉష్ణోగ్రత
నిడమనూరు	44.5
అనంతగిరి	44.5
నేలకొండపల్లి	44.4
వడ్డేపల్లి	44.1
ముత్తారం	43.8
చిల్పూరు	43.7
సుజాతనగర్	43.6
సిద్దిపేట	43.5
భీమారం	43.5
మోత్కూర్	43.5
రేగొండ	43.4
కురవి	43.2
సంగెం	43.2
పానగల్	43.1
అచ్చంపేట	43.0
అడ్డాకల్	43.0

నీళ్లు లేవు.. సార్లు రారు

మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల విద్యార్థుల ఆవేదన

3 కిలోమీటర్లు నడిచి వచ్చి మెయిన్ రోడ్డుపై ధర్నా



ధర్నా చేసేందుకు వస్తున్న విద్యార్థులు

మంథని: 'మా బడిలో తాగేందుకు మంచినీళ్లు రావు.. మరుగుదొడ్లులేవు.. సార్లయితే స్కూల్‌కే రావడం లేదు.. అదేమని అడిగితే బెదిరిస్తున్నారు. మూడేళ్లుగా ఇదే దుస్థితి.. అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.. ఓపిక నశించి తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డెక్కినం' అని పెద్దపల్లి జిల్లా మంథని మండలం వెంకటాపూర్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే బాలుర గురుకుల వసతి గృహం విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులం నుంచి సుమారు మూడున్నర కిలోమీటర్ల దూరంలోని మంథని – కాటారం ప్రధాన రహదారిపై వెంకటాపూర్ క్రాస్ రోడ్డు వరకు కాలినడకన చేరుకున్నారు. సోమవారం ఉదయం ఆరు గంటలకు హాస్టల్ నుంచి బయలు దేరిన సుమారు వంద మంది విద్యార్థులు.. వెంకటాపూర్ క్రాస్‌రోడ్డుపై బైఠాయించి అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. నాసిరకం భోజనం పెడుతున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులు పాఠాలు సరిగా బోధించడం లేదని వాపోయారు. కలుషితనీటితో అలర్జీ వస్తోందని, చాలామంది అనారోగ్యం బారినపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రికి తీసుకెళ్లాలని సార్లకు చెబితే పట్టించుకోవడం లేదన్నారు.

ఎస్సై వచ్చి నచ్చజెప్పి..

గంటల కొద్దీ విద్యార్థులు రోడ్డుపై బైఠాయించడంతో ఇరువైపులా వాహనాలు స్తంభించాయి. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటకృష్ణ అధికారులతో మాట్లాడుతానని విద్యార్థులకు నచ్చజెప్పారు. వారిని వసతి గృహానికి తీసుకెళ్లి అవగాహన కల్పించారు. విషయం ఉన్నతాధికారులకు చేరడంతో ఆర్సీవో గౌతమ్, జిల్లా కన్వీనర్ సుస్మిత హాస్ట ల్ చేరుకున్నారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు.

నిజామాబాద్ జిల్లాలో వడగళ్ల వాన..



బోధన్/రుద్రూర్: నిజామాబాద్ జిల్లాలోని బోధన్, సాలూర, రుద్రూర్, పోతంగల్ మండలాల్లోని గ్రామాల్లో సోమవారం రాత్రి వడగళ్ల వాన కురిసింది. రోడ్లపై పోసిన ధాన్యం కుప్పలు తడిసిపోయాయని, కోత దశకు వచ్చిన వరి పంట దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పొద్దుతిరుగుడు, మొక్క జొన్న పంటల కోతలు 50 శాతం వరకు పూర్తయ్యాయి. కాగా, మిగిలిన పంటలకు నష్టం కలిగే అవకాశం ఉందని చెబుతున్నారు.



పంచాంగ శ్రవణానికి అనుమతివ్వండి

ఈసీని కోరిన ప్రభుత్వం... గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన కమిషన్

సాక్షి, హైదరాబాద్: ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే పంచాంగ శ్రవణ కార్యక్రమానికి ఎన్నికల కమిషన్ అనుమతి లభించింది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు కేబినెట్ మంత్రులు హాజరు కావాలా వద్ద అన్న దానిపై ఉత్కంఠ వీడింది. ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమానికి హాజరయ్యేందుకు అనుమతినివ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈసీని కోరిన నేపథ్యంలో ఈసీ అనుమతి మంజూరు చేసింది. పంచాంగ శ్రవణ కార్యక్రమం సంస్కృతికి సంబంధించిన విషయమైనందున సీఎంతో పాటు మంత్రులు పాల్గొనేందుకు ఈసీ అనుమతినిచ్చిందని, అయితే ఆ కార్యక్రమం లైవ్ టెలికాస్ట్ మాత్రం చేయకుండా చూసుకోవాలని ఆంక్షలు విధించిందని తెలిసింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం రవీంద్రభారతిలో జరిగే పంచాంగ శ్రవణ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు హాజరు కానున్నారు.



ఎంబీబీఎస్ @98% పాస్




- రికార్డు స్థాయిలో ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థుల ఉత్తీర్ణత
- 6 వేల మంది విద్యార్థుల్లో 127 మంది మాత్రమే ఫెయిల్
- ఎన్ఎంసీ తీసుకొచ్చిన సంస్కరణలతో మంచి ఫలితాలు
- ఎంబీబీఎస్ ఫస్టియర్ విద్యార్థుల రిజల్ట్ కూడా భారీగానే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థులు రికార్డు స్థాయిలో పాసయ్యారు. గతేడాది వరకు ఫైనలియర్‌లో 75–80 శాతం మందే ఎంబీబీఎస్ పరీక్ష పాసవగా ఈ ఏడాది ఏకంగా 98 శాతం మంది పాసైనట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు తెలిపాయి. మొత్తం 6 వేల మంది ఎంబీబీఎస్ పరీక్ష రాయగా, 127 మంది ఫెయిల్ కాగా, మిగిలినవారంతా పాసైనట్లు కాళోజీ వర్గాలు పేర్కొన్నాయి. అలాగే ఎంబీబీఎస్ మొదటి ఏడాది ఫలితాల్లోనూ పెద్ద ఎత్తున పాసయ్యారు. గతం వరకు మొదటి సంవత్సరం ఫలితాల్లో కేవలం 70–75 శాతం మధ్యే పాస్ కాగా, ఈ ఏడాది 90 శాతానికి పైగా పాసయ్యారని కాళోజీ వర్గాలు తెలిపాయి.

ఎన్ఎంసీ సంస్కరణలతో పెరిగిన శాతం

ఎంబీబీఎస్‌లో ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలు ఉంటాయి. ఇవి ఎంతో కఠినంగా ఉంటాయి. కాగా గతం వరకు ప్రాక్టికల్స్‌లో తప్పనిసరిగా 50 శాతం, థియరీలోనూ 50 శాతం మార్కులు వస్తేనే పాసైనట్లు లెక్క. దీనివల్ల చాలామంది ఫెయిల్ అయ్యేవారని కాళోజీ వర్గాలు తెలిపాయి. మరీ ముఖ్యంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రాక్టికల్స్‌లో ఫెయిల్ అయ్యేవారు ఎక్కువగా ఉండేవారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ప్రాక్టికల్స్ విషయంలో ఆయా కాలేజీలు ఉదారంగా వ్యవహరిస్తాయని, ఫీజులు చెల్లించనివారి విషయంలో మాత్రమే కక్ష సాధింపు చర్యలు చూపిస్తాయనే వాదనలుండేవి. ఈ నేపథ్యంలో జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఎంబీబీఎస్ పరీక్షల్లో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఉదాహరణకు ప్రాక్టికల్స్‌లో 40 శాతం మార్కులొచ్చి, థియరీలో 60 శాతం మార్కులొస్తే సరిపోతుంది. అయితే కనీసంగా ఒక దాంట్లో తప్పనిసరిగా 40 శాతం మార్కులు మాత్రం రావాలి. ఒకవేళ ప్రాక్టికల్స్‌లో 42 శాతం మార్కులు వస్తే, థియరీలో 58 శాతం వస్తే సరిపోతుంది. అంతేకాదు ఈసారి 10 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు కూడా తీసుకొచ్చారు. దీనివల్ల అందరికీ పదికి పది మార్కులు వచ్చే అవకాశముంది. ఇలా పేపర్లు ఇప్పుడు అత్యంత సులువుగా చేయడంతో పెద్ద ఎత్తున ఉత్తీర్ణతా శాతం పెరిగినట్లు చెబుతున్నారు. సంస్కరణల వల్ల విద్యార్థులకు వెసులుబాటు కలిగిందనీ, పలు మార్లు రాసే పరిస్థితి నుంచి విద్యార్థులు బయటపడ్డారని చెబుతున్నారు.



25లోగా ఇంటర్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షల ఫలితాలు ఈ నెల 25లోగా విడుదల కానున్నాయి. సమాధాన పత్రాల మూల్యాంకన ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. సాంకేతికపరమైన అంశాలను ఇంటర్ బోర్డు అధికారులు పరిశీలిస్తున్నారు. దీనికి వారంరోజులు పట్టే అవకాశం ఉందని చెపుతున్నారు. పరీక్ష రాసిన వారు, గైర్హాజరైన వారు, మాల్ ప్రాక్టీసింగ్‌కు పాల్పడిన విద్యార్థుల డేటాను కంప్యూటరీకరించాల్సి ఉంటుంది. దీంతో పాటు వ్యాల్యూయేషన్‌లో వచ్చిన మార్కులను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. తర్వాత మార్కుల జాబితా సక్రమంగా ఉందా? సాంకేతికపరమైన సమస్యలున్నాయా? అనే అంశాలను ఒకటికి రెండు సార్లు ఉన్నతాధికారులు పరిశీలిస్తారు. సమాధాన పత్రాలను మూల్యాంకనకు పంపే ముందు ఓఎంఆర్ షీటును తొలగిస్తారు. వాటికి కోడింగ్ నంబర్ ఇస్తారు. ఇప్పుడు ఈ కోడ్‌ను డీ కోడ్ చేయాల్సి ఉంటుంది. ఇది చేపట్టిన రెండు రోజుల్లో పరీక్ష ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం 21వ తేదీ నాటికే ముగించాలని అధికారులు భావిస్తున్నారు. ఉగాది పండుగ తర్వాత ఉన్నతాధికారులు సమావేశమై ఫలితాల వెల్లడిపై తేదీని ఖరారు చేస్తారని సమాచారం. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అధికారులే ఫలితాలు వెల్లడిస్తారు. దీనికి ముఖ్యమంత్రి అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఉండదని తెలుస్తోంది.





28న గురుకుల డిగ్రీ ప్రవేశాలకు అర్హత పరీక్ష

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు ఈనెల 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని గురుకుల సొసైటీలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. బీసీ గురుకుల సొసైటీ పరిధిలో 30, ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో 26, ఎస్టీ గురుకుల సొసైటీ పరిధిలో 21 గురుకుల డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో వివిధ కోర్సుల్లో అడ్మిషన్లు అర్హత పరీక్ష ద్వారా ఇస్తామని సొసైటీ కార్యదర్శులు వెల్లడించారు. ఈనెల 28న అర్హత పరీక్ష జరుగుతుందని, ఇందుకు సంబంధించి అభ్యర్థుల హాల్‌టికెట్లు ఈనెల 21 నుంచి గురుకుల సొసైటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు.

సాగర్ కుడి కాల్వకు నీటి విడుదల

నాగార్జునసాగర్: తాగునీటి అవసరాలు తీర్చేందుకు సోమవారం నాగార్జునసాగర్ డ్యాం అధికారులు కుడికాల్వకు నీటిని విడుదల చేశారు. ఆంధ్ర ప్రాంతానికి కేటాయించిన నీటిలో ఈ దఫాలో 5 టీఎంసీల నీరు విడుదల చేయనున్నట్లు ఉన్నతాధికారులకు తెలిపినట్లు సమాచారం. నిత్యం 6 వేల క్యూసెక్కుల చొప్పున వారం రోజులపాటు నీటిని విడుదల చేయనున్నారు.

కొత్త ఏడాదిలో మెరుగైన అభివృద్ధి

రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి ఉగాది శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శ్రీక్రోధి నామ సంవత్సరంలో సమృద్ధిగా వానలు కురిసి రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని సోమవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరికీ శుభం కలగాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని కోరారు. నూతన ఏడాదిలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధిని సాధించి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సిరిసంపదలు నిండాలి: డిప్యూటీ సీఎం భట్టి

తెలుగు ప్రజలందరికీ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, రైతులు బాగుండాలని కోరిన భట్టి.. రాష్ట్రంలో ఉద్యోగాలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్లు వచ్చినందున ఈ ఏడాది ఉద్యోగ నామ సంవత్సరం కావాలని ఆకాంక్షించారు.

వ్యవసాయ నామ సంవత్సరం: కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది నుంచి కాలచక్రం తిరిగి మొదలవుతుందని, చెట్లు చిగురిస్తూ ప్రకృతిలో నూతనోత్తేజం నెలకొంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ పనులను రైతన్నలు ఉగాది నుంచే ప్రారంభిస్తారని, అందువల్ల ఉగాదిని వ్యవసాయ నామ సంవత్సరంగా పిలుచుకుంటారని తెలిపారు. ప్రజల జీవితాల్లో వసంతాన్ని నింపి, క్రోధి నామ సంవత్సరంలో ప్రజలు ప్రశాంతంగా జీవించేలా దీవించాలని ప్రకృతిమాతను కేసీఆర్ ప్రార్థించారు.

అందరి జీవితాల్లో సుఖశాంతులు తేవాలి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలుగు ప్రజలకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. షడ్రుచుల ద్వారా సుఖదుఃఖాలకు, శాంతికి, సమృద్ధికి, బాధ్యతలకు, హక్కులకు సమానమైన ప్రాధాన్యమిస్తూ జీవితాన్ని ముందుకు సాగించాలన్నది ఉగాది సందేశమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మంత్రుల ఉగాది శుభాకాంక్షలు: క్రోధి నామ సంవత్సరంలో అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నిండాలనీ, కొత్త శుభాలు కలగాలనీ రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ సీతక్క వేర్వేరు ప్రకటనల్లో ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు.. రైతులకు మేలు జరగాలని, వర్షాలు సమృద్ధిగా పడి రైతులంతా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయా ప్రకటనల్లో పేర్కొన్నారు.





ప్రతి క్షణంలోనూ నిన్ను నీవు ప్రశ్నించుకో: ఇది అవసరమా?
– మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 9 ఏప్రిల్ 2024

ఆగని డ్రాగన్ దురాశ

ఇది ఆందోళన రేపే వార్త. తక్షణమే అడ్డుకట్ట వేయడానికి ఆలోచించాల్సిన వార్త. పొరుగు దేశం చైనా 'వాస్తవాధీన రేఖ' (ఎల్‌ఏసీ) వెంట తన వైపున మరో 175కు పైగా గ్రామాలను నిర్మిస్తోందట. మన అరుణాచల్ ప్రదేశ్‌కు అభిముఖంగా సాగుతున్న ఈ కొత్త నిర్మాణాలు ఇప్పటికే ఎల్‌ఏసీ వెంట డ్రాగన్ సాగించిన 628 'షియావోకాంగ్' (సంపన్న గ్రామాలు)కు అదనం. ఎల్‌ఏసీ వెంట తన బలం, బలగం పెంచుకొనేందుకు బీజింగ్ మరోసారి దుష్టపన్నాగం పన్నుతోంది. అభిజ్ఞవర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ పత్రిక ప్రచురించిన ఈ కథనం సంచలనం రేపుతోంది. ఈశాన్యంలోని అరుణాచల్ ప్రదేశ్‌తో పాటు జమ్ము–కశ్మీర్‌లో లద్దాఖ్ ప్రాంతం వెంట కూడా చైనా వైపున కొత్త గ్రామాలు వెలుస్తున్నాయి. ఇది అత్యంత ఆందోళనకరమైన పరిణామం. వెరసి, రానురానూ ఎల్‌ఏసీ మరింత వివాదాస్పదం కానుంది. ఇది మన బలగాలు, స్థానికులు తక్షణం జోక్యం చేసుకోవాల్సిన అంశం.

నిజానికి, వాస్తవాధీన రేఖ అనేది భూతలంపై స్పష్టంగా నిర్ణయించిన సరిహద్దు ఏమీ కాదు. చైనీయుల నియంత్రణలో ఉన్న భూభాగాన్నీ, భారత నియంత్రిత భూభాగాన్నీ వేరుపరచే ఊహాత్మక సరిహద్దు రేఖ. దీన్ని వాటంగా చేసుకొని, ఊహాత్మక సరిహద్దయిన ఎల్‌ఏసీ వెంట సైనిక సన్నద్ధతను పెంచుకోవాలనీ, ఆ క్రమంలో అక్కడ మరింత భూభాగంపై తమ హక్కును ప్రకటించుకోవాలనీ చైనా కుటిల ప్రయత్నం. అందుకే, ఆ జగడాలమారి దేశం ఎల్‌ఏసీ వెంట తన వైపున గ్రామాలకు గ్రామాలు నిర్మిస్తూ వస్తోంది. దాదాపుగా 900 ఎల్‌ఏసీ గ్రామాలను నిర్మించాలనేది చైనా వ్యూహం. అందులో 200 దాకా గ్రామాలు భారత సరిహద్దుకు సమీపంలో కట్టాలని దాని ప్రయత్నం. ఆ భారీ ప్రయత్నంలో భాగమే ఇప్పుడీ కొత్త నిర్మాణాలు. ఆ గ్రామాలు ఇటు గస్తీ పాయింట్లుగా, అటు భారత్‌తో ఘర్షణ తలెత్తితే చేతికి అందివచ్చే సైనిక స్థావరాలుగా ఉపకరిస్తాయనేది బీజింగ్ ఎత్తుగడ.

చైనా సైనిక వ్యూహం మాట అటుంచితే, కొత్త ఆవాసాలతో అనేక దీర్ఘకాలిక ప్రభావాలున్నాయి. అది మన దేశాన్ని మరింత కలవరపెడుతోంది. గమనిస్తే, భారత – చైనాల మధ్య 2005 నాటి 'సరిహద్దు రక్షణ సహకార ఒప్పందం' (బీడీసీఏ) ఉంది. ''సరిహద్దు ప్రాంతాల్లో స్థిరపడ్డ ప్రజానీకం ప్రయోజనాలను ఇరుపక్షాలూ సంరక్షించాలి'' అని బీడీసీఏలోని ఏడో ఆర్టికల్ పేర్కొంటోంది. ఎప్పుడైనా ఎల్‌ఏసీని కచ్చితంగా నిర్ణయించాల్సిన పరిస్థితి వస్తే, అప్పటికి జనావాసాలైన ఈ కొత్త గ్రామాలను కదిలించడానికి వీలుండదు. ఆ అంశాన్ని అడ్డం పెట్టుకోవాలనేది డ్రాగన్ దురాలోచన. అలా తన ప్రాదేశిక హక్కుల వాదనకు బలం చేకూర్చేలా ఈ కొత్త గ్రామాలు, అక్కడ తెచ్చి పెట్టిన జనాభాను వాడుకోవాలనేది దాని పన్నాగం. చైనా వైపు కడుతున్న ఈ కొత్త గ్రామాలకు ఎదురుగా భారత్ వైపున కూడా గ్రామాలు లేకపోలేదు. అయితే, వాటిలో జన సంఖ్య అంతంత మాత్రమే!

విస్తరణ కాంక్షతో ఊగుతున్న చైనా ఈ గ్రామాల నిర్మాణంతో ఆగడం లేదు. టిబెట్‌లో, ఎల్‌ఏసీ సమీప ప్రాంతాల్లో పెద్దయెత్తున ప్రాథమిక వసతి కల్పన ప్రాజెక్టులను చేపడుతోంది. ఇప్పటికే తన 14వ పంచవర్ష ప్రణాళిక (2021 –25)లో భాగంగా సిచువాన్ – టిబెట్ రైల్వేలైను సహా హైస్పీడ్ రైల్వే వ్యవస్థను విస్తరించే పని పెట్టుకుంది. అలాగే, వాస్తవాధీన రేఖ వెంట, భారత భూభాగానికి సమాంతరంగా సాగే రెండు జాతీయ రహదారులను (జీ–219, జీ–318) అప్‌గ్రేడ్ చేసే పనులూ కూడా ఆ ప్రణాళికలో భాగమే. వాటిలో ఒకటి (జీ–219) లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్‌లకు ఎదురుగా ఉంటే, మరొకటి (జీ–318) అరుణాచల్ ప్రదేశ్, సిక్కిమ్‌లకు అభిముఖమైనది కావడం గమనార్హం. తద్వారా ఒకపక్క టిబెట్‌ను తమలో భాగంగా ప్రచారం చేసుకోవడం, మరోపక్క ప్రాథమిక వసతుల పెంపు అనే రెండూ చైనా పెట్టుకున్న లక్ష్యాలు. అసలు 1959 మార్చి 28న దలైలామా నేతృత్వంలోని టిబెటన్ ప్రభుత్వాన్ని అక్రమంగా రద్దు చేసి, టిబెట్‌ను ఆక్రమించుకున్న చరిత్ర బీజింగ్‌ది. కానీ, మొన్న షిజాంగ్ (టిబెట్)లో ప్రజాస్వామ్య సంస్కరణకు 65వ వార్షికోత్సవం అంటూ ఎల్‌ఏసీ వెంట డ్రాగన్ సంబరాలు జరపడం ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నమే!

టిబెట్ నుంచి తైవాన్ దాకా అన్నీ తమవేననే డ్రాగన్ రాజ్య విస్తరణ వాదం ప్రపంచానికి కొత్త కాదు. చైనా సాగిస్తున్న ఈ కొత్త గ్రామాల నిర్మాణం నాటకాన్ని సైతం భారత్ గతంలోనే గమనించకపోలేదు. అందుకనే ఆ జనావాసాలను బీడీసీఏ కింద సరిహద్దు చర్చల నుంచి మినహాయించాలని తేల్చిచెప్పింది. డ్రాగన్ మాత్రం తన వంకర బుద్ధి వదులుకోలేదు. భారత్‌లోని లద్దాఖ్‌కు అభిముఖంగా తాను చట్టవిరుద్ధంగా దురాక్రమణ చేసిన ప్రాంతాల్లోనూ చకచకా గ్రామాలు కట్టే పని చేస్తూనే ఉంది. ఇందుకు ప్రతిగా మన దేశం ఎదురుదాడికి దిగింది. 'సచేతన గ్రామాల పథకం' పేర ఆ సరిహద్దులోని మన జనావాసాలను ఏడాది పొడుగూతా జనంతో ఉండే ఆధునిక పర్యాటక ఆకర్షణలుగా మార్చాలని ప్రయత్నిస్తోంది. అయితే అదింకా పూర్తి కాలేదు. పనులు సాగుతూనే ఉన్నాయి.

తరచూ కయ్యానికి కాలుదువ్వే చైనాకు ముకుతాడు వేయడానికి మనం చేయాల్సినవి ఇంకా చాలానే ఉన్నాయి. క్లిష్టమైన హిమాలయ ప్రాంతాల్లో మనం మనవైపు నిర్మిస్తున్న గ్రామాలు సైతం నిర్మానుష్యంగా మిగలకుండా స్థానిక ప్రజలు ఆవాసం ఉండేలా చూడాలి. దురాక్రమణలు జరగకుండా ఉండాలంటే, స్థానికులు ప్రతి ఒక్కరిలో తామే సరిహద్దును కాపాడే సైనికులమనే భావన కల్పించాలి. మాతృభూమి పరిరక్షణ స్ఫూర్తి రగిలించాలి. అది జరగాలంటే, ముందుగా లద్దాఖ్ లాంటి ప్రాంతాల్లో నిరసన తెలుపుతున్న ప్రజానీకపు న్యాయమైన కోరికలను మన్నించాలి. ప్రాంతీయ సంస్కృతి, ఆకాంక్షలకు అనుగుణంగా మన ఢిల్లీ పాలకులు వ్యవహరించాలి. సొంత ఇంటిని చక్కదిద్దుకొని, పొరుగు ప్రత్యర్థిపై పోరాడే క్రమంలో దేశ ప్రయోజనాల దృష్ట్యా అన్ని పక్షాలూ కలసిరావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, **తిథి:** శు.పాడ్యమి రా.10.06 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** రేవతి ఉ.8.32 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** రా.2.56 నుండి 3.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.19 నుండి 9.07 వరకు తదుపరి రా.10.53 నుండి 11.41 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.20 నుండి 7.55 వరకు, ఉగాది పండగ.

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

నిజంగా అంత నమ్మకం ఉందా?

విశ్లేషణ



ఎస్ఎన్ఎమ్ ఆబ్ది

అయోధ్యలో రామమందిరం ప్రారంభం ఎన్నికల సునామీని సృష్టిస్తుందని బీజేపీ భావించింది. అందుకే దేవాలయం ప్రారంభించిన వెంటనే బీజేపీ ఏకంగా 370 సీట్లు కైవసం చేసుకుంటుందనీ, ఎన్డీయే కూటమి సంఖ్య 400 దాటుతుందనీ గట్టిగా ప్రకటించింది. 1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 400కు పైగా సీట్లు గెలుచుకుంది. అప్పటి నుంచి ఏ పార్టీ కానీ, కూటమి కానీ ఆ రికార్డును అధిగమించలేదు. బీజేపీ వంటి ఆచరణాత్మక పార్టీకి మూడింట రెండు వంతుల మెజారిటీని గెలవడం పిల్లల ఆట కాదని గ్రహించడానికి ఎక్కువ సమయం పట్టలేదు. అందుకే చేజారిపోతోందని భావిస్తున్న అధికారాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవడానికి అన్ని ఉపాయాలనూ ఆశ్రయిస్తోంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీలో భారీ స్థాయిలో విశ్వాస లోపం స్పష్టంగా కనిపిస్తోంది. బీజేపీకి తన గెలుపు పట్ల కచ్చితంగా నమ్మకం ఉంటే, పార్లమెంటు ఎన్నికలకు ముందు జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, బీఆర్ఎస్ పార్టీకి చెందిన కల్వకుంట్ల కవిత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌లను ఈడీ (ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) లేదా సీబీఐ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) అరెస్టు చేసేవా?

ప్రతిపక్ష నేతలపై ఈ విధమైన దాడి, అనివార్యంగా మోదీకి మూడోసారి ప్రధాని పదవి చేపట్టడంపై నమ్మకం లేదన్న సందేశాన్ని పంపుతోంది. మోదీ, ఆయన మనుషులు ఈ దఫా ఎన్నికల్లో 370 సీట్లు గెలుస్తామనీ, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే (నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్) తరపున 400 మంది పార్లమెంటు సభ్యులను గెలిపించుకుంటామనీ బహిరంగంగా ప్రగల్భాలు పలుకుతున్నారు. కానీ వాస్తవానికి వారు స్వీయ సందేహంతోనూ, భయాందోళనలతోనూ కొట్టుమిట్టాడుతున్నారు. అలా కాకపోతే, బీజేపీని గెలిపించేందుకు మోదీ తన పాలనలో 'ప్రతిపక్ష ముక్త్' (ప్రతిపక్షం లేకుండా) ఎన్నికలను నిర్వహించాలని ఎందుకు నిశ్చయించుకుంటారు?

మోదీ చాలా చురుకైనవారు. చాలా తెలివైనవారు. పైగా రాజీపడని, కరడు గట్టిన వాస్తవికవాది. ఊహాజనిత, భ్రమలు కలిగించే ప్రపంచంలో ఆయన జీవించరు. ఓటర్లు గుడ్డిగా భారతీయ జనతా పార్టీకి ఓటు వేయరని ఆయనకు బాగా తెలుసు. నిస్సందేహంగా ఆయన భారతదేశంలో అత్యంత బలమైన, ఆకర్షణీయమైన నాయకుడు. కానీ బీజేపీని విజయ తీరాలకు తీసుకెళ్లడానికి తన ముఖం, వ్యక్తిత్వం సరిపోవని ఆయనకు బాగా తెలుసు.

ప్రభుత్వ పనితీరును బేరీజు వేసుకుని ప్రజలు ఓట్లు వేస్తారని కూడా మోదీకి తెలుసు. నిరుద్యోగం తారాస్థాయికి చేరుకుంది. ఒకవైపు నిరుద్యోగ సంక్షోభం, ఉద్యోగాలు పొందే అదృష్టవంతుల ఆదాయంలో స్తబ్దత ఉండగా, మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలనంటుతున్నాయి, జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. ధనవంతులు మరింత ధనికులుగా, పేదలు మరింత పేదలుగా మారడంతో అసమానత రోజురోజుకూ మరింత ప్రస్ఫుటమవుతోంది. మోదీ, ఆయన సహచరులు వేసుకుంటున్న అంతర్గత అంచనాలలో ఇవన్నీ బీజేపీ అవకాశాలపై అనుమానాలను రేకెత్తిస్తున్నాయి; వారిని గందరగోళానికి గురిచేస్తున్నాయి.

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఆఖరికి తమ మాజీ ముఖ్యమంత్రులను కూడా రంగంలోకి దింపేంత భయంకరమైన పరిస్థితి నెలకొంది. మధ్యప్రదేశ్‌కు చెందిన శివరాజ్‌సింగ్ చౌహాన్, కర్ణాటకకు చెందిన బసవరాజ్ బొమ్మై దీనికి ప్రధాన ఉదాహరణలు. అంతేగాక, పార్టీ అభ్యర్థుల భవితవ్యం తెలుసుకోవడం కోసం... ఉత్కంఠతతో,



విరామం లేకుండా శ్రమిస్తున్న అగ్ర నాయకులు... సీటు తర్వాత సీటు విషయంలో కులపరమైన అంకగణితాన్ని బేరీజు చేసుకుంటున్నారు.

1994–95లో కాంగ్రెస్ పార్టీ సమర్పించిన పన్ను ఖాతాలపై, ఆ పార్టీకి వ్యతిరేకంగా ఆదాయపు పన్ను శాఖ మదింపు చర్యలను తిరిగి ప్రారంభించాల్సినంత తీవ్రమైన అభద్రతాభావంతో బీజేపీ ఇప్పుడు కొట్టుమిట్టాడుతోంది. ఇది ఖననం చేసిన మూడు దశాబ్దాల తర్వాత పోస్ట్‌మార్టం పరీక్ష కోసం శవాలను తవ్వినట్లే అవుతుంది. ఒకవైపు కాంగ్రెస్ అవినీతిపై గురిపెడుతూ, దాన్ని దొంగలు, దొంగల పార్టీ అని మోదీ, ఇతర బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు నేరచరిత్ర ఉన్న నేతలను బీజేపీ ఆలింగనం చేసుకుంటోంది.

20 పోలీసు కేసులు, అడవులు, గనులను దోచుకున్నందుకుగాను తొమ్మిది సీబీఐ కేసులతోపాటు తనపై కేసుల్లో బెయిల్ కోసం జడ్జికి 40 కోట్లు లంచం ఇవ్వడానికి ప్రయత్నించిన గాలి జనార్దన్ రెడ్డిని ఇప్పుడు బీజేపీ తనలో (తిరిగి) చేర్చుకుంది! అధికార పక్షాన్ని వాషింగ్ మెషీన్‌గా ప్రతిపక్షం అభివర్ణించడాన్ని ఇటువంటి ఫిరాయింపులు బలపరుస్తాయి. దీని ద్వారా కళంకిత నాయకులు నిష్కళంకంగా శుభ్రంగా బయటపడతారు. ఎనిమిది నెలల క్రితం బీజేపీలో చేరిన ప్రఫుల్ పటేల్‌పై ఉన్న భారీ అవినీతి కేసుపై సీబీఐ గత వారం మూసివేత నివేదికను దాఖలు చేసింది. బీజేపీ సిగలో మరో కలికితురాయి నవీన్ జిందాల్! 'కోల్‌గేట్' నిందితుడైన హరియాణాకు చెందిన ఈ కాంగ్రెస్ ఎంపీ, తన తల్లి సావిత్రి జిందాల్‌తో కలిసి భారతదేశాన్ని అభివృద్ధి చేయడం కోసం మోదీతో కలిసి పని చేసేందుకు బీజేపీలోకి వెళ్లారు. అవినీతి కేసుల్లో కూరుకుపోయిన ఇతర పార్టీలకు చెందిన రాజకీయ నాయకులను తన రెక్కల కింద పొదువుకోవడానికి బీజేపీని నడిపిస్తున్న కారణం ఏమిటి?

1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 400కు పైగా సీట్లు గెలుచుకుంది. అప్పటి నుంచి ఏ పార్టీ కానీ, కూటమి కానీ ఆ రికార్డును ఇప్పటి వరకూ అధిగమించలేదు. 1984 తర్వాత మూడు దశాబ్దాల పాటు ఏ ఒక్క పార్టీ కూడా 272 సీట్లు కూడా గెలుచుకుని సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. కానీ 2014లో కాంగ్రెస్ పార్టీ అసంఖ్యాక వైఫల్యాలను ఉపయోగించుకుని 'అచ్చే దిన్' (మంచి రోజులు) వాగ్దానం చేయడం ద్వారా బీజేపీకి 282 సీట్లు వచ్చాయి. ఇక 2019లో, పుల్వామాలో కేంద్ర బలగాలపై జరిగిన మారణకాండను ఉపయోగించుకోవడం ద్వారా బీజేపీ తన సంఖ్యను అనూహ్యంగా 303కు పెంచుకుంది. పుల్వామాలో రక్తపాతానికి ముందు, బీజేపీ చాలా తక్కువ సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేశారు. కానీ పుల్వామా ఆ పార్టీకి గేమ్ ఛేంజర్ అయింది. జనవరి 22న అయోధ్యలో రామ మందిరాన్ని ప్రారంభించిన తర్వాత, అది ఏప్రిల్–మేలో ఎన్నికల సునామీని సృష్టిస్తుందని బీజేపీ భావించింది. అందుకే దేవాలయం ప్రారంభించిన వెంటనే బీజేపీ ఏకంగా 370 సీట్లు కైవసం చేసుకుంటుందనీ, ఎన్డీయే సంఖ్య 400 దాటుతుందనీ, లౌకిక–ఉదారవాద భారత్‌పై హిందుత్వ విజయానికి సంకేతంలా గొంతెత్తి ప్రకటించడం ప్రారంభించింది.

కానీ బీజేపీ వంటి ఆచరణాత్మక పార్టీకి ఈసారి మూడింట రెండు వంతుల మెజారిటీని గెలవడం పిల్లల ఆట కాదని గ్రహించడానికి ఎక్కువ సమయం పట్టలేదు. ఉత్తర భారతదేశంలో బీజేపీకి ఇప్పటికే ఉన్న దానికంటే ఎక్కువ సీట్లు కైవసం చేసుకునే అవకాశం లేదు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో దాని సంఖ్యను పెంచుకోవడానికి సంస్థాగతమైన శక్తి లేదు. 2019లో కర్ణాటకలోని 28 ఎంపీ స్థానాలకు గానూ బీజేపీ 25 స్థానాలను కైవసం చేసుకుంది. కానీ ఇప్పుడు సిద్ధరామయ్య, శివకుమార్‌లు అధికారంలో ఉన్నందున, బీజేపీ తక్కువ సీట్లు గెలుచుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు. ఏక్‌నాథ్ షిండేకి చెందిన శివసేనతో, అజిత్ పవార్‌కి చెందిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీతో పొత్తు ద్వారా మహారాష్ట్రలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ, ఎన్డీఏ 2019లో గెల్చుకున్న 48 సీట్లలో 41 స్థానాలకు మళ్లీ చేరుకునే అవకాశం లేదు. అదే విధంగా బిహార్‌లో ఎన్డీఏ 40కి 39 ఎంపీ సీట్లు గెలుచుకుంది. నితీశ్ కుమార్ ఎన్ డీఏలోకి తిరిగి వచ్చినప్పటికీ ప్రస్తుత చిత్రం అంత ఆశాజనకంగా లేదు.

ఈ అంశాలన్నీ బీజేపీ విశ్వాస సంక్షోభాన్ని, తీవ్రమైన అభద్రతను, నిర్వీర్యపర్చే సందేహాలను వివరిస్తాయి. అందుకే నిజానిజాలు బయటపడే తరుణంలో బీజేపీ భయాందోళనలకు గురవుతోంది. అందుకే చేజారిపోతోందని భావిస్తున్న అధికారాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవడానికి అన్ని ఉపాయాలనూ ఆశ్రయిస్తోంది.

వ్యాసకర్త విదేశాంగ విధానం, దేశీయ రాజకీయాల వ్యాఖ్యాత
('ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎందుకలా?



ఆజాద్ హింద్ ఫౌజ్‌లోని భిన్న దళాలకు సుభాష్, గాంధీ, నెహ్రూ, ఝాన్సీ రాణి పేర్లు పెట్టారు. ఎందుకు సుభాష్ చంద్రబోస్ వారసత్వాన్ని బీజేపీ లాక్కోవాలనుకుంటోంది?
– సందీప్ పాండే, సోషలిస్ట్ పార్టీ(ఇండియా) ప్రధాన కార్యదర్శి

ఎప్పుడూ రాజకీయాలేనా?



ఇప్పుడు వాళ్లు 400కు పైగా అని మాట్లాడుతున్నారు. మే నెల చివరి వరకు ఆగండి, అది 250 అవుతుంది. జూన్ మొదటి వారానికల్లా అది 175–200 వరకు ఉండవచ్చు.... నేను మాట్లాడుతున్నది అర డజను అల్ఫాన్సో మామిడిపళ్ల గురించి! ప్రతీ సందేశం రాజకీయాల గురించే కానక్కరలేదు!!
– ఎస్.వై. ఖురేషి, కేంద్ర మాజీ ఎన్నికల ప్రధానాధికారి

ఇక అవి ఉండవా?



ప్రస్తుత ఎన్నికల్లో ప్రమాదంలో ఉన్న ఒక ముఖ్యాంశం ఏమిటంటే, రాజ్యాంగం హామీ ఇచ్చిన భావస్వేచ్ఛ అనేది ఇక లేకుండా పోతుందా? రాజ్యాంగం పౌరులకు హామీ ఇచ్చిన శాంతియుత నిరసన హక్కు అనేది చరిత్ర కానుందా?
– సుధీంద్ర కులకర్ణి, పొలిటికల్ యాక్టివిస్ట్

అప్పుడే మొదలా?



యూకేలో 40 లక్షల మంది ముస్లింలు ఉన్నారు. అందులో మూడోవంతు మంది రానున్న ఇరవై ఏళ్లలో అక్కడ షరియా చట్టం కొద్దిమేరకు గానీ, చాలావరకుగానీ వాంఛనీయం అని నమ్ముతున్నారు. ఇలాంటివారి సంఖ్య సుమారు 15 లక్షలు.
– గీర్ట్ వైల్డర్స్, నెదర్లాండ్స్ నాయకుడు

సంప్రదాయమే తిరుగుబాటు



మీరు 18 ఏళ్ల పైబడిన వాళ్లయి, తిరుగుబాటు దారుగా ఉండాలనుకుంటే దీన్ని ప్రయత్నించండి: మీరు మీ దేశాన్ని ప్రేమిస్తామనీ, దేవుడిని నమ్ముతామనీ, పెళ్లి చేసుకోవాలనుకుంటున్నామనీ, పిల్లల్ని ఒక స్థిరమైన చిన్న కుటుంబంలో పెంచుతామనీ మీ క్లాస్‌మేట్స్‌కు చెప్పిచూడండి. ఏం జరుగుతుందో చూడండి.
– వివేక్ రామస్వామి, యూఎస్ఏ నాయకుడు

ఎన్నికల చదరంగం



పశ్చిమ ఉత్తరప్రదేశ్ కుల చదరంగంలో, ప్రతిపక్షం ముస్లింలను పక్కనపెట్టి, మరింతమంది అగ్రకుల అభ్యర్థులను నిలబెట్టింది. 2019 అంకెలతో పోల్చితే, 24 స్థానాల్లో ముస్లింలు, ఓబీసీల వాటాను కాంగ్రెస్–సమాజ్‌వాదీ తగ్గించి, హిందూ 'అగ్ర కులస్థు'లనూ, దళితుల సంఖ్యనూ పెంచాయి.
– అర్ఫా ఖానమ్ షేర్వానీ, జర్నలిస్ట్

ఉత్తమ పౌరులు



యూఎస్ఏలోని ప్రతీ ఐదుగురు వైద్యుల్లో ఒకరు భారతీయులు. వాళ్లు చట్టానికి లోబడి, అక్కడి ఉత్తమపౌరులుగా మసలుకుంటున్నారు. అది మన సంస్కృతి, సంప్రదాయాల్లోనే ఉంది. మన పూర్వీకులు మనకు నేర్పినదది. ఇదే మానవీయ అంశలో భారతీయులను అగ్రస్థానంలో నిలబెడుతోంది.
– అనిల్ చోప్రా, రిటైర్డ్ ఎయిర్ మార్షల్

ఇన్ బాక్స్

బౌద్ధ మార్క్సిస్ట్ మేధావి

యవ్వన దశలోనే ప్రపంచ పర్యటన చేసి అనేక గ్రంథాలు అవపోసన పట్టిన కేదార్‌నాథ్ పాండే... రాహుల్ సాంకృత్యాయన్‌గా ప్రసిద్ధి చెందారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆజాంగఢ్ జిల్లా పందహా గ్రామంలో 1893లో ఏప్రిల్ 9న జన్మించారు. టిబెట్, శ్రీలంక, ఇరాన్, చైనా, రష్యాలలో పర్యటించి అనేక భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. అనేక గ్రంథాలను రచించడమే గాక మంచి వక్తగానూ పేరుగాంచారు.



రాహుల్ సాంకృత్యాయన్

పురాతన బౌద్ధ గ్రంథాలు వెలికి తీసి, అనువాదాలు చేసి, ప్రపంచంలో ఉన్న బౌద్ధులకు మహత్తర సాహిత్యాన్ని అందించారు. మతం, తత్వశాస్త్రం, భాష, సైన్స్, సోషియాలజీపై అనేక రచనలు చేశారు. అందులో 'ఓల్గా నుంచి గంగకు' ఒక మంచి రచన. నలంద, విక్రమశిల విశ్వవిద్యాలయాలు, కశ్మీర్–లద్దాఖ్ మీదుగా టిబెట్ వెళ్లి అనేక గ్రంథాలు సంపాదించారు. ఈ సమయంలోనే 'హిందీ–టిబెటన్' నిఘంటువు రచించారు. హ్యుయాన్‌త్సాంగ్ తరువాత అత్యధిక పుస్తకాలు సేకరించిన వ్యక్తి సాంకృత్యాయన్.

రాహుల్ స్వాతంత్ర్య ఉద్యమంలో మంచి పాత్ర పోషించారు. దేశ స్వాతంత్ర్యం కోసం మూడేళ్లు జైలుశిక్ష అనుభవించారు. 1940లలో మార్క్సిస్ట్‌గా మారి, భౌతిక వాదిగా పేరుపొందారు. 'అఖిల భారత కిసాన్ సభ' అధ్యక్షుడుగా అనేక పోరాటాలు చేశారు. ఉద్యమ సమయంలో లాఠీ దెబ్బలు తిన్నారు. ఒక సందర్భంలో తలపై బలమైన గాయమైంది. జీవితం చివరి రోజులను మతిమరపుతో గడిపారు. 1958లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1963లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. ఈయనపై ఉన్న గౌరవంతో పర్మపథ్ గ్రామ ముఖద్వారానికి 'రాహుల్ గేట్' అని పేరు పెట్టారు. చిన్నతనం నుండి మరణించే వరకు తన జీవితాన్ని సత్యం కోసం, సర్వమానవాళి సౌభాగ్యం కోసం ధారపోసిన మహా మనీషి ఆయన.

– ఐ. ప్రసాదరావు, కాకినాడ
(నేడు రాహుల్ సాంకృత్యాయన్ జయంతి)

కులవృత్తుల ఆరంభ దినం

సందర్భం



నాగపట్ల భక్తవత్సల రెడ్డి

సంప్రదాయ వృత్తులే జీవనాధారంగా బతికే పల్లెల్లో... వృత్తినీ, పనిముట్లనూ గౌరవ చిహ్నంగా గుర్తిస్తారు. తమ వృత్తి కార్యకలాపాలకు ఉగాది పర్వదినాన్ని ఆరంభ దినంగా భావిస్తారు. ఒక వృత్తి మరో వృత్తి మీద ఆధారపడుతూ పరస్పరం సహకరించుకొంటూ, పరిపోషించుకొంటూ సాగిన సంప్రదాయ వృత్తిని కొనసాగించడంలో పారంపర్యంగా అందిన అనుభవ పూర్వక నైపుణ్యం, క్రమ విధానం, పనిముట్లు తదితర వృత్తి విశేషాలను యువతరానికి గుర్తు చేస్తూ, తాము గుర్తుకు తెచ్చుకొనే పండగ ఇది. వృత్తి దైవదత్తమనీ, పవిత్రమైందనీ, ఒక తరం మరో తరానికి ప్రతీకాత్మకంగా చూపే పండగ ఉగాది. కాని దురదృష్టవశాత్తు నేడు పంచాంగ శ్రవణానికీ, ఉగాది పచ్చడికీ మాత్రమే పరిమితమైపోయింది. అసలు పోయి కొసరు మిగిలింది.

ఈ రోజు లక్ష్మీదేవి పేటలో ఉగాది నాడు ఎడ్లను కడిగి సింగారించి, కొత్త పగ్గాలు, వార్నెలు కట్టి 'ఎడ్ల పండగ' చేస్తారు. ఇంటి బలగాలం ఉన్న వ్యక్తి ముందు కొంద్ర వేస్తాడు. బూర్గుపేటలోని నేతగాని వారు కొత్త సాలు వేస్తారు. నారాయణపూర్‌లో మున్నూరు కాపులు తమ పొలంలో ఉన్న చెట్టును నరికి, నాగలి కట్టి చేను దున్నుతారు.

ఆదిలాబాదులోని కోలాములు తెల్లవారు జామునే లేచి ఇంటిని అలంకరించుకుని, కందుల గుడాలు, మక్కపిండితో చేసిన కుడుములు మోదుగ ఆకుల్లో పెట్టుకుని అరక, ఎద్దులతో చెలకకు పోతారు. అక్కడ చెత్తా చెదారం తోసి కాల్చి, గుడాలు, కుడుములతో చెలక మధ్యలో నైవేద్యం పెట్టి, ఎడ్లకు తినిపించి అరక కట్టి అయిదు సాళ్లు దున్నుతారు. ఇది 'వరుడేకాద్'గా ప్రసిద్ధి. గోండులు గోధుమలు, కందులు, మక్కలతో గుడాలు చేసి సాగుభూమిలో చల్లు తారు. పొలంలో తూర్పు వైపున్న చెట్టు నరికి పేడ ఏరి అక్కడ గుడాలు, పానకం చల్లి... కొంత తాము తిని ఇంటికి వస్తారు. దీని తర్వాత ఎప్పుడైనా పొలం పని ఆరంభించవచ్చు.

తూర్పు గోదావరి జిల్లా ఆదుర్రులో కాపులు



తలంటు స్నానం చేసి, అరకు కడిగి పసుపు, కుంకుమ పెట్టి పూజించి ఎవ్వరూ తమను చూడకుండా వెళ్లి చేనులో మూడుసాళ్లు దున్ని ఇంటికి వస్తారు. దీన్నే 'దొంగేరు' అంటారు. పల్లిపాలెంలో తెల్లవారు జామున లేచి స్నానం చేసి అరకు, మేడి, చెర్నాకోల, ఎద్దుల్ని అలంకరించుకుని, పూజించి పొలంలో ఈశాన్యం మూల తూర్పు ముఖంగా కొంద్ర వేసి అయిదు సాళ్లు దున్ని వస్తారు. ఇది దొంగ ఏరువాక.

అమ్మాపురంలో విశ్వ బ్రాహ్మణులకు ఉగాది అతి పెద్ద పండుగ. తమ వృత్తి పనిముట్లను కడిగి; పసుపు, నూనె కలిపి పనిముట్లకు పూసి, కుంకుమ బొట్లు పెట్టి కంకణాలు కట్టుకుని వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ముందు పెడతారు. సెనగపప్పు వేసి వండిన పరమాన్నంలో ఎండు కుడుక, బెల్లం, నెయ్యి కలిపి ఐదు పడులుగా... ఉగాది పచ్చడి, భక్ష్యాలతో పాటు దేవునికి నైవేద్యం ఇస్తారు. ఈ సందర్భంలో అష్టకాలు కూడా చదువుతారని అంటారు. అప్పుడు కైవత్తులు (చీపురుపుల్ల కొనకు దూది చుట్టినవి) నూనెలో ముంచి వెలిగిస్తారు. ఉగాది రోజు రాత్రి కానీ, తెల్లవారు జామున కానీ వర్జ్యం లేకుండా చూసి ఇంటి యజమాని దేవుని పూజించి పనిముట్లను కదిలించి హస్తవాసి ఉన్న రైతును పిలిచి కంకణం కట్టి పని ప్రారంభిస్తారు. ఆ రైతు ధాతు పూజగా సోలెడు బియ్యం, ఐదు రూపాయలు పెడతారు. గొల్లవారు ఉగాది రోజు శుచిగా చెరువు కట్ట దగ్గరకు పోయి తుమ్మల మైసమ్మను పూజించి, నైవేద్యం వండి ఐదు పడులు పెట్టి కల్లు లేదా సారా ఆరబోసి, యాటను కోసి పూజిస్తారు.

చౌళ్లపల్లిలో కోమట్లు ఉగాది పచ్చడి, భక్ష్యాలు, పరమాన్నం నైవేద్యంగా పెట్టి ఉగాది పచ్చడి తాగుతారు. హస్తవాసి ఉన్న ఒకరిని పిలిచి అతనికి పసుపు, కుంకుమ, బెల్లం మాత్రమే మొదట అమ్మి... డబ్బు తీసుకొన్నాకనే ఇతరులకు అమ్ముతారట. కురుమ వాళ్లు పొద్దున్నే మందకాడికి పోయి గొర్రెలను తెచ్చి గొంగడి పరిచి వాటి తోకలు, డెక్కలు తీస్తారు. పాలు పిండి వాటిని పుట్టలో పోస్తారు. చెలకలున్నవారు కొమ్ము కొట్టుకొచ్చుకొంటారు. అగ్రంపాడులో అవుసలి వారు తమ పనిముట్లను శుభ్రంగా కడిగి వాటికి కంకణాలు కట్టి పూజిస్తారు. ఇలా తెలుగు నేల అంతటా వ్యవసాయదారుల దగ్గర నుంచి ఇతర కుల వృత్తులను అనుసరించేవారి వరకూ అందరూ ఉగాదిని ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు.

వ్యాసకర్త విశ్రాంత ఆచార్యులు
మొబైల్: 94401 70703

నిత్య నూతన వత్సరం

కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పే సమయం వచ్చింది. ఈ ఏడు ఉగాది పండుగ (9 ఏప్రిల్), ఎన్నికల పండగతో కలిసి రావడం విశేషం. ఇందువల్ల సంవత్సర ఫలాలు ఎలా ఉంటాయన్న ఉత్కంఠ ఎప్పటికన్నా ఎక్కువగా ఉండటం సహజం. కాబట్టి ఈసారి పంచాంగ శ్రవణ కార్యక్రమాలకు ఎప్పటికన్నా అధికంగా ప్రజాదరణ లభించడం ఖాయం.



జ్యోతిర్మయం

నిజానికి, 'రాబోయే కొత్త సంవత్సరం ఎలా ఉండబోతున్నది?' అన్న ప్రశ్న 'ఈ ఏటి ఉగాది పచ్చడి ఎలా ఉండబోతున్నది?' అన్న ప్రశ్న లాంటిది. దినుసులూ అవే, తయారీ విధానం అదే కనుక ఈ ఏటి ఉగాది పచ్చడి రుచి, ఇప్పటివరకు రుచి చూసిన ఉగాది పచ్చళ్ళ కంటే చెప్పుకోదగ్గంత భిన్నంగా ఉండే అవకాశం లేదు. ఈ ఏటి పచ్చడి కూడా తీపీ, చేదూ, వగరూ, ఉప్పనా, ఘాటూ, పులుపూ అనే షడ్రుచుల కలగలుపుగానే ఉంటుంది. ఉత్సాహంతో, ధైర్యంతో, ఆశాభావంతో కొత్తను ఆప్యాయంగా ఆహ్వానించే ధీరుడికి ఆ కలగలుపు ఎప్పటిలాగే కమ్మగానే ఉంటుంది. 'నాకుషస్సులు లేవు, నాకుగాదులు లేవు' అని భీష్మించుకు కూర్చొని, కష్టం రాకముందే దుఃఖించడం ఆరంభించే నిస్సంతోషులకు ఉగాది పచ్చడిలో వేపపూత చేదు మాత్రమే స్ఫురిస్తుంది.

కాలం ఎలాగూ మార్పుల ప్రవాహమే. సుఖ దుఃఖాలూ, శుభాశుభాల నిరంతర పరంపర. ఈ సుఖాసుఖాల కలగలుపులన్నీ ఇంతకు ముందు కూడా చూస్తూ వచ్చినవే. మారుతూ ఉండటంలో మార్పు లేదు. కానీ కనిపిస్తూ వచ్చే మార్పులు ఎప్పటికప్పుడు నిత్య నూతనాలు, నవనవోన్మేషాలు. సర్వమూ ఈశ్వర ప్రసాదమూ, భగవద్విలాసమూ అని భావించి నారాయణుడి మీద నమ్మకం ఉంచినవాళ్ళు కాలగతిలో కలిగే సుఖ దుఃఖాల వల్ల విచలితులు కారు అంటుంది భాగవతం. అన్ని రుచులూ కలిస్తేనే అందమైన అనుభవం. అలాంటి అందమైన అనుభవాలను ఆహ్వానించి, ఆస్వాదించే ఆత్మస్థైర్యాన్ని ఆ జగదీశ్వరుడు అందరికీ ప్రసాదించాలని, క్రోధి నామ వత్సర ఉగాది శుభ సమయంలో ప్రార్థన.

– ఎం. మారుతి శాస్త్రి
(నేడు ఉగాది పర్వదినం)

ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ కొట్టివేత

సాక్ష్యాల నాశనం, సాక్షులను ప్రభావితం చేశారనేందుకు ప్రాథమిక ఆధారాలున్నాయి

- ఆమె సమాజంలో పలుకుబడి గల వ్యక్తి.. బెయిల్ ఇస్తే మళ్లీ సాక్షులను ప్రభావితం చేయొచ్చు
- మైనర్ కుమారుడి పరీక్షలకు ఆమె నైతిక మద్దతు అక్కర్లేదు.. ఆమె బంధువులు చూస్తారు
- 21 పేజీల తీర్పు వెలువరించిన ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణంలో మనీలాండరింగ్ జరిగిందన్న కేసులో ప్రమేయమున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కొట్టేసింది. ఈ కేసులో సాక్ష్యాలు నాశనం చేయడంతోపాటు సాక్షులను ప్రభావితం చేయడంలో కవిత ప్రమేయం ప్రాథమికంగా కనిపిస్తోందని... ఆమెను బలిపశువుగా మార్చే యత్నం జరుగుతోందనేందుకు వీల్లేదని వ్యాఖ్యానించింది. కవిత నిస్సందేహంగా పలుకుబడిగల మహిళ అయినందున బెయిల్ ఇస్తే మరోసారి సాక్షులను ప్రభావితం చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. అందువల్ల ఆమెకు మధ్యంతర బెయిల్ నిరాకరిస్తున్నట్లు స్పష్టం చేసింది. మైనర్ కుమారుడి వార్షిక పరీక్షల నేపథ్యంలో తల్లిగా తన పర్యవేక్షణ అవసరమైనందున మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా సోమవారం ఈ మేరకు తీర్పు వెలువరించారు. బెయిల్ నిరాకరణకు కారణాలను 21 పేజీల తీర్పులో పేర్కొన్నారు.

చిన్న కుమారుడికి బంధువుల అండ ఉందిగా

''పిటిషనర్ (కవిత) 16 ఏళ్ల మైనర్ కుమారుడికి ఇప్పటికే 50 శాతం పరీక్షలు పూర్తయ్యాయని న్యాయవాదులు తెలిపారు. కానీ కుమారుడి చదువు, మధ్యంతర బెయిల్ కోరిన రోజుల సంఖ్య, ఇతర కుటుంబ సభ్యుల వివరాలు పొంతన లేకుండా ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ మైనర్ కుమారుడు అన్నయ్య, తండ్రి, అత్తలను కలిగి ఉన్నాడు. వారంతా అతనికి తగిన మద్దతు ఇవ్వలేరనడానికి ఎలాంటి కారణం కనిపించట్లేదు. చిన్న కుమారుడి పరీక్షల వేళ తల్లి నైతిక మద్దతు ఎంతో అవసరమని న్యాయవాదులు చెబుతున్నారు. కానీ 19 ఏళ్ల వయసున్న కవిత పెద్ద కుమారుడు స్పెయిన్‌లో చదువుతున్నాడు. భౌతికంగా తల్లిదండ్రులు దగ్గర లేకున్నా విదేశాల్లో అతను చదువుకోగలుతున్నప్పుడు బంధువుల సమక్షంలో ఉంటున్న చిన్న కుమారుడు పరీక్షలు రాయలేడనడం సమంజసంగా కనిపించట్లేదు. పిల్లల పరీక్షల ఆందోళన పరిష్కరించడానికి తల్లి తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదనడం మధ్యంతర బెయిల్ మంజూరుకు తగిన కారణంగా కనిపించట్లేదు. కవిత కేసు పరిష్కారం విషయంలో మైనర్ తండ్రి బిజీగా ఉన్నారన్న కారణం సైతం ఆమోదయోగ్యం లేదు. అందుకే మైనర్ కుమారుడికి అతని అత్తలు తగిన మద్దతు ఇవ్వాల్సిందిగా కోర్టు సూచిస్తోంది.

కేసులో ప్రాథమికంగా ప్రమేయం కనిపిస్తోంది

''మాజీ ఎంపీగా, ప్రస్తుత ఎమ్మెల్సీగా, ఉన్నత విద్యావంతురాలిగా కవిత సమాజంలో పలుకుబడి గలవారని నిస్సందేహంగా చెప్పొచ్చు. అంతేకానీ ఈ కేసులో ఓ నిస్సహాయ మహిళను బలిపశువును చేస్తున్నారని ఏ ప్రమాణాల ప్రకారమూ చెప్పేందుకు వీలు కనిపించట్లేదు. నేరాల విషయంలో కవిత చురుకైన ప్రమేయం, సాక్షులను ప్రభావితం చేసే ప్రయత్నంతోపాటు ఉద్దేశపూర్వకంగా సాక్ష్యాలు ధ్వంసం చేస్తారనే విషయంలో కోర్టు ముందుంచిన అంశాలను పరిశీలిస్తే కవిత ప్రమేయం ప్రాథమికంగా కనిపిస్తోంది. అందువల్ల మహిళ కాబట్టి పీఎంఎల్ఏ చట్టం సెక్షన్ 45 (1) ప్రకారం విచక్షణకు ఆమె అర్హురాలు కాదు. ఈ పరిశీలనలతో బెయిల్ దరఖాస్తు తిరస్కరిస్తున్నా'' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

నేడు న్యాయమూర్తి ముందుకు కవిత

జ్యుడీషియల్ కస్టడీ పూర్తి కానుండటంతో మంగళవారం ఉదయం ఎమ్మెల్సీ కవితను తీహార్ జైలు అధికారులు న్యాయమూర్తి కావేరి బవేజా ముందు హాజరుపరచనున్నారు. అంతకుముందు మధ్యంతర బెయిల్‌ను కోర్టు నిరాకరించడంతో రెగ్యులర్ బెయిల్ కోసం కవిత వేసిన పిటిషన్‌ను త్వరగా విచారించాలని ఆమె తరఫు న్యాయవాదులు జడ్జిని కోరారు. దీంతో గత విచారణ సమయంలో రెగ్యులర్ బెయిల్‌పై ఈ నెల 20న విచారిస్తానన్న న్యాయమూర్తి... తాజాగా ఈ నెల 16న విచారణ చేపడతానని పేర్కొన్నారు.

కటకటాల్లోకి రహీల్

- ప్రజాభవన్ వద్ద ప్రమాదం కేసులో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు ప్రధాన నిందితుడు
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు...జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం చంచల్‌గూడలోని జైలుకు

సాక్షి, హైదరాబాద్: బోధన్ మాజీఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అమీర్ కుమారుడు రహీల్‌అమీర్ ఎట్టకేలకు పోలీసులు చిక్కాడు. రెండున్నర నెలలుగా పరారీలో ఉన్న ఇతడిని పంజగుట్ట అధికారులు సోమవారం తెల్లవారుజామున ఎయిర్‌పోర్ట్‌లో పట్టుకున్నారు. ప్రజాభవన్ ఎదురుగా చోటుచేసుకున్న 'బీఎండబ్ల్యూ కారు ప్రమాదం'కేసులో రహీల్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఘటన జరిగిన నాటి నుంచి ఇతడు దుబాయ్‌లోని తన తండ్రి వద్ద తలదాచుకున్నాడు. అక్కడ ఉంటూనే కేసు నుంచి తప్పించుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ నెల 19లోపు పోలీసుల ఎదుట హాజరుకావాల్సి ఉండటంతో రహీల్ తిరుగు పయనమయ్యాడు. సమాచారం అందుకున్న పంజగుట్ట పోలీసులు సోమవారం తెల్లవారుజామున శంషాబాద్ విమానాశ్రయం వద్ద మాటు వేసి పట్టుకున్నారు. రహీల్‌ను న్యాయమూర్తి ముందు హాజరుపరచగా ఈ నెల 22 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించి, చంచల్‌గూడ జైలుకు తరలించారు. తదుపరి విచారణ నిమిత్తం పోలీసు కస్టడీకి కోరుతూ మంగళవారం పిటిషన్ దాఖలు చేయనున్నారు.'ఈ కేసులో ఇప్పటి వరకు 15 మందిని అరెస్టు చేశాం. హైకోర్టు ఆదేశాల మేరకు బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అమీర్ దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాల్సి ఉంది. కేసును అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నాం'అని పశ్చిమ మండల డీసీపీ ఎస్ఎం.విజయ్‌కుమార్ చెప్పారు.

హత్య చేసి.. ఆపై ఇన్‌స్టాలో రీల్ పోస్ట్ చేసి

పాత కక్షలతోనే తేజస్ హతం


తేజస్


తరుణ్‌రాయ్

నిజాంపేట్: ప్రతీకారంతో రగిలిపోతున్న ఓ గ్యాంగ్ ప్రత్యర్థి కోసం కాపు కాసి పక్కా స్కెచ్‌తో అదును చూసి అంతమొందించింది. ఆపై హత్యకు ఉపయోగించిన కత్తులు పట్టుకొని నృత్యాలు చేస్తూ రక్తంతో తడిసిన చేతులతో రీల్స్ చేసి లెక్క సరిపోయింది..పగ తీర్చుకున్నామంటూ ఇన్‌స్టాగామ్‌లో పోస్టు పెట్టి సంచలనం సృష్టించింది. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్ఆర్‌నగర్ పీఎస్ పరిధిలోని బోరబండలో నివాసముండే షేక్ షరీఫ్ గ్యాంగ్‌స్టర్. చిన్నచిన్న నేరాలకు పాల్పడుతుండేవాడు. ఓ కేసు విషయంలో షేక్ షరీఫ్ జైలుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆయన దగ్గర నంబర్–2గా ఉన్న తరుణ్‌రాయ్ గ్యాంగ్ మొత్తానికి తన ఆధీనంలోకి తీసుకున్నాడు. దీంతో షరీఫ్, తరుణ్‌రాయ్‌ల మధ్య విభేదాలు మొదలయ్యాయి. 2023లో దసర పండగరోజున రావణ దహనం సందర్భంగా షరీఫ్ గ్యాంగ్ తరుణ్‌రాయ్‌ను హత్య చేసింది. ఈ ఘటనలో ఏడుగురు పాలుపంచుకోగా, ప్రగతినగర్‌లో హత్యకు గురైన తేజస్ అలియాస్ తేజు అలియాస్ డీల్ ఏ3గా ఉన్నాడు.

రెండు నెలల క్రితం బెయిల్‌పై వచ్చిన తేజస్

బెయిల్‌పై బయటకు వచ్చాక తేజస్ ప్రత్యర్థుల నుంచి ప్రమాదం పొంచి ఉందని ముందే గ్రహించి బాచుపల్లి పరిధిలోని ప్రగతినగర్‌లోబతుకమ్మకుంట వద్ద ఓ అపార్ట్‌మెంట్‌లో తల్లితో కలిసి ఉంటున్నాడు. తన గ్యాంగ్ స్నేహితులతో మాట్లాడటం, కలిసి పార్టీలు చేసుకోవడం జరిగేది. అయితే ఈ క్రమంలో తేజస్ తన స్నేహితులతో నెక్ట్స్ టార్గెట్ సమీర్ అని..అతడిని కూడా లేపేస్తామంటూ మాట్లాడినట్టు ప్రత్యర్థులకు తెలిసింది. ఈ క్రమంలో ఆదివారం తేజస్ తల్లి ఇంట్లో లేకపోవడంతో బోరబండ నుంచి స్నేహితులు మహేశ్, శివప్ప, మహేశ్‌లు ప్రగతినగర్‌కు వచ్చారు. తేజస్ ఇంట్లో నలుగురు కలిసి మద్యం సేవిస్తున్నారు. వచ్చిన ముగ్గురు స్నేహితుల్లో శివప్ప రెండు గ్యాంగ్‌లకు కామన్ ఫ్రెండ్. దీంతో ప్రత్యర్థులు శివప్పతో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. మద్యం మత్తులో ఉన్న తేజస్‌ను హత్య చేయాలని పథకం వేసి, శివప్పతో లోకేషన్ షేర్ చేయించుకున్నారు. దాని ఆధారంగా ప్రగతిగనగర్‌లోని తేజస్ ఇంటి సమీపంలోకి చేరుకున్నారు.. తెల్లవారుజామున ఫుల్‌గా తాగిన తేజస్ ఇంటి నుంచి బయటకు వచ్చాడు. బైక్ ఎక్కే క్రమంలో ఒక్కసారిగా తేజస్‌పై కత్తులతో సమీర్, శివప్ప, సిద్దేశ్వర్, జయంత్‌లు విచక్షణరహితంగా పొడిచి హత్య చేశారు. అనంతరం కత్తులు చూపుతూ రీల్స్ చేసి ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశారు. ఈ రీల్స్‌కు రక్తచరిత్ర సినిమాలోని పాటను జత చేశారు. హత్యకు పాల్పడిన వారిని, తేజస్‌తో మద్యం సేవించిన వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.

రాహుల్ గాంధీపై ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన రాహుల్‌గాంధీపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్, కర్నె ప్రభాకర్ సోమవారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌పై తుక్కుగూడలో రాహుల్ గాంధీ పలు నిరాధార ఆరోపణలు చేశారని, ఆయన ప్రతిష్టకు భంగం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఫోన్లను టాప్ చేయడంతో పాటు ప్రభుత్వం మారిన వెంటనే డేటాను ధ్వంసం చేశారని రాహుల్ అసత్య ఆరోపణలు చేశారన్నారు.

మంత్రి కొండా సురేఖపై...

కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఈసీకి ఫిర్యాదు చేసింది. ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేటీఆర్‌పై అసత్య ఆరోపణలు చేయడం ద్వారా ఆమె ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

SECUNDERABAD CANTONMENT BOARD
Sardar Patel Road, Court Compound, Secunderabad-500 003

PUBLIC NOTICE

This is for the information of the general public that the following transferees have applied for transfer of property as mentioned against their names. Their requests have been processed and the names of the transferees are to be recorded in the tax register as maintained by this office, as per Section 81 of the Cantonments Act., 2006.

Sr. No.	Name of the existing owner as per the tax records. Shri/Smt.	Name of the Transferee. Shri / Smt.	Locality	Sale Deed Doc.No. & Date
1	SHRI N CHIDAMBARA RAO	SMT MARRI SUJATHA REDDY W/o MARRI NARENDER REDDY	PNO 24/GF/FF/SF WESTERN PORTION SANJEEVIAH (NEW CITY) BOWENPALLY	SALE DEED NO 1974/2023 DT 02/11/2023 (LINK DOCUMENTS)
2	SMT D SUJATHA LAXMI	1.SMT BOYNI SRAVANTHI, W/o BOYNI VINOD 2.SHRI BOYNI VINOD S/o BOYNI NARSING RAO	PNO 23/FF MURTHY CHS SAMRAT COLONY MARREDPALLY	SALE DEED NO 381/2024, DT 26/02/2024 (LINK DOCUMENTS)
3	SMT D SUJATHA LAXMI	1.SMT BOYNI SRAVANTHI, W/o BOYNI VINOD 2.SHRI BOYNI VINOD S/o BOYNI NARSING RAO	PNO 23 MURTHY CHS SAMRAT COLONY MARREDPALLY	SALE DEED NO 381/2024, DT 26/02/2024 (LINK DOCUMENTS)
4	SHRI SUNIL KUMAR SHRIVATAVA	1. SHRI SHRIVASTAVA PRATEESH S/o SATISH CHANDRA SHRIVASTAVA 2.SHRI SHRIVASTAVA AASHEESH S/o SATISH CHANDRA SHRIVASTAVA	PNO 9/301/SF PRIYA COLONY (VENT III) KAKAGUDA	RELEASE DEED NO 35/2024 DT 09/01/2024 (LINK DOCUMENTS)
5	SMT RAM KOWRI KACHAAMAH	1. MR YOUSUF F ELAHI S/o FIROZ ELAHI 2.MR ABDULQADIR SHABBIR BHAI TALWARI S/o SHABBIR BHAI TALWARI	HNO 2-40-84/GF/FF TRIMULGHERRY VILLAGE	SALE DEED NO 264/2022 DT 08/02/2022 (LINK DOCUMENTS)
6	SMT A VIJAYA RANI	SHRI KONGARLA ANIL S/o K KASHI RAM	PNO 206/FF SRI SAI APRTS (PROGRESIVE CLY) HASMATHPET	SALE DEED NO 2234/2023 DT 21/12/2023 (LINK DOCUMENTS)
7	1.SHRI SURATI INDRAVADAN HARIHAR 2.SMT SURATI NILAXI INDRAVADAN	1.SRI P RAMESH S/O LATE S P SWAMY 2. SMT KAVITHA RAMESH W/o P RAMESH	OPEN PLOT SYNO 6/6/10/GF BROOK BOND COLONY KAKAGUDA; SYNO 6/6/10/FF BROOK BOND COLONY KAKAGUDA; SYNO 6/6/10/SF BROOK BOND COLONY KAKAGUDA	SALE DEED NO 386/2024 DT 26/02/2024 (LINK DOCUMENTS)
8	SMT D ANITHA	DYAVADI AKARSH REDDY S/o DYAVADI PREM SAGAR	SYNO 104/GF/FF/SF VANITHA CHS BOWENPALLY	SETTLEMENT DEED NO 330/2024 DT 19/02/2024 (LINK DOCUMENTS)
9	SHRI GODHA SATISH YADAV	SHRI MANTHRI VENKATAPATHI RAJ S/o LATE MANTHRI RAMAIAH	HNO 1-8-16, SEETHARAMPUR VILLAGE NEW BOWENPALLY	SALE DEED NO 92/2024 DT 10/01/2024 (LINK DOCUMENTS)
10	SHRI V JAYARAMAN	SMT UMA DEVI W/o V RAMAMURTHI	PNO 25/GF SRIPURI COLONY KAKAGUDA	SALE DEED NO 445/2024 DT 07/03/2024 DEATH CERTIFICATE OF V JAYARAMAN
11	SHRI VINCENT GEORGE	SHRI K RAMANA MURTHY S/o K VENKATAIAH	PNO 201, SIKH ROAD, SIKH ROAD	SALE DEED NO 822/2019, DT 02/05/2019, (LINK DOCUMENTS)
12	SHRI ANAND RAJ	MRS MARIA JOSEPH D/O LATE V JOSEPH	PNO 32/STILT/SF, ISHAQ COLONY KAKAGUDA	RELEASE DEED NO 2174/2023 DT 23/09/2023 DEATH CERTIFICATE / LEGAL HEIR CERTIFICATE
13	SMT USHA	SHRI U V S AVADHANALU S/o LATE U P SASTRY	PNO 303/SF (1-12-218) SAI SRI APARTMENTS CHINNA THOKATTA FALTS BOWENPALLY	SALE DEED NO 950/2014 DT 28/06/2014 (LINK DOCUMENT)
14	SMT V USHA RANI	1.SHRI MURIYANANGALAM KARUNAKARAN SINU S/o M K KUNJOOJU 2.SMT VINITHA K V W/o MURIYANANGALAM KARUNAKARAN SINU	PNO 402 (PNO 1 & 2) KRISHNA ENCLAVE B BOND KAKAGUDA	SALE DEED NO 263/2024 DT 08/02/2024 (LINK DOCUMENT)
15	SHRI THATIPAMULA RAJASEKHAR	1.GOPISETTY VISHWANATH S/o G SAI BABA 2. GOPISETTY SIRISHA W/o GOPISETTY VISHWANATH	HNO 3-7-122/FNO 101 KAKAGUDA VILLAGE KAKAGUDA	SALE DEED NO 1388/2023 DT 28/08/2023 (LINK DOCUMENT)
16	SHRI B LAXMINARAYANA	SHRI M SANJAY KUMAR S/o M SATHAIAH	PNO 101 SREE NAGAR COLONY TRIMULGHERRY	SALE CERTIFICATE NO 2291/2018 DT 15/11/2018 (LINK DOCUMENT)
17	SMT POLLAKATI LAKSHMI THULASI W/o SURENI SIVANANDAN	SHRI RAJU MUPPIDI S/o ANJAIAH MUPPIDI	PNO 20/GF/FF, SRI MALANI CHS, LOTHUKUNTA	SALE DEED NO 415/2024, DT 01/03/2024 (LINK DOCUMENTS)
18	SMT P RAJESHWARI	SHRI SANDEEP DHANVANTRAI SHAH S/o DHANVANTRAI JAYANTILAL SHAH	3/(FNO 402/TF, A P GOVT E H S, KARKHANA	SALE DEED NO 351/2021, DT 23/02/2021, (LINK DOCUMENTS)
19	SRI B SURESH KUMAR	SRI TERALA ANJAIAH S/O TERALA NARAYANA	HNO 3-1-123/1&/P FNO 201/SF SARASWATHI NAGAR VENT III LOTHKUNTA	SALE DEED NO 1224/2023, DT 03/07/2023, (LINK DOCUMENTS)
20	SRI KALERU AMAR & KALERU SHIVANI	SRI APURI SATYENDER S/O LATE A V GNANESHWAR	PNO 13 AND 14/FNO 302/TF S C RLY E C H S MARREDPALLY	SALE DEED NO 216/2024, DT 02/02/2024, (LINK DOCUMENTS)
21	SMT PREETI	SMT POONAM PERSHAD SETH W/O LATE PREM KISHEN PERSHAD SETH	SYNO 46/FNO 201/SF RASOOLPURA VILLAGE	SALE DEED NO 149/2024, DT 24/01/2024, (LINK DOCUMENTS)
22	SMT SNEH GUPTA	SMT ANJALI ATTAL W/O PAWAN KUMAR ATTAL	PNO 26/FNO 111/FF SRI MALANI COLONY TRIMULGHERRY	SALE DEED NO 381/2024, DT 24/02/2024, (LINK DOCUMENTS)
23	SMT NASEEM FATHEEMA & MD NIZAMUDDIN	SMT NISHAT FATIMA W/O DANISH ALAM	PNO 20/GF/FF DEFENCE A/C CHS TRIMULGHERRY	ORAL GIFT (HIBA) DT 27/08/2021 W.P NO 21846 OF 2023 (LINK DOCUMENTS)

Any person having any objection to the above transfer/mutation in the name of the transferee in tax records of this office are required to inform this office in writing within (21) twenty one days of publication of this notice. If no objection is received within this stipulated time, this office will take necessary decision to enter the name of transferee in the tax register of this office.

No. SCB/Tax branch/700, Office of the Cantonment Board,
Court House Compound, S.P. Road, Secunderabad - 500 003.
Date : 08-04-2024

Sd/-
Vijaykumar B Nair
Dy. Chief Executive Officer, Secunderabad Cantonment Board

‘రాజ’సం ఎవరిదో...!

రాజస్తాన్‌లో బీజేపీ, కాంగ్రెస్ నువ్వా నేనా?

రెండు ఎన్నికల్లోనూ బీజేపీ క్లీన్‌స్వీప్ | ఈసారి హ్యాట్రిక్ లక్ష్యంగా బరిలోకి

‘మేనిఫెస్టో మేజిక్’పైనే కాంగ్రెస్ ఆశలు

గహ్లోత్–పైలట్ విభేదాలతో గుబులు

స్టేట్ స్కాన్



రాజస్తాన్‌లో రాజకీయ పోరు దశాబ్దాలుగా బీజేపీ, కాంగ్రెస్ మధ్యే కొనసాగుతోంది. రాష్ట్రంలో అధికారమూ ఈ రెండు పార్టీల మధ్యే మారుతూ వస్తోంది. కమలనాథులు హిందుత్వ, ఆర్థికాభివృద్ధిపైనే ఫోకస్ చేస్తుండగా సంక్షేమ హామీలు, మోదీ ప్రభుత్వంపై వ్యతిరేకతను కాంగ్రెస్ నమ్ముకుంటోంది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో కాంగ్రెస్ నుంచి అధికారాన్ని చేజిక్కించుకున్న బీజేపీ రెట్టింపు ఉత్సాహంతో లోక్‌సభ బరిలోకి దిగుతోంది. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగానే ఈసారి కూడా రాష్ట్రంలో క్లీన్ స్వీప్ చేసి హ్యాట్రిక్ కొట్టాలని పట్టుదలగా ఉంది. ఎంపీ ఎన్నికల్లో పుంజుకుని ఎలాగైనా సత్తా చాటే ప్రయత్నాల్లో కాంగ్రెస్ తలమునకలుగా ఉంది...

పటిష్టమైన సంస్థాగత నిర్మాణం, హిందుత్వ సిద్ధాంత దన్నుతో రాజస్తాన్ బీజేపీ బలమైన పునాదులు వేసుకుంది. తొలుత భైరాన్‌సింగ్ షెకావత్, అనంతరం వసుంధరా రాజె సింధియా వంటివారి నాయకత్వమూ పార్టీకి కలిసొచ్చింది. పట్టణ ప్రాంతాల్లో బీజేపీకి బాగా పట్టుంది. కాంగ్రెస్ కూడా రాష్ట్రంలో బలమైన శక్తిగా కొనసాగుతోంది. అశోక్ గహ్లోత్, సచిన్ పైలట్ వంటి నాయకుల సారథ్యానికి తోడు గ్రామీణ ఓటర్ల మద్దతు పార్టీకి పుష్కలంగా ఉంది. ఈ ఎడారి రాష్ట్రంలో 25 లోక్‌సభ సీట్లున్నాయి. 4 ఎస్సీలకు, 3 ఎస్టీలకు కేటాయించారు.

ఇటీవలే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన కాంగ్రెస్‌కు సార్వత్రిక సమరంలో నెగ్గుకురావడం సవాలే. మాజీ సీఎం అశోక్ గహ్లోత్, సచిన్ పైలట్

కాంగ్రెస్‌లో అదే వర్గ పోరు



మధ్య వర్గ పోరు మళ్లీ రాజుకుంటుండటం తలనొప్పిగా మారుతోంది. ఎన్నికల్లో గహ్లోత్ ఓటమి నేపథ్యంలో రాష్ట్ర పార్టీపై పూర్తిగా పట్టు బిగించే వ్యూహాల్లో పైలట్ వర్గం ఉంది. జాలోర్ నుంచి గహ్లోత్ కుమారుడు వైభవ్ బరిలో ఉన్నారు. మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు న్యాయాలు, 25 గ్యారంటీలను కాంగ్రెస్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తోంది. కుల గణన, రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టబద్ధత హామీల ద్వారా పేదలు, మధ్య తరగతి వర్గాలు, కార్మికులు, రైతుల పక్షాన పోరాటం చేస్తున్నామని రాహుల్ చెబుతున్నారు. ఆర్ఎల్‌పీ ఈసారి ఇండియా కూటమిలోకి రావడం కాంగ్రెస్‌కు ఊరటనిచ్చే అంశం. జాట్లలో బాగా ఆదరణ ఉన్న బెనీవాల్ ప్రభావం షెకావతీ, మార్వార్ ప్రాంతాల్లో... ముఖ్యంగా నాగౌర్, సికర్, ఛురు, జుంఝును వంటి లోక్‌సభ స్థానాల్లో కలిసొస్తుందని పార్టీ ఆశలు పెట్టుకుంది.

బీజేపీకి బెనీవాల్ బెంగ!



2014 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 25 సీట్లనూ ఎగరేసుకుపోయిన బీజేపీ 2019లో సైతం క్లీన్ స్వీప్ చేసింది. 24 సీట్లను బీజేపీ, మిగతా ఒక్క స్థానాన్ని ఎన్డీఏ మిత్రపక్షం రాష్ట్రీయ లోక్ తాంత్రిక్ పార్టీ (ఆర్ఎల్‌పీ) గెలుచుకున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం బీజేపీ చతికిలపడింది. గత డిసెంబర్లో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మట్టికరిపించి తిరిగి అధికారాన్ని దక్కించుకుంది. అదే ఊపులో లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా మూడోసారి క్లీన్‌స్వీప్ చేయాలని తహతహలాడుతోంది. అందుకు తగ్గట్టే ప్రచారాన్ని మోదీ పీక్స్‌కు తీసుకెళ్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సభలతో హోరెత్తిస్తున్నారు. కాంగ్రెస్ అంటేనే వారసత్వ రాజకీయాలు, అవినీతికి పెట్టింది పేరంటూ విమర్శలు ఎక్కుపెడుతున్నారు. అయోధ్య రామమందిర నిర్మాణం బీజేపీకి ప్రధాన ప్రచారాస్త్రంగా మారింది. మోదీ ఫ్యాక్టర్, అభివృద్ధి నినాదాలనూ ప్రజల్లోకి తీసుకెళ్తోంది. అయితే గత ఎన్నికల్లో మిత్రపక్షంగా ఉన్న హనుమాన్ బెనీవాల్ సారథ్యంలోని ఆర్ఎల్‌పీ ఈసారి కాంగ్రెస్‌తో జతకట్టడం కమలం పార్టీకి కాస్త ప్రతికూలాంశమే. జాట్ నేత అయిన బెనీవాల్‌కు ఉన్న ఆదరణ షెకావతీ, మార్వార్ ప్రాంతాల్లో బీజేపీ అవకాశాలను ప్రభావితం చేయవచ్చంటున్నారు. పార్టీ తరఫున కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్ (జోధ్‌పూర్), అర్జున్ రామ్ మేఘ్వాల్ (బికనేర్), లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా (కోట) వంటి హేమాహేమీలు పోటీ చేస్తున్నారు. నలుగురు సిట్టింగులకు బీజేపీ మొండిచేయి చూపడంతో అసంతృప్తి జ్వాలలు భగ్గుమన్నాయి. దీనికి తోడు కాంగ్రెస్ నుంచి జంప్ చేసిన ఇద్దరు నేతలకు తొలి జాబితాలోనే చోటు దక్కింది. వీరిలో బలమైన గిరిజన నేతగా పేరున్న మహేంద్రజీత్‌సింగ్ మాలవీయ ఉన్నారు. పారాలింపిక్స్‌లో పసిడి సాధించిన పద్మభూషణ్ అవార్డు గ్రహీత దేవేంద్ర ఝఝారియాకు బీజేపీ అనూహ్యంగా చురు టికెటిచ్చింది. వసుంధరా రాజె కుమారుడు దుష్యంత్ సింగ్ ఝలావర్–బరన్ నుంచి పోటీ చేస్తున్నారు.



ఎన్నికల తేదీలు
ఏప్రిల్ 19, 26

కుల సమీకరణాలు కీలకం

రాజస్తాన్ రాజకీయాల్లో కులాలది కీలక పాత్ర. ప్రధానంగా జాట్లు, రాజ్‌పుత్‌లు, మీనాలు, గుజ్జర్లు అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపుతున్నారు. 10% జనాభా ఉన్న జాట్ వర్గానికి మార్వార్, షెకావతీ ప్రాంతాల్లో గట్టి పట్టుంది. రాష్ట్ర జనాభాలో రాజ్‌పుత్‌ల వాటా 6–8%. రాజ కుటుంబీకులైన వసుంధరా రాజె, భైరాన్ సింగ్ షెకావత్ సీఎం పదవి చేపట్టినవారే. జాట్లు అప్పుడప్పుడూ ఊగిసలాడినా రాజ్‌పుత్‌ల మద్దతు కమలనాథులకు దండిగా ఉంటుందని గత ఎన్నికలు రుజువు చేస్తున్నాయి. 5 శాతమున్న గుజ్జర్లు గతంలో కాంగ్రెస్‌కు మద్దతిచ్చారు. వారిప్పుడు బీజేపీ వైపు మళ్లవచ్చంటున్నారు. రాష్ట్రంలో బ్రాహ్మణ సామాజికవర్గం 8% దాకా ఉంది. అగ్రవర్ణ పార్టీగా పేరొందిన బీజేపీ అనూహ్యంగా బ్రాహ్మణుడైన భజన్‌లాల్ శర్మను సీఎం చేసింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సీపీ జోషిదీ ఇదే సామాజికవర్గం. ఇక ఎస్టీ సామాజిక వర్గమైన మీనాలు జనాభాలో 5% ఉన్నారు. వీరికి తూర్పు రాజస్తాన్‌లో పట్టుంది. 18% ఉన్న ఎస్సీ సామాజిక వర్గంలోని ఉప కులాలు పరిస్థితులను బట్టి ఇరు పార్టీలకూ మద్దతిస్తున్నారు. కాంగ్రెస్ కుల గణన హామీ ప్రభావం చూపవచ్చంటున్నారు.

సర్వేలు ఏమంటున్నాయి...

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హిందీ బెల్ట్‌లో కీలకమైన రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఘన విజయం సాధించడం ఆ పార్టీలో ఫుల్ జోష్ తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని, కాంగ్రెస్‌కు వైట్‌వాష్ తప్పదని తాజా సర్వేలు చెబుతున్నాయి. రాజస్తాన్‌లో 25 సీట్లనూ తన ఖాతాలో వేసుకోవడం ద్వారా బీజేపీ హ్యాట్రిక్ కొడుతుందనేది మెజారిటీ ఒపీనియన్ పోల్స్ అభిప్రాయం.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఎన్నికల విచిత్రం

ఇలా ఎడ్ల బండ్లపై బారులు తీరి వెళ్తున్నదెవరో తెలుసా? కర్ణాటకలోని చిక్కమగళూరు జిల్లా ఎన్నికల అధికారులు! ఓటింగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోమవారం ఇలా వినూత్నంగా ప్రచారం చేశారు.

అలవిగాని హామీలు

ఊరూరా బారు మొదలుకుని బాల్య వివాహాల దాకా... | ఎన్నికల వేళ అభ్యర్థుల విచిత్ర విన్యాసాలు

ఎలక్షణీయం

‘ఊరూరా బారు, బీరు. నెలకు 10 లీటర్ల బ్రాందీ. ఫారిన్ విస్కీ సరఫరా’. ‘ఏకంగా చంద్రుడిపైకి ఫ్రీ ట్రిప్పు’. ‘ఒక్కొక్కరి ఖాతాలో ఏటా రూ.కోటి జమ’. ‘బాల్య వివాహాలకు మద్దతు’... ఇవన్నీ ఎన్నికల్లో అభ్యర్థులు గుప్పిస్తున్న చిత్ర విచిత్రమైన హామీలు! గెలుపే లక్ష్యంగా అలవిగాని హామీలు గుప్పించే సంస్కృతి పెరుగుతోంది. కొందరు అభ్యర్థులు వార్తల్లో నిలిచేందుకు చిత్ర విచిత్రమైన వాగ్దానాలు చేస్తున్నారు...

బీరు, బంగారం, రూ.10 లక్షలు

వనితా రౌత్. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా చిమూర్‌వాసి. అఖిల భారతీయ మానవతా పార్టీ అభ్యర్థిగా ఈ లోక్‌సభ ఎన్నికల్లో చంద్రపూర్ నుంచి పోటీ చేస్తున్నారు. ‘గమ్మత్తయిన’ హామీలతో ఫేమస్ అయ్యారామె. తనను గెలిపిస్తే ప్రతి గ్రామంలో బీర్లతో బార్ ఏర్పాటు చేయిస్తానని, ఎంపీ లాడ్స్ నిధులతో విస్కీ, బీర్లు దిగుమతి చేసుకుని మరీ ఓటర్లకు ఉచితంగా సరఫరా చేస్తానని ప్రకటించారు. ‘‘నిరుపేదలు ఎంతో కష్టించి పనిచేస్తారు. వారు మద్యం సేవించి సేదదీరుతారు. కానీ నాణ్యమైన విస్కీ, బీర్లు తాగే స్తోమత లేక దేశీయ లిక్కరే తాగుతుంటారు. అందుకే నాణ్యమైన లిక్కర్ దిగుమతి చేసుకుని వారికందించాలని అనుకుంటున్నా’’ అంటూ రౌత్ తన హామీలను సమర్థించుకుంటున్నారు! 2019 లోక్‌సభ ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇవే హామీలు గుప్పించారామె. 2019 ఎన్నికల్లో తమిళనాడులోని తిరుపూర్ లోక్‌సభ స్థానం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ఎ.ఎం.షేక్ దావూద్ కూడా ఇలాగే ప్రతి కుటుంబానికీ నెలకు 10 లీటర్ల స్వచ్ఛమైన బ్రాందీ సరఫరా చేస్తానని హామీ ఇచ్చారు! పెళ్లి చేసుకునే ప్రతి జంటకు ఏకంగా 10 సవర్ల బంగారం, ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలిస్తానని, కుటుంబానికి నెలకు ఏకంగా రూ.25,000 ఇస్తాననీ వాగ్దానం చేశారు!

చంద్ర యాత్ర



2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో సౌత్ మదురై నుంచి ఇండిపెండెంట్‌గా బరిలో దిగిన శరవణన్ (33) అనే జర్నలిస్టు ఉచితంగా చంద్రుడిపైకి పంపిస్తానని, మినీ హెలికాప్టర్ ఇస్తానని, ఐఫోన్లు పంచిపెడతానని హామీలిచ్చారు. ప్రతి ఓటర్ ఖాతాలో ఏకంగా ఏటా రూ.కోటి జమ చేస్తానన్నారు! ఇంటి పనుల్లో సాయానికి గృహిణులకు ఉచిత రోబోలను అందిస్తానని, ప్రతి ఒక్కరికి స్విమ్మింగ్ పూల్‌తో కూడిన మూడంతస్తుల భవనం, ప్రతి మహిళకూ వివాహ సమయంలో 100 సవర్ల బంగారం, కుటుంబానికో పడవ, యువతకు వ్యాపారం ప్రారంభించేందుకు రూ.కోటి సాయం చేస్తానని వాగ్దానం చేశారు. పైగా తన నియోజకవర్గాన్ని ఎప్పుడూ చల్లగా ఉంచేందుకు 300 అడుగుల ఎత్తులో కృత్రిమ హిమ పర్వతాన్ని ఏర్పాటు చేయిస్తానన్న హామీ నవ్వులు పూయించింది. అయితే, ‘తమిళనాడులో ప్రబలంగా ఉన్న ఉచిత తాయిలాల సంస్కృతి బారిన పడొద్దంటూ ఓటర్లలో అవగాహన కల్పించడమే తన లక్ష్యమని ముక్తాయించారాయన.

రైతును పెళ్లాడితే..

రైతు కుమారుడిని పెళ్లాడే మహిళకు రూ.2 లక్షల సాయం చేస్తామని 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలప్పుడు మాజీ సీఎం, జేడీ(ఎస్) నేత కుమారస్వామి ఇచ్చిన హామీ తెగ వైరలైంది. ‘‘రైతుల అబ్బాయిలను పెళ్లాడేందుకు అమ్మాయిలు ముందుకు రావడం లేదు. అందుకే రైతుల స్వీయ గౌరవాన్ని కాపాడేందుకు ఈ హామీ ఇచ్చాం’’ అన్నారాయన.

బాల్య వివాహాలకు రైట్ రైట్

2018 రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలప్పుడు బీజేపీ అభ్యర్థి శోభా చౌహాన్ ఇచ్చిన హామీ చర్చనీయంగా మారింది. ‘‘దేవాసీ సమాజంలో బాల్య వివాహాల సంస్కృతిలో పోలీసుల జోక్యాన్ని నివారిస్తాం. నన్ను గెలిపిస్తే బాల్య వివాహాల్లో పోలీసులు జోక్యం చేసుకోకుండా చూస్తాం’’ అని ప్రకటించారు.

మునుగోడును అమెరికా చేస్తా

తెలంగాణలో 2022 మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నిక సందర్భంగా ప్రజా శాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ ఇచ్చిన హామీ కూడా హైలైటే. తనను గెలిపిస్తే మునుగోడును అమెరికాలా మారుస్తానని, ఇతర పార్టీలు 60 నెలల్లో చేయలేనంత అభివృద్ధిని ఆరు నెలల్లోనే చేసి చూపిస్తానని హామీ ఇచ్చారాయన.

ప్రపంచవ్యాప్తంగానూ...

2012 అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో దిగేందుకు ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ న్యూ గింగ్రిచ్ విఫలయత్నం చేశారు. తనను గెలిపిస్తే 2020 కల్లా టికి చంద్రుడిపై శాశ్వత అమెరికా కాలనీ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారాయన!

- అవే ఎన్నికల్లో వెర్మిన్ సుప్రీమ్ అనే ఆర్టిస్ట్ తనను గెలిపిస్తే ప్రతి అమెరికన్‌కు ఓ గుర్రాన్ని కానుకగా ఇస్తానని ప్రకటించారు.

- జింబాబ్వేలో 2018 ఎన్నికలప్పుడు ప్రజలకు ఐదేళ్లలో 15 లక్షల ఇళ్లు కట్టిస్తామంటూ జాను–పీఎఫ్ పార్టీ హామీనిచ్చింది. అంటే సగటున రోజుకు ఏకంగా 822 ఇళ్లన్నమాట!

– సాక్షి, నేషనల్ డెస్క్

ఎలక్షన్ బీట్

కాంగ్రెస్, ఎన్సీ పొత్తు ఖరారు

జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లలో చెరో మూడు సీట్లకు పోటీ

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కశ్మీర్, లద్దాఖ్‌లలోని చెరో మూడు సీట్లలో కలిసి పోటీ చేయాలని కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) నిర్ణయించుకున్నాయి. సోమవారం ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఎన్సీ నేత ఒమర్ అబ్దుల్లా, కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్ ఈ విషయం వెల్లడించారు. ఉధమ్‌పూర్, జమ్మూ, లద్దాఖ్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఎన్సీ మద్దతు ఇస్తుంది. అదేవిధంగా, అనంత్‌నాగ్, శ్రీనగర్, బారాముల్లాల్లో పోటీ చేసే ఎన్సీ అభ్యర్థులకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వనుందని ఒమర్ అబ్దుల్లా చెప్పారు. పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ(పీడీపీ) ‘ఇండియా’కూటమిలో భాగస్వామే అయినప్పటికీ జమ్మూకశ్మీర్ చిన్న ప్రాంతం కావడంతో సీట్ల సర్దుబాటు సాధ్యపడలేదని వివరించారు.

ఆ నేతలంతా అవినీతిపరులే: నడ్డా

రాంపూర్: కాంగ్రెస్ పార్టీ ఆకాశం, పాతాళం, జలం ఈ మూడు లోకాల్లోనూ కుంభకోణాలకు పాల్పడిందని బీజేపీ చీఫ్ జేపీ నడ్డా ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బొగ్గు కుంభకోణం, 2జీ, 3జీ స్కాములు, అగస్టావెస్ట్‌ల్యాండ్ స్కాము, సబ్‌మెరీన్ స్కాములకు పాల్పడిందని చెప్పారు.ఆ మాటకొస్తే ప్రతిపక్ష ఇండియా కూటమి కూడా ఈ మూడు లోకాల్లోనూ అవినీతికి తెరలేపిందన్నారు. ప్రధాని మోదీ అవినీతి పరులందరినీ జైలుకు పంపుతారన్నారు. నడ్డా సోమవారం యూపీలోని రాంపూర్‌లో జరిగిన బీజేపీ ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారు.

జైల్లో వేయడమే ‘మోదీ గ్యారెంటీ’: మమత

బాంకుడా(పశ్చిమబెంగాల్): మోదీ కీ గ్యారెంటీ అంటే ఎన్నికల తర్వాత విపక్ష నేతలు అందరినీ కటకటాల వెనక్కి నెట్టడమేనని తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ ఎద్దేవాచేశారు. సోమవారం పశ్చిమబెంగాల్‌లోని బాంకుడాలో జరిగిన ఎన్నికల ప్రచారర్యాలీలో మమత మాట్లాడారు. ‘‘అందర్నీ బంధించి భారత్‌ను ఒక బందీఖానాగా మార్చాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. ఎన్నికల వేళ మీ భర్తలను అరెస్ట్‌చేస్తే భార్యలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేయాలి’ అని పిలుపునిచ్చారు. ‘‘బెంగాల్‌లో ఎన్నికల ర్యాలీల్లో ప్రసంగించేందుకు ప్రధాని మోదీ వస్తే మాకెలాంటి అభ్యంతరం లేదు. కానీ ఎన్నికల తర్వాత విపక్షాలపై కఠిన చర్యలకు దిగుతానంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదు. ప్రధాని మాట్లాడే పద్ధతేనా ఇది? నేను కూడా ఎన్నికలయ్యాక బీజేపీ నేతలను జైల్లో పడేస్తానంటే ఎలా ఉంటుంది?. అప్రజాస్వామికమైన ఇలాంటి మాటలు నేను మాట్లాడబోను. ఒక జేబులో ఈడీ, సీబీఐ, మరో జేబులో ఎన్ఐఏ, ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖలను పెట్టుకుని మోదీ బెదిరిస్తున్నారు. వాటితో మమ్మల్ని భయపట్టలేరు’’ అన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీరేంద్ర సింగ్

చండీగఢ్: కేంద్ర మాజీ మంత్రి బీరేంద్ర సింగ్ బీజేపీని వీడి, కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సోమవారం ప్రకటించారు. ఆయన భార్య, మాజీ ఎమ్మెల్యే ప్రేమలతా సింగ్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేత భూపీందర్ సింగ్ హుడాను కలిశారు. నెల రోజుల క్రితమే ఆయన కుమారుడు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్‌తో దాదాపు 4 దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకుని, పదేళ్ల క్రితం బీరేంద్ర సింగ్ బీజేపీలో చేరారు. మోదీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు.

మా మేనిఫెస్టోతో మోదీలో భయం: ఖర్గే

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో ముస్లింలీగ్ ఎన్నికల హామీలను కాపీ కొట్టినట్లుగా ఉందంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. తమ మేనిఫెస్టోను చూసి మోదీలో భయం పట్టుకుందన్నారు. అందుకే ‘హిందూ–ముస్లిం స్క్రిప్ట్’ను తెరపైకి తీసుకువస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో బీజేపీ పరిస్థితి రోజురోజుకీ దిగజారుతుండటంతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ సారథులకు ఇప్పుడిక ముస్లిం లీగ్‌తో నెరపిన పాత మైత్రి గుర్తుకొస్తోందని సోమవారం ఆయన ‘ఎక్స్’లో వ్యాఖ్యానించారు. 140 కోట్ల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు కాంగ్రెస్ ‘న్యాయ్ పత్ర’ప్రతిరూపమని చెప్పారు.

ఈసీ ఆఫీసు వద్ద టీఎంసీ నేతల ధర్నా

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్ర దర్యాప్తు సంస్థలను మోదీ సర్కార్ విపక్ష పార్టీలపైకి ఉసిగొల్పుతోందని తృణమూల్ కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న ఎన్ఐఏ, ఈడీ, సీబీఐ,ఐటీ విభాగం చీఫ్‌లను మార్చాలంటూ టీఎంసీ నేతలు ఏకంగా ఢిల్లీలో ఈసీ కార్యాలయం ఎదుట 24 గంటల ధర్నాకు దిగారు. అంతకుముందు పార్టీ ఎంపీ డెరెక్ ఒబ్రియాన్ సారథ్యంలో 10 మంది ప్రతినిధుల టీఎంసీ బృందం కేంద్ర ఎన్నికల కమిషనర్లను కలిసింది.

20 ఏళ్ల తర్వాత ఓటు

న్యూఢిల్లీ: మావోయిస్టు ప్రభావిత జార్ఖండ్‌లోని సింగ్‌భూమ్ లోక్‌సభ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు రెండు దశాబ్దాల అనంతరం మొదటిసారిగా 2024 ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఓటర్ల సౌలభ్యం కోసం మావోయిస్టులకు కంచుకోటల్లాంటి మారుమూల ప్రాంతాల్లో 118 బూత్‌లను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కుల్దీప్ చౌదరి చెప్పారు. ఆసియాలోనే అత్యంత దట్టమైన సాల్ అడవుల్లో ఉన్న సరండా వంటి 118 గ్రామాల్లోకి మే 13వ తేదీన జరిగే పోలింగ్‌కు సిబ్బందితోపాటు సామగ్రిని హెలికాప్టర్ల ద్వారా పంపుతామన్నారు. నుగ్డి గ్రామంలోని మిడిల్ స్కూల్, బొరెరో గ్రామంలోని మధ్య విద్యాలయలో మొదటిసారిగా పోలింగ్ బూత్‌లను నెలకొల్పామన్నారు. కొన్ని ప్రాంతాల్లోకి సిబ్బంది నాలుగైదు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. ఏ ప్రాంతాన్నీ వదలకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ‘ఆపరేషన్ అనకొండ’ ద్వారా భద్రతా బలగాలు తల్కోబాద్ వంటి 25 వరకు గ్రామాల్లో 15 కొత్త క్యాంపులను ఏర్పాటు చేసి, భద్రతను కట్టుదిట్టం చేశాయని పేర్కొన్నారు. 121 పోలింగ్ బృందాలను రైళ్ల ద్వారా పంపించామన్నారు. దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన వారికి ఇళ్ల వద్దే ఓటు వేసే సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఎస్టీ రిజర్వుడు స్థానమైన సింగ్‌భూమ్‌లో బీజేపీ నుంచి మాజీ సీఎం మధు కోడా భార్య, సిట్టింగ్ ఎంపీ గీతా కోడా రంగంలో ఉన్నారు. ఇండియా కూటమి అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది.

లూటీ లైసెన్స్ రద్దు చేశా

- పేదల అవసరాలు అవినీతి కాంగ్రెస్‌కు ఏనాడూ కనిపించలేదు
- ఛత్తీస్‌గఢ్ ర్యాలీలో మోదీ ధ్వజం

రాయ్‌పూర్/జగ్‌దల్‌పూర్/చంద్రాపూర్: దశాబ్దాలుగా పేదల అవసరాలు, వారి బాధలు అవినీతి కాంగ్రెస్‌కు పట్టలేదని ప్రధాని మోదీ విమర్శల వాగ్బాణాలు సంధించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా ఛోటే అంబాల్ గ్రామంలో సోమవారం బీజేపీ ‘విజయ్ సంకల్ప్ శంఖనాదం’ ర్యాలీలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ‘‘ గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వాటి హయాంలో అవినీతిని దేశ గుర్తింపుగా మార్చేశాయి. అధికారంలో ఉండటమంటే లూటీ చేయడానికి లైసెన్స్ సంపాదించినట్లుగా కాంగ్రెస్ నిశ్చితాభిప్రాయానికి వచ్చేసింది. స్వాతంత్య్రం వచ్చిననాటి నుంచి పేదల బాధను కాంగ్రెస్ ఏనాడూ అర్థంచేసుకోలేదు. అలాంటి పేదలు



కోవిడ్ విలయకాలంలో ఏమైపోతారో అని చాలా మంది నన్ను ప్రశ్నించారు. వాళ్లకేమీ కాదు ఉచితంగా కరోనా వ్యాక్సిన్, ఆహారధాన్యాలు అందిస్తానని ఆనాడే చెప్పా. మా ప్రభుత్వ కృషి కారణంగానే దేశవ్యాప్తంగా 25 కోట్ల మంది ప్రజలు పేదరికం కోరల నుంచి బయటపడ్డారు’’ అని చెప్పారు.

పేదల హక్కులను కాంగ్రెస్ హరించింది


‘‘పేదల హక్కులను అవినీతి కాంగ్రెస్ మింగేసింది. 2014కు ముందు పలు కుంభకోణాలతో లక్షల కోట్ల ప్రజాధనం నొక్కేశారు. అభివృద్ధి పనుల కోసం కేటాయించే ప్రతి రూపాయిలో లబ్ధిదారునికి కేవలం 15 పైసలే చేరుతున్నాయని స్వయంగా నాటి ప్రధాని రాజీవ్‌గాంధీయే ఒప్పుకున్నారు. మిగతా 85 పైసలను ఎవరు కొట్టేశారు?. కాంగ్రెస్ కొనసాగించిన ఈ లూటీ లైసెన్స్ విధానానికి నేనే చరమగీతం పాడా. గత పదేళ్లకాలంలో బీజేపీ సర్కార్ లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా రూ.34 లక్షల కోట్ల మొత్తాలను బదిలీచేసింది. హస్తిన నుంచి విడుదలైన ప్రతి రూపాయి 100 శాతం పేదల చెంతకు చేరింది. ఇప్పటికీ కాంగ్రెస్సే అధికారంలో ఉండి ఉంటే ఈ రూ.34 లక్షల కోట్లలో 85 పైసలు అంటే రూ.28 లక్షల కోట్లు స్వాహా చేసేవారు’ అని మోదీ ఆరోపణలు గుప్పించారు.

దేశంలో అన్ని సమస్యలకూ కాంగ్రెస్సే కారణం

దేశంలోని అన్ని సమస్యలకు కాంగ్రెస్ పార్టీయే కారణమని ప్రధాని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్‌ను కాకరకాయతో పోల్చిన ఆయన..నెయ్యిలో వేయించినా, చక్కెర కలిపినా కాకర రుచి మాత్రం మారదన్నారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో సోమవారం ఎన్నికల ర్యాలీలో మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలను ఆయన స్థిరత్వానికి, అస్థిరతకు మధ్య జరుగుతున్న పోరుగా పేర్కొన్నారు. అవినీతికి పాల్పడేందుకే ప్రతిపక్షాలు అధికారంలోకి రావాలనుకుంటున్నాయన్నారు.

ఎస్సీ, ఎస్టీ మహిళల ఖాతాలో లక్ష

రాహుల్ గాంధీ హామీ



సివనీ/షాదోల్: కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రతి ఎస్సీ, ఎస్టీ మహిళ బ్యాంక్ ఖాతాకు ఏటా రూ.లక్ష జమ చేస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా సివనీ జిల్లాలోని ధనోరాలో ర్యాలీలో గిరిజనులనుద్దేశిస్తూ రాహుల్ మాట్లాడారు.’’ కేంద్రప్రభుత్వ విభాగాల్లో కీలకమైన ప్రభుత్వ పదవుల్లో 90 మంది ఐఏఎస్ అధికారులుంటే వారిలో కేవలం ఒకే ఒక్క గిరిజనుడు ఉన్నాడు. దేశజనాభాలో గిరిజనులు ఎనిమిది శాతంకంటే ఎక్కువే ఉంటారు. అయినా దేశంలోని టాప్ 200 కంపెనీల్లో ఒక్కదానికి కూడా గిరిజనులు యజమానులుగా లేరు. కనీసం ఆ సంస్థల్లో అత్యున్నత స్థాయి అధికారులుగానూ లేరు. దేశంలో ఒక్క మీడియా సంస్థకైనా ఆదివాసీ యజమానిగా ఉన్నారా? ఒక్కరైనా న్యూస్‌యాంకర్ ఉన్నారా?’ అంటూ గిరిజనుల అభ్యున్నతికి మోదీ సర్కార్ కృషిచేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేం అధికారంలోకి వస్తే ఏడాదిలోపు ఆదివాసీల భూ హక్కుల సమస్యను పరిష్కరిస్తాం. కేంద్ర ఉద్యోగాల్లో కాంట్రాక్ట్ వ్యవస్థకు చరమగీతం పాడి 30 లక్షల కేంద్ర ఉద్యోగాలను భర్తీచేస్తాం’ అని అన్నారు.

న్యూజిలాండ్ వీసా నిబంధనలు కఠినతరం

వెల్లింగ్టన్: వలసలను నియంత్రించేందుకు వీసా నిబంధనలను న్యూజిలాండ్ కఠినతరం చేసింది. ఇకపై తక్కువ నైపుణ్యమున్న పనివారు కూడా ఇంగ్లిష్‌పై పట్టు సాధించాల్సి ఉంటుంది. వారికి ఐదేళ్ల నివాస పరిమితిని మూడేళ్లకు తగ్గించింది. వీసాదారులకు నైపుణ్యం, అనుభవాలకు సంబంధించి పలు నిబంధనలు విధించింది. వెల్డర్లు, ఫిట్టర్లు, టర్నర్లు తదితర 11 కేటగిరీల వారిని ఫాస్ట్ ట్రాక్ విధానంలో తీసుకోవాలనే ప్రతిపాదనను సైతం ప్రభుత్వం ప్రస్తుతానికి పక్కనబెట్టింది. అవసరమైతే వీసా నిబంధనలను మరింత కఠినం చేయొచ్చని కూడా సంకేతాలిచ్చింది.

ఆప్ ఎమ్మెల్యే పాఠక్, కేజ్రీవాల్ పీఏను...

ప్రశ్నించిన ఈడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్‌తో పాటు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పీఏ విభవ్ కుమార్‌ను సోమవారం ఈడీ ప్రశ్నించింది. సౌత్ గ్రూప్ నుంచి హవాలా రూపంలో తీసుకున్న రూ.45 కోట్లను గోవా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ఆప్ వాడిందని ఈడీ ఆరోపిస్తుండటం తెలిసిందే. ఆ ఎన్నికల్లో గోవాకు పాఠక్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎన్నికల వేళ జరిగిన నగదు లావాదేవీలపై ఆయన్ను ఈడీ ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ కేసులో కీలక పత్రాలకు సంబంధించిన వివరాల కోసం విభవ్‌ను విచారించింది.

ప్రచారం నుంచి దూరం చేసేందుకే: ఆతిశి

పాఠక్‌ను విచారించడంపై ఢిల్లీ మంత్రి ఆతిశి మండిపడ్డారు. ఆప్ నేతలను ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చేసేందుకే విచారణ పేరుతో బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు.

ఎన్నికల ముందు ఎందర్ని జైల్లో వేస్తారు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: తమిళనాడు సీఎం స్టాలిన్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో సత్తై దురై మురుగన్ అనే యూట్యూబర్‌కు బెయిల్‌ను సుప్రీంకోర్టు పునరుద్ధరించింది. ‘‘యూట్యూబ్‌లో ఆరోపణలు చేశారంటూ ఎన్నికల వేళ ప్రతి ఒక్కరినీ జైళ్లలో వేయడం ప్రారంభిస్తే ఎందరు కటకటాల పాలవుతారో ఊహించండి’’ అని జస్టిస్ ఏఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. నిరసన తెలపడం, అభిప్రాయాల వ్యక్తీకరణ ద్వారా స్వేచ్ఛను దుర్వినియోగపరిచినట్లుగా భావించరాదని పేర్కొంది. స్టాలిన్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు ఆపడం లేదన్న ఫిర్యాదుపై మద్రాస్ హైకోర్టు బెయిల్ రద్దు చేయడంతో మురుగన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

కేంద్ర మంత్రి కారు డోర్ తగిలి స్కూటరిస్టు దుర్మరణం

కృష్ణరాజపురం: కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే కారు తలుపును ఢీకొన్న ద్విచక్ర వాహనదారుడొకరు కిందపడగా అతడిపైకి బస్సు దూసుకెళ్లింది. ఈ ఘటనలో అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన సోమవారం బెంగళూరు కేఆర్ పురంలోని గణేశ్ ఆలయం వద్ద జరిగింది. బెంగళూరు ఉత్తర లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అయిన శోభ కరంద్లాజే ఎన్నికల ప్రచారం నిమిత్తం కారులో వెళ్తున్నారు. ఆ వెనుకే బీజేపీ కార్యకర్త ప్రకాశ్ (45) యాక్టివా స్కూటర్‌పై అనుసరిస్తూ వస్తున్నాడు. కారును ఆపి అకస్మాత్తుగా డోర్ తెరవడంతో దాన్ని ఢీకొట్టి కిందపడ్డాడు. వెనుకనే వస్తున్న బస్సు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ప్రకాశ్ అక్కడికక్కడే చనిపోయాడు. కేఆర్ పురం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. కారు డ్రైవర్‌తో పాటు మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేంద్ర మంత్రి శోభ ఆవేదన వ్యక్తం చేశారు.

7

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024


మోండా మార్కెట్ వద్ద





ఉగాది కళ

క్రోధి నామ సంవత్సర ఉగాదికి సిటీ సిద్ధమైంది. పండుగ కొనుగోళ్లతో సోమవారం నగర మార్కెట్లు కిటకిటలాడాయి. ఉగాది పచ్చడికి అవసరమైన మామిడాకు, వేపపూత, కొత్తకుండ, బెల్లం, పూలు, పండ్ల కొనుగోళ్లు భారీగా జరిగాయి. మోండా, మాదన్నపేట, కొత్తపేట, మూసాపేట, మెహిదీపట్నం తదితర మార్కెట్లలో రద్దీ బాగా కన్పించింది. – సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

‘టౌన్‌ప్లానింగ్’ తీరు మారాలి!



- క్షేత్రస్థాయిలో ప్రజలకు నమ్మకం కలిగేలా అధికారులు వ్యవహరించాలి
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలు ఉపేక్షించరాదు
- సమీక్ష సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్

సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులంటే ప్రజల్లో నమ్మకం లేకపోవడం దారుణమని కమిషనర్ రోనాల్డ్‌రాస్ అన్నారు. సోమవారం టౌన్‌ప్లానింగ్ అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి టీఎస్ బీపాస్ ద్వారా అందిన ఏ దరఖాస్తునైనా 21 రోజుల్లో పరిష్కరించాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత వ్యవధిలో దరఖాస్తులను అప్రూవ్ చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్హత కలిగిన దరఖాస్తులకు అనుమతులు జారీ చేయడంతో పాటు అర్హత లేని వాటిని వెంటనే తిరస్కరించాలని స్పష్టం చేశారు. అధికారుల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న గ్రీవెన్స్‌ల దరఖాస్తులన్నింటినీ వారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టు కేసులకు సంబంధించి అశ్రద్ధ తగదని, టైమ్‌బౌండ్ కేసుల్లో వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

శిథిల భవనాలపై చర్యలు

రాబోయే వర్షాకాలానికి సంబంధించి తగిన యాక్షన్‌ప్లాన్ రూపొందించుకోవాలని, శిథిలావస్థలోని భవనాలను గుర్తించి వాటిద్వారా ఎలాంటి నష్టం వాటిల్లకుండా తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ ప్లాన్స్ సిద్ధం చేయాలన్నారు. సర్కిళ్లలో ఎదురయ్యే ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుంటూ, ఆటంకాలు లేకుండా ప్లాన్స్ రూపొందించాలన్నారు.

అక్రమాలను సహించం..

జీహెచ్‌ఎంసీలోని నీటి వనరులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందంటూ.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఎలాంటి ఆక్రమణలు, నిర్మాణాలు జరగడానికి వీల్లేదన్నారు. లేక్స్ ప్రొటెక్షన్ అధికారులు తమ వాట్సాప్ గ్రూపుల్లో టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని కూడా చేర్చాలని సూచించారు. న్యాక్ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో అనుమతి లేకుండా జరుగుతున్న నిర్మాణాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్ నాయక్, అడిషనల్ సీసీపీలు, సీపీలు, ఏసీపీలు, న్యాక్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

కేబుల్ బ్రిడ్జిపై వాహనం నిలిపితే రూ.1000 జరిమానా


ప్రమాదాలపై అవగాహన కల్పించిన మాదాపూర్ పోలీసులు

మాదాపూర్: కేబుల్ బ్రిడ్జిపై వాహనం నిలిపితే రూ.1000 జరిమానా విధిస్తామని మాదాపూర్ ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపారు. మాదాపూర్‌లోని కేబుల్ బ్రిడ్జిపై సోమవారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు సాయంత్రం యువతీ యువకులు ఎక్కువగా సెల్ఫీలు దిగుతూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వాహనాలను కేబుల్ బ్రిడ్జిపై నిలపరాదని, సెల్ఫీలను జాగ్రత్తగా దిగాలని, బర్త్‌డే పార్టీలను నిర్వహించకూడదని తెలిపారు. వీటిని ఉల్లంఘించే వారికి ఫైన్ వేయడమే కాకుండా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నర్సయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చాయ్ పే ‘శ్రీవల్లి’



‘పుష్ప’ బ్యూటీ రష్మికా మందన్న సిటీలో సందడి చేసింది. ఓ టీ కంపెనీ ప్రమోషన్ వర్క్‌లో భాగంగా సోమవారం ఇక్కడి తాజ్‌వివంటాలో జరిగిన ఈవెంట్‌లో ఆమె పాల్గొన్నారు. ‘చాయ్ పే చర్చ’ నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విజేతలతో ముచ్చటిస్తూ ఆహ్లాదంగా గడిపారు. పుష్ప–2 మూవీ షూటింగ్‌లో భాగంగానే తాను బిజీగా ఉన్నానని, శ్రీవల్లి పాత్రను సుకుమార్ మరింత అద్భుతంగా చూపించనున్నారని అన్నారు. ఈ సందర్భంగా రాజమౌళితో సినిమా ఎప్పుడని అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. తానూ ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నానని చెప్పారు. – సాక్షి, సిటీబ్యూరో


తెలుగు వారి సాంస్కృతిక మహోత్సవం ఉగాది. తెలుగు నూతన సంవత్సరం వేడుకలకు నగరం సన్నద్ధమవుతోంది. ఈ ఏడాది చైత్రమాసం వసంత రుతువు ఆగమనంతో పాటే లోక్‌సభ ఎన్నికలు దూసుకొచ్చాయి. ఉగాది అంటేనే ఒక ఆహ్లాదభరితమైన వేడుక. చిగురించిన లేత మావిళ్లు, చెట్ల నిండా విరగబూసే తెల్లటి వేపపూలు, ఉదయం, సాయంత్రం వేళల్లో సన్నటి స్వరాలవనతో ఆకట్టుకొనే కోకిల పాటలు ఉగాది ఉత్సవానికి స్వాగతం చెబుతాయి. కానీ ఈ ఉగాదికి రాజకీయ పార్టీలు సభలు, హోరెత్తించే ప్రచారం స్వాగతం పలకడం గమనార్హం. – సాక్షి, సిటీబ్యూరో

గ్రేటర్‌లో పొలిటికల్ పంచాంగం

- లోక్‌సభ ఎన్నికల్లో గెలుపోటములను తేల్చనున్న ‘క్రోధి’
- ఉగాది పచ్చడి, పంచాంగ శ్రవణం కోసం అభ్యర్థుల ఎదురుచూపు

‘క్రోధి’ గెలుపెవరిది?

ఎవరికి ‘తీపి’.. ఎవరికి ‘చేదు’?



పంచాంగ శ్రవణానికి రెడీయేనా..

ఉగాది రోజు ఉదయం షడ్రుచుల పచ్చడిని ఆస్వాదించి సాయంత్రం వేళలో పంచాంగ శ్రవణానికి హాజరయ్యేందుకు అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులు సిద్ధంగానే ఉన్నారు. కొత్త ఏడాదిలో వివిధ రాశులకు చెందిన వారికి 50 శాతం మాత్రమే విజయావకాశాలు ఉన్నట్లు పంచాంగాలు ఇప్పటికే వెల్లడించాయి. కొన్ని రాశుల వాళ్లకు మాత్రం 75 శాతం విజయావకాశాలు ఉన్నాయి. ఇక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపోటములను డిక్లేర్ చేసేందుకు శని, రాహు, కేతువులు సైతం కాచుకొని ఉన్నాయి. క్రోధి నామ సంవత్సరం ఆగ్రహించేదెవరిని, అనుగ్రహించేదెవరిని అనేది రానున్న ఎన్నికల్లోనే తేలనుంది.

మే 13వ తేదీన జరుగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం అన్ని ప్రధాన పార్టీలు హోరాహోరీగా తలపడనున్నాయి. ఇప్పటికే గ్రేటర్‌లో ప్రధాన పార్టీలు ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రచార వాహనాలు ఎన్నికల వాతావరణాన్ని పదునెక్కిస్తున్నాయి. మరోవైపు క్రోధి నామసంవత్సరంలో తమ భవితవ్యం ఎలా ఉండనుందనే సందేహం కూడా వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులను కలవరపెడుతోంది. ఎవరికి వారు గెలుపు పైన ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ ఉగాది పంచాంగంలో తమకు ఎలాంటి భవిత్యం రాసిపెట్టి ఉందోననే ఆందోళన కూడా నెలకొంది. ఉగాది రోజు షడ్రుచుల పచ్చడిని ఆస్వాదించేందుకు అన్ని పార్టీల అభ్యర్థులు సిద్ధంగానే ఉన్నప్పటికీ తీపిని రుచి చేసేది, చేదును జీర్ణించుకొనేవారు ఎవరో తేలాలంటే మరో నెల రోజులు గడవాల్సిందే.

ఏ పార్టీని ఏ రుచి వరించనుందో....

- గత అసెంబ్లీ ఎన్నికలు సరికొత్త చరిత్రను లిఖించాయి. రెండుసార్లు ఘోరమైన పరాభవాన్ని చవి చూసిన కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా బలం పుంజుకొని విజయతీరాలను చేరుకుంది. అధికారాన్ని కైవసం చేసుకుంది. ఆ ఊపుతోనే లోక్‌సభ ఎన్నికలను అధిగమించవచ్చుననే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీకి ఈ ఉగాది పండుగ తీపినే పంచుతుందని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.
- పదేళ్ల పాటు అధికారం చెలాయించిన బీఆర్‌ఎస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చవి చూసింది. ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ ‘పచ్చడి’ పుచ్చుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి నుంచి ఇంకా ఆ పార్టీ తేరుకొని, లేచి నిలబడకుండానే లోక్‌సభ ఎన్నికలు ముంచుకొచ్చాయి. ఒకవైపు ఎమ్మెల్యేలు, నాయకులు ఆ పార్టీని వీడుతున్న గడ్డుకాలంలో లోక్‌సభ ఎన్నికల్లోనూ ‘చేదు’ అనుభవమే మిగలనుందా. లేక కారం, వగరు వంటి రుచుల్లా కొన్ని స్థానాలనైనా దక్కించుకొని నిలదొక్కుకుంటుందా అనేది చూడాల్సిందే.
- మరో ప్రధాన పార్టీ బీజేపీ కూడా ఈ ఎన్నికలపైన ఎన్నో ఆశలు పెట్టుకుంది. గ్రేటర్‌లో ఈ సారి మాధవీలత వంటి కొత్త ముఖాలను ఎన్నికల బరిలోకి దించింది. మల్కాజిగిరి నుంచి పోటీలో ఉన్న ఈటల రాజేందర్ సైతం ప్రచారంలో దూసుకెళ్తున్నారు. దీంతో షడ్రుచులలో ఆ పార్టీని ఏ రుచి వరించనుందనేది ఆసక్తికరంగా మారింది.
- ఇటీవల వరకు బీఆర్‌ఎస్‌తో దోస్తీ చేసిన ఎంఐఎం కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తరువాత పంథా మార్చినట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్‌కు క్రమంగా దగ్గరవుతోంది. ఈ క్రమంలో ఎంఐఎం తన స్థానాలను యథావిధిగా నిలబెట్టుకుంటుందా లేక కోల్పోతుందా అనేది కూడా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

18 నుంచే నామినేషన్ల స్వీకరణ

రాజేంద్రనగర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాట్లు

- సభలు, సమావేశాల కోసం ‘సువిధ’లో దరఖాస్తు చేసుకోవాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ శశాంక సమావేశం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 25 వరకు రాజేంద్రనగర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో తమ నామినేషన్లు దాఖలు చేయవచ్చని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక సూచించారు. ఇందు కోసం అభ్యర్థులు నామినేషన్ ఫారం -2ఏను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుండి ఉచితంగా పొందవచ్చని సూచించారు. ఈ మేరకు ఆయా పార్టీల ప్రతినిధులతో సోమవారం రాజేంద్రనగర్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమావేశమై పలు సూచనలు చేశారు. సెలవు రోజు మినహా ప్రతి రోజు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల సమ యంలో నామినేషన్లను స్వీకరించనున్నట్లు ప్రకటించారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణకు గడువుగా నిర్ణయించినట్లు తెలిపారు.

అభ్యర్థులకు సూచనలు

- ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖ లు చేయవచ్చు. అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతించనున్నారు.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వేరే పార్లమెంటు సెగ్మెంట్‌కు చెందినవారైన పక్షంలో తప్పనిసరిగా వారి అసెంబ్లీ సెగ్మెంట్ ఈఆర్‌ఓ నుండి ఓటరు ధ్రువీకరణ పత్రం సమర్పించాలని తెలిపారు.
- అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95 లక్షల వరకు ఎన్నికలలో ఖర్చు చేయవచ్చని, సంబంధిత బ్యాంకు అకౌంట్ లావాదేవీల ఆధారంగానే అభ్యర్థుల వ్యయాన్ని లెక్కించడం జరుగుతుంది.
- ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే దరఖాస్తులు చేసుకుని అనుమతి పొందాలి. కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు వంటివి ముద్రించే విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 127 – ఏ సూచనలు పాటించాలి. ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాలకు 48 గంటల ముందు ‘సువిధ’ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

సిటీలో స్కార్లెట్!

- గ్రేటర్‌లో వ్యాపిస్తున్న జ్వరం లక్షణాలు
- పిల్లలతో పాటు పెద్దల్లోనూ కనిపిస్తోన్న వైనం
- ఆలస్యం వద్దు.. సత్వరమే చికిత్స అవసరం: వైద్యులు



నగరంలో గత కొద్ది రోజులుగా స్కార్లెట్ ఫీవర్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. నివేదికల ప్రకారం, జ్వరంతో బాధపడుతున్న 20 మంది పిల్లలలో 12 మందిలో స్కార్లెట్ జ్వరం కనిపిస్తోందని సమాచారం. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ జ్వరాలు ఎక్కువగా స్కార్లెట్ ఫీవర్ కేసులుగా గుర్తించబడుతున్నాయి. చిన్నారులకు మాత్రమే అనుకున్న ఈ స్కార్లెట్ ఫీవర్ తాజాగా పెద్దల్లో సైతం కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. –సాక్షి, సిటీబ్యూరో

‘స్ట్రెప్టోకోకస్’ అనే బ్యాక్టీరియా స్కార్లెట్ ఫీవర్‌కు కారణమవుతుంది. సాధారణంగా 5–15 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలే ఈ వ్యాధికి గురవుతుంటారు. ఇది శారీరక స్పర్శల ద్వారా, శ్వాసకోశ బిందువుల ద్వారా వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన వారితో ఆహారం లేదా పానీయాలు పంచుకుంటే కూడా ఇది వ్యాప్తి చెందుతుంది. ఇది ప్రధానంగా పిల్లల సమస్యే అయినా.. నగరంలో పిల్లలతో ఎక్కువ సన్నిహితంగా ఉండే తల్లిదండ్రులు కూడా దీని బారిన పడుతున్నట్టు తెలిసింది.

లక్షణాలివే...

తీవ్రమైన గొంతు నొప్పి, 101 డిగ్రీల కంటే ఎక్కువ శరీరపు టెంపరేచర్, వికారం, కడుపు నొప్పి, వాంతులు, తలనొప్పి, శరీరం నొప్పి, గులాబీ, ఎరుపు దద్దుర్లు చర్మం ఇన్ఫెక్షన్ ఇవే కాకుండా... ఇసుక అట్టను పోలిన విలక్షణమైన దద్దుర్లు దీని ప్రధాన లక్షణం. ఇవి తొలుత చేతులు కాళ్ళపై కనిపించి ఆ తర్వాత ఉదరం, ముఖంతో సహా శరీరం అంతటా వ్యాపిస్తాయి. అంతేకాక పిల్లల్లో చిన్న ఎర్రటి మచ్చలతో కూడిన ‘స్ట్రాబెర్రీ నాలుక’ కనిపిస్తుంది.

చికిత్స తప్పనిసరి... నివారణ ఇలా ..

- దీని నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు నోటిని మాస్క్ లేదా గుడ్డతో కప్పుకోవడం, క్రమం తప్పకుండా హ్యాండ్ శానిటైజర్ లేదా హ్యాండ్ వాష్‌తో చేతులు కడుక్కోవడం పరిశుభ్రత పాటించడం అవసరం.
- ఈ జ్వరం లక్షణాలను గమనించిన వెంటనే స్వంత వైద్యం మానుకుని, తగిన వైద్య సహాయం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీనికి యాంటీబయాటిక్స్‌తో తక్షణ చికిత్స చేయకపోతే గుండె సమస్యలు మూత్రపిండ వైఫల్యం వంటి తీవ్రమైన సమస్యలకు దారితీయవచ్చునని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందంటున్నారు.
- ఈ జ్వరం పది రోజుల వరకు ఉంటుంది. చికిత్స ప్రారంభించాక నెమ్మదిగా తగ్గుతూ ఉంటుంది. స్కార్లెట్ ఫీవర్ చికిత్సలో ప్రధానంగా ఒక వారం పాటు పెన్సిలిన్, మాక్రోలైడ్స్ అజిత్రోమైసిన్ వంటి యాంటీబయాటిక్స్‌ని ఉపయోగిస్తారు.
- అపోలో హాస్పిటల్‌లోని ఇంటర్నల్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ అనీష్ ఆనంద్ మాట్లాడుతూ తగిన సమయంలో వైద్య చికిత్స తప్పనిసరి అని, ఆలస్యమైతే ప్రమాదకరమైన సమస్యలకు దారితీయవచ్చునన్నారు.
- మాగ్నా సెంటర్‌లోని చీఫ్ పీడియాట్రిషియన్ డాక్టర్ శివరంజని సంతోష్ మాట్లాడుతూ స్కార్లెట్ ఫీవర్, కవాసకి వ్యాధి మధ్య సారూప్యత ఉందన్నారు. విలక్షణమైన ‘స్ట్రాబెర్రీ నాలుక’ దద్దుర్లు సహా చాలా లక్షణాలు ఒకేలా ఉంటాయన్నారు. తక్షణమే తల్లిదండ్రులు సత్వర వైద్య సహాయం తీసుకోవాలని చెప్పారు.
- ‘రోగ లక్షణాలను ముందుగానే గుర్తించడం సూచించిన యాంటీబయాటిక్‌లను ఆలస్యం చేయకుండా ప్రారంభించడం చాలా ముఖ్యం. స్కార్లెట్ జ్వరం పిల్లల శ్రేయస్సుపై ప్రభావం చూపడమే కాకుండా గుండె మూత్రపిండాలపై ప్రభావం చూపి సమస్యలకు దారి తీస్తుంది’ అని డాక్టర్ సంతోష్ చెప్పారు.
- మొదటి 24–48 గంటల్లో యాంటీబయాటిక్స్ ప్రారంభించాక చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఇది పిల్లలు త్వరగా కోలుకోవడంలో సహాయపడటమే కాకుండా ఇన్ఫెక్షన్ వ్యాప్తిని అరికడుతుంది అని ఆమె సలహా ఇచ్చారు. నీలోఫర్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ ఉషా రాణి కూడా స్కార్లెట్ జ్వరం కేసులు ఎక్కువ ఉన్నాయన్నారు. మందులు ఇన్‌ఫెక్షన్‌ను నయం చేయడంలో సహాయపడతాయని చెప్పారు.

మెట్రో రాయితీల కొనసాగింపు

మరో ఆరు నెలలు పొడిగింపు

- కొత్తగా ‘కస్టమర్ లాయల్టీ ప్రోగ్రామ్’



సాక్షి, సిటీబ్యూరో: రాయితీల రద్దుపైన హైదరాబాద్ మెట్రో రైల్ వెనుకడుగు వేసింది. మార్చి నెలతో ముగిసిన రాయితీ పథకాలను మరో 6 నెలలు పొడిగించినట్లు హైదరాబాద్ మెట్రో రైల్ వర్గాలు తెలిపాయి. మెట్రో ప్రయాణికులకు ఉగాది కానుకలుగా సూపర్ సేవర్ మెట్రో హాలిడే కార్డ్, మెట్రో స్టూడెంట్ పాస్, మెట్రో సూపర్ ఆఫ్ పీక్ అవర్ ఆఫర్ పథకాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నాయి. ప్రయాణికులకు ఈ ఆఫర్‌లను పొడిగించటంతో పాటు కొత్తగా కస్టమర్ లాయల్టీ ప్రోగ్రామ్‌ను విడుదల చేసినట్లు హైదరాబాద్ మెట్రోరైల్, ఎల్ అండ్‌టి మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ తెలియజేశాయి. రాయితీ ప్రయాణ సదుపాయాన్ని అందజేసే మూడు రకాల పథకాలకు ప్రయాణికుల నుంచి అపూర్వమైన ఆదరణ లభించినట్లు హెచ్‌ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు సౌకర్యవంతమైన, సరసమైన ప్రయాణ సదుపాయాన్ని అందజేసేందుకు హెచ్‌ఎంఆర్ కట్టుబడి ఉందని చెప్పారు. మెట్రో సేవలను ప్రయాణికులకు మరింత చేరువ చేసేందుకే ఈ పథకాలను మరో 6 నెలల వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ప్రారంభించిన కస్టమర్ లాయల్టీ ప్రోగ్రామ్ ద్వారా ప్రయాణికులను రివార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. రెగ్యులర్‌గా రాకపోకలు సాగించే ప్రయాణికులకు తాము కృతజ్ఞతలు తెలియజేసేందుకే కస్టమర్ లాయల్టీ ప్రోగ్రామ్‌ను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఆ మూడు పథకాలు ఇలా..

- ప్రయాణికులు రూ.59 మెట్రో సూపర్ సేవర్ హాలిడే కార్డుపైన ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లో మెట్రో రైళ్లలో ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా ప్రయాణం చేయవచ్చు.
- సూపర్ ఆఫ్ పీక్ అవర్ ఆఫర్ పథకం ద్వారా నాన్‌పీక్ అవర్‌లో ప్రయాణికులకు మెట్రో కార్డు చార్జీల్లో 10 శాతం రాయితీ లభిస్తుంది.
- మెట్రో స్టూడెంట్ పాస్ ద్వారా విద్యార్థులు తాము రాకపోకలు సాగించే మార్గంలో 20 ట్రిప్పులకు చార్జీలు చెల్లించి మరో 10 ట్రిప్పులు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.
- కొత్తగా ప్రవేశపెట్టిన కస్టమర్ లాయల్టీ ప్రోగ్రామ్ ద్వారా తరచుగా మెట్రోరైళ్లలో ప్రయాణించే వారిని ఆకట్టుకొనేందుకు రివార్డులను అందజేస్తారు. ప్రయాణికులు ఎంత ఎక్కువగా మెట్రో సేవలను వినియోగించుకుంటే అంత ఎక్కువ రివార్డులు పొందవచ్చు. ఇందుకోసం అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో ప్రత్యేకమైన కస్టమర్ లాయల్టీ స్టాల్‌ను త్వరలో ప్రారంభించనున్నారు. ప్రయాణికులు తమకు లభించే రివార్డులను ఇక్కడ క్లెయిమ్ చేయవచ్చు.

మనకు ‘బెంగ’ లేదు

నగరంలో నీటి సరఫరా బాగుంది • పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్

సాక్షి, సిటీబ్యూరో: ‘బెంగళూరు నగరంలో ఏర్పడిన నీటి ఎద్దడి పరిస్థితి వేరు. మన వద్ద పరిస్థితి వేరు. హైదరాబాద్‌లో సమృద్ధిగా నీటి సరఫరా ఉంది. కాబట్టి అక్కడి పరిస్థితి ఇక్కడ రాబోదు’ అని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ స్పష్టం చేశారు. సోమవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్ నగరంలో తాగునీటి సరఫరా పరిస్థితిపై ఆయన డివిజన్ల వారిగా సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బెంగళూరులో 2632 ఎంఎల్‌డీల తాగునీటి డిమాండ్ ఉండగా, అందులో కేవలం 1460 ఎంఎల్‌డీలు మాత్రమే సరఫరా అవుతుందని, మిగతా భూగర్భజలాలపై ఆధారపడి ఉండటంతో నీటి ఎద్దడి సమస్య ఏర్పడిందని పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగరంలో ప్రస్తుతం 2602 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికే గతం కంటే అదనంగా 100 ఎంఎల్డీల నీరు సరఫరా చేస్తున్నామని, అవసరమైతే మరో వంద ఎంఎల్డీల నీరు సరఫరా చేసేందుకు జలమండలి సిద్ధంగా ఉందని వెల్లడించారు.

అత్యవసర పంపింగ్

నగరానికి నీటి సరఫరా చేసే నాగార్జున సాగర్, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో నీటి మట్టం తగ్గతుండటంతో డెడ్‌స్టోరేజ్ నుంచి నీటి తరలింపు కోసం ఎమర్జెన్సీ పంపింగ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దానకిశోర్ వెల్లడించారు. నాగార్జున సాగర్‌లో మరో మూడు రోజుల్లో మొదటి పంపు, ఆ తర్వాత 15 లోపు అన్ని పంపులు ప్రారంభిస్తామని చెప్పారు. వర్షాలతో సంబంధం లేకుండా అక్టోబర్ వరకు నీటి సరఫరా చేయవచ్చని స్పష్టం చేశారు. ఎల్లంపల్లిలో మే ఒకటి నుంచి అత్యవసర పంపింగ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మిగితా రిజర్వాయర్లలో సమృద్ధిగా తాగునీటి లభ్యత ఉందని.. అందువల్ల ప్రజలెవరూ ఆందోళ పడాల్సిన అవసరం లేదని వివరించారు.

12 గంటలలోపు ట్యాంకర్ల సరఫరా

ట్యాంకర్ బుక్ చేసిన 12 గంటల్లోపే డెలివరీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు దాన కిశోర్ వెల్లడించారు. ప్రస్తుతం 705 ట్యాంకర్ల ద్వారా 24 గంటలు సరఫరా చేస్తున్నామని, ట్యాంకర్ల సంఖ్యను వెయ్యికి పెంచి నీటి సరఫరా చేస్తామని వెల్లడించారు. కొత్త ట్యాంకర్ల కోసం ఆర్టీఏ ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. ట్యాంకర్ల డ్రైవర్లకు కూడా ట్రిప్పుకు అదనంగా చార్జీలను పెంచామని పేర్కొన్నారు. ఈ ఏడాది నగరంలో భూగర్భ జలాలు తగ్గడంతో ట్యాంకర్ వాటర్ కు డిమాండ్ ఏర్పడిందన్నారు. 1700 ప్రాంతాల్లో సర్వే నిర్వహించగా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మొదటి 3 నెలల్లోనే అదనంగా 10 వేల మంది కొత్త వినియోగదారులు ట్యాంకర్లు బుక్ చేసుకున్నట్లు తెలిపారు. దీంతో ట్యాంకర్ వినియోగదారులు సంఖ్య 31 వేలకు చేరిందన్నారు. గత సంవత్సరం కంటే ట్యాంకర్ ట్రిప్పుల సంఖ్య రెట్టింపు అయిందని గుర్తు చేశారు. నగరంతో పాటు ఓఆర్‌ఆర్ పరిధిలో అవసరమైన చోట అదనపు ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


200 చలివేంద్రాలు ఏర్పాటు

నగరంలోని పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు బస్టాండ్లు, జంక్షన్లు, ప్రధాన ఆసుపత్రులు ఇతర జన సంచార ప్రదేశాల్లో 200 చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు దానకిశోర్ వెల్లడించారు.

ఇంకుడు గుంతలు

నగరంలో భూగర్భ స్థాయి నీటి మట్టాల్ని పెంచేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని దానకిశోర్ సూచించారు. ప్రస్తుతం ట్యాంకర్ ద్వారా వాటర్ బుక్ చేసుకుంటున్న వినియోగదారులకు, ఒకవైపు నీరు సరఫరా చేస్తూనే.. మరో వైపు ఇళ్లల్లో ఇంకుడు గుంతల నిర్మాణం ఏర్పాటు చేసేందుకు చొరవ తీసుకునేలా అవగాహన కల్పిస్తామన్నారు. ఇంకుడు గుంతలు లేని వారు రూఫ్‌టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి, ఈడీ. డా.ఎం.సత్యనారాయణ, డైరెక్టర్లు, ఆర్టీఏ అధికారులు, సీజీఎంలు, జీఎంలు, ఎన్జీవో సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు



ఏఐపీఈఎఫ్ నూతన కార్యదర్శిగా రత్నాకర్‌రావు

సాక్షి, సిటీబ్యూరో: ఆల్ ఇండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్(ఏఐపీఈఎఫ్) నూతన ప్రధాన కార్యదర్శిగా పి.రత్నాకర్‌రావు ఎన్నికయ్యారు. ఇటీవల చెన్నైలో జరిగిన ఏఐపీఈఎఫ్ కార్యవర్గ సమావేశంలో దేశ వ్యాప్తంగా ఉన్న 23 రాష్ట్రాలకు చెందిన విద్యుత్ ఇంజినీర్లు పాల్గొని, 2024–27కు గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా కొనసాగుతున్న రత్నాకర్‌రావు ఏఐపీఈఎఫ్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం ఇది మూడో సారి. అదే విధంగా అదనపు కార్యదర్శి జనరల్‌గా ఎం.శివశంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.శ్రీనాథ్‌రెడ్డి, కార్యదర్శిగా పరికి సదానందం, సంయుక్త కార్యదర్శిగా మంగీలాల్, జనప్రియ, వెంకట నారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా అంజయ్య, రమణారావు, పీవీరావు, వరప్రసాదరావు, విద్యాసాగర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం జూబ్లీక్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా ప్రతినిధులను తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

నేడు సాలార్‌జంగ్ మ్యూజియానికి సెలవు

చార్మినార్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రోజంతా సాలార్‌జంగ్ మ్యూజియం మూసి ఉంటుందని సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సాలార్‌జంగ్ మ్యూజియంను సందర్శించడానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు ఈ నెల 9వ తేదీన కూడా రావద్దని కోరారు.

తప్పులు లేకుండా
అప్‌లోడ్ చేయాలి

హైదరాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి

సాక్షి,సిటీబ్యూరో: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్నికల సమాచారాన్ని తప్పులు లేకుండా ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని హైదరాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల డేటా ఎంట్రీ ఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డేటా ఎంట్రీ ఆపరేటర్లు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రణాళిక బద్ధంగా కచ్చితమైన డేటాను ఆన్‌లైన్ లో అప్‌లోడ్ చేయాలన్నారు. సువిధ అనుమతులను ఎప్పటికప్పుడు ఇచ్చేలా ప్రో ఆక్టివ్ గా ఉండాలన్నారు. సోషల్ మీడియా వచ్చే వాటిని చూడాలని, సీ విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులు వంద నిమిషాల్లో డిస్పోస్ అవుతున్నాయా లేదా అనేది పరిశీలించాలన్నారు. నామినేషన్ అప్‌లోడ్, నామినేషన్ల ఉపసంహరణ, ఫైనల్ అభ్యర్థుల జాబితా, కౌంటింగ్, ఫలితాల వెల్లడి తదితర అంశాలన్నీ తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజవర్గ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఎన్నికల సమాచారాన్ని అప్ లోడ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓటర్ టర్న్ అవుట్, సి విజిల్ యాప్, ఎంకూర్ తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ రజిత, హెచ్‌హెచ్‌పీ కుమార్ యాదవ్, ఎలక్షన్స్ తహసిల్దార్ జహురుద్దీన్, ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

- అన్నదమ్ముల అరెస్ట్
- రూ.18.50 లక్షల నగదు స్వాధీనం
- ఢిల్లీ కేంద్రంగా బెట్టింగ్ నిర్వహణ



వివరాలు వెల్లడిస్తున్న సైబరాబాద్ ఎస్ఓటీ డీసీపీ శ్రీనివాస్



స్వాధీనం చేసుకున్న నగదు

గచ్చిబౌలి: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాను రాజేంద్రనగర్ ఎస్ఓటీ, రామచంద్రాపురం పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైబరాబాద్ ఎస్ఓటీ డీసీపీ డి.శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. ఆర్సీపురం ప్రాంతానికి చెందిన సోదరులు మొగిలిగిద్ద రామకృష్ణ గౌడ్, మొగిలిగిద్ద ఉపేందర్ గౌడ్(రెండేళ్లుగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఐపీఎల్ టీ–20 ముంబై ఇండియన్స్–ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్– గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లపై బీరంగూడ కమాన్ సమీపంలో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.18.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పలు బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.18,34,918 సీజ్ చేశారు. నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన బుకీ సోను ఢిల్లీ కేంద్రంగా వెబ్ సైట్ల ద్వారా వివిధ రాష్ట్రాల్లో ఆన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. పంటర్లుగా వ్యవహరిస్తున్న వికారాబాద్ జిల్లా, కొత్తపల్లి గ్రామానికి చెందిన తలారి శ్రీనివాస్, పాలకొల్లుకు చెందిన బండి వినయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకోగా, అంజి, చంద్రం, దొర అనే వ్యక్తులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దాదాపు ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా మొబైల్ యాప్‌లో 40 మంది పంటర్లను అటాచ్ చేసినట్లుగా పోలీసులు పేర్కొన్నారు. ఆర్సీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరు బెట్ 365, ఎంపీఎల్ బెట్‌వే, డ్రీమ్ గురు, మై 11 సర్కిల్, కోరల్ బ్విన్, విన్నర్, క్రికెట్ బెట్టింగ్ 2020 తదితర మొబైల్ యాప్స్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు డీసీపీ వివరించారు. బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిస్తే డయల్ 100, 9490617444 నెంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

మాతృభాషలోనే మాట్లాడాలి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

- తెలుగు వర్సిటీలో జస్టిస్ ఆవుల సాంబశివరావు పురస్కారాల ప్రదానోత్సవం
- ఆచార్య వకుళాభరణం రామకృష్ణ, వెంకటరాయుడుకు పురస్కారాల ప్రదానం



వకుళాభరణం రామకృష్ణకు పురస్కారం అందజేస్తున్న ఎం.వెంకయ్య నాయుడు

నాంపల్లి: భారతీయ భాషలను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. సోమవారం పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో మండలి వెంకటకృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఆధ్వర్యంలో తెలుగు భాషా సాహిత్య వికాసానికి సేవలందించిన ఇద్దరు ప్రముఖులకు జస్టిస్ ఆవుల సాంబశివరావు పురస్కారాల ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ మాతృభాషలో మాట్లాడడమే భాషకు రక్షణ అన్నారు. పరాయి భాషపై వ్యామోహం పెంచుకోవడంతో మాతృభాష ఉనికి కోల్పోతుందని, తల్లిదండ్రులు నూన్యతాభావాన్ని వీడి పిల్లలకు మాతృభాషపై ఆసక్తిని పెంపొందించాలన్నారు. భాష ఒంటరిది కాదని, లలిత కళలు, సంస్కృతి దానికి తోడుగా ఉంటాయని, భాష దూరమైతే శ్వాస లేనట్లేనన్నారు. జస్టిస్ ఆవుల సాంబశివరావు విలువలను పాటించి వృత్తికే కాకుండా తెలుగు వారందరికీ గుర్తింపును తెచ్చిన మానవతావాది అని కొనియాడారు. ఆయన పేరిట పురస్కారాన్ని అందుకున్న వారు ధన్యజీవులన్నారు. ఆచార్య వకుళాభరణం రామకృష్ణకు– 2023వ సంవత్సరానికి, మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకులు మన్నం వెంకటరాయుడుకు– 2024వ సంవత్సరానికి గాను పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. వీరికి పురస్కారంతో పాటు రూ.25వేల చొప్పున నగదు, సన్మాన పత్రం , జ్ఞాపికను అందజేశారు. వర్సిటీ వీసీ ఆచార్య తంగెడ కిషన్ రావు తెలుగు వర్సిటీ తెలుగు భాషకు చేస్తున్న కృషిని వివరించారు. వర్సిటీ మాజీ వీసీ ఆచార్య ఆవుల మంజులత మాట్లాడుతూ... తెలుగు భాషా సాహిత్యాలపై నేటి తరానికి పట్టు లేదని, తెలుగులో కూడా శాస్త్ర వైద్య విజ్ఞానం ఉందని, పిల్లలకు బోధించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్, లలిత సంగీత అధ్యాపకురాలు బి.లక్ష్మి, మండలి వెంకటకృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం సంచాలకులు ఆచార్య వై.రెడ్డి శ్యామల, డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

35 హత్య కేసులు.. కొడుకు చేతిలో హతం

- మృతుడు బాలన్న గ్యాంగ్ స్టర్ నయీం అనుచరుడు
- గంజాయి మత్తులో దారుణంగా హత్య చేసిన కుమారుడు
- ఆస్తి కోసమా.? కుటుంబ తగాదాలా.? అనే కోణాల్లోనూ విచారణ



రవీందర్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: 35 హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తి చివరికి కొడుకు చేతిలో హతమయ్యాడు. ఈ నెల 4న జరిగిన ఈ కేసు కొత్త మలుపు తిరిగింది. తనయుడి చేతిలో ప్రాణాలు కోల్పోయిన రవీందర్‌ను మాజీ నక్సలైట్ తిరుపాటి బాలన్నగా పోలీసులు గుర్తించారు. నయీం అనుచరుడైన బాలన్న కుమారుడు అనురాగ్ చేతిలో ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు వెల్లడించారు. హత్యకు ఇంకా ఏవైనా కారణాలు ఉన్నాయా.. అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది.

దాడి జరిగింది ఇలా..

తండ్రిని హత్య చేసేందుకు పథకం ప్రకారం అనురాగ్ పెట్రోల్ తీసుకు వచ్చాడు. గత గురువారం మధ్యాహ్నం తల్లి నిద్రలో ఉండగా బయట నుంచి తాళం పెట్టి తండ్రితో గొడవకు దిగాడు. ముందుగానే తెచ్చి పెట్టుకున్న పెట్రోల్‌ను తండ్రిపై పోసి నిప్పంటించాడు. కాలుతున్న గాయాలతో పరుగెత్తిన రవీందర్ కిందపడిపోవడంతో పక్కనే ఉన్న బండరాయితో తలపై మోది హతమార్చాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. తండ్రి నుంచి ప్రాణాపాయం ఉంటుందనే భయంతోనే హత్యచేసి ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతుడు రవీందర్ భార్య సుధ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆస్తి వ్యవహారాల్లో హత్య జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. నెలరోజుల క్రితమే మృతుడు రూ.కోటి విలువైన ఇంటిని కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో తేలింది.

ఇదీ బాలన్న చరిత్ర..

నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్‌కు చెందిన తిరుపాటి రవీందర్ అలియాస్ బాలన్న నగరంలోని గచ్చిబౌలి ప్రాంతంలో ఉంటూ నగరంలో స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నాడు. మొదటి భార్య చనిపోవడంతో సుధ అనే మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. మావోయిస్టు పార్టీలో పని చేసి తర్వాత కాలంలో నయీం అనుచరుడిగా కొనసాగినట్టు దర్యాప్తులో వెల్లడైంది. బాలన్న మొదటి భార్యకు ఇద్దరు కుమారులు. వారిలో పెద్దకొడుకు చాలా ఏళ్ల క్రితమే చనిపోయాడు. చిన్నకొడుకు విదేశాల్లో స్థిరపడ్డాడు. ప్రస్తుతం రెండో భార్య సుధతో కలిసి ఉంటున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానికంగా రవీందర్‌గా చలామణి అవుతున్న బాలన్నపై 35కు పైగా హత్యకేసులు ఉన్నాయి. నయీం ఎన్‌కౌంటర్ తర్వాత అజ్ఞాతంలో వెళ్లిన అతను రెండు నెలల క్రితం తుర్కయంజాల్‌లోని ఆరెంజ్ అవెన్యూ కాలనీలో కొత్తగా కొనుగోలు చేసిన ఇంట్లోకి మకాం మార్చాడు. రవీందర్, సుధ దంపతులకు అనురాగ్, అభిషేక్ సంతానం ఉన్నారు. పెద్దకొడుకు అనురాగ్ ఖాళీగా ఉంటున్నందుకు మందలించడంతో తండ్రిపై కక్ష పెంచుకున్నాడు. డ్రగ్ ఎడిక్షన్ మాన్పించడానికి రిహాబిలిటేషన్ కేంద్రంలో చేర్పించి చికిత్స చేయించినా మార్పు రాలేదు. ఇప్పటికే అతడిపై రెండు కేసులు కూడా ఉన్నాయి.

ఇఫ్తార్ విందులో ప్రముఖులు

బంజారాహిల్స్: సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని ముఫకంజా కాలేజీలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మహ్మద్ వలియుల్లా, కార్యదర్శి జాఫర్ జావెద్‌లు ప్రముఖులకు ఖర్జూరాలు తినిపించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, సీపీ కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఏకే ఖాన్, మధు యాష్కీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్, షబ్బీర్ అలీ, కేవీపీ, మేయర్ విజయలక్ష్మి



నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి



బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గ్యారెత్ విన్ ఓవెన్

లైఫ్‌లో సెటిలవుదామని..

- రూ. 40లక్షల నగదు, కారుతో పరారీ
- రాజస్థాన్‌లో నిందితుడి అరెస్ట్
- రూ.20 లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ గిరిధర్, చిత్రంలో నిందితుడు..స్వాధీనం చేసుకున్న నగదు

హిమాయత్‌నగర్: పెళ్లి చేసుకుని లైఫ్‌లో సెటిలవుదామని భావించిన ఓ యువకుడు తాను పనిచేస్తున్న యజమానికి చెందిన నగదు, కారుతో ఉడాయించిన కేసులో నిందితుడిని నారాయణగూడ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నగర ఈస్ట్ జోన్ డీసీపీ గిరిధర్ రావు సోమవారం నారాయణగూడ ఠాణాలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన విజేంద్ర సింగ్ అత్తాపూర్‌కు చెందిన స్టీల్ వ్యాపారి వినయ్‌కుమార్ గుప్తా వద్ద డ్రైవర్‌గా పని చేసేవాడు. ఏడాదిన్నరగా పని చేస్తున్న అతను యజమాని నమ్మకాన్ని సంపాదించుకున్నాడు. గత ఫిబ్రవరి 24న వినయ్ కుమార్ గుప్తా రామంతపూర్ వెళుతూ హైదర్ గూడ నిలోఫర్ కేఫ్ వద్ద కారు ఆపి, వాటర్ బాటిల్ తెచ్చుకునేందుకు వెళ్లాడు. వాటర్ బాటిల్ తీసుకువచ్చేసరికి డ్రైవర్, కారు కనిపించకపోవడంతో ఖంగుతిన్న వినయ్ కుమార్.. డ్రైవర్ విజేంద్ర సింగ్‌కు ఫోన్ చేశాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కారుతో పాటు కారులో ఉన్న నగదు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక రాజస్థాన్‌లో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా మొదటగా డబ్బులన్నీ ఖర్చయ్యాయని, ఐపీఎల్ బెట్టింగ్‌లో డబ్బులన్నీ పోగొట్టుకున్నానని బుకాయించాడు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపెట్టాడు. త్వరలో పెళ్లి చేసుకోబోతున్నట్లు, దొంగిలించిన డబ్బులో రూ. 11 లక్షలతో మహేంద్ర స్కార్పియో కారు కొనుగోలు చేశానని, మిగిలిన నగదుతో వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. అతడి నుం,ఇ రూ.20.70 లక్షల నగదు, స్కార్పియో కారు, వినయ్ కుమార్‌కు చెందిన కీయా సెల్టోస్ కారుతో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నగరానికి తీసుకువచ్చి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ వెల్లడించారు. సమావేశంలో సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్, నారాయణగూడ సీఐ చంద్రశేఖర్, డీఐ నాగార్జున పాల్గొన్నారు. రాజస్థాన్ వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకునన్న డీఎస్సై వెంకటేష్, అతడి బృందాన్ని డీసీపీ అభినందించారు.

మొదట రూ.3 లక్షలుగా ఫిర్యాదు తర్వాత రూ.40 లక్షలని మార్పు

అయితే ఈ కేసులో యజమాని వినయ్ కుమార్ గుప్తా డ్రైవర్ మొదట కారుతో ఉన్న రూ.3 లక్షలు ఎత్తుకెళ్లాడని ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత మాత్రం కారులో రూ.40లక్షలు ఉన్నాయని, మొత్తం నగదు అతను ఎత్తుకెళ్లినట్లు తెలిపాడు. వ్యాపారికి చెందిన డబ్బు వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

25 నుంచి హైలైఫ్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: హైలైఫ్ ఫ్యాషన్‌లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ఈ నెల 25 నుంచి 27 వరకు హెచ్ఐసీసీ నోవాటెల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం సోమవారం బంజారాహిల్స్‌రోడ్ నెం 10లో జరిగింది. ఈ సందర్భంగా నటి ఐశ్వర్యతో పాటు పలువురు మోడల్స్ పాల్గొని కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్ర ఉత్పత్తులతో పాటు జ్యువెలరీ కలెక్షన్లు ఆకర్షణగా నిలవబోతున్నాయన్నారు. ఈ సందర్భంగా మోడల్స్ ప్రదర్శనలో ఉంచబోయే దుస్తులతో పాటు వజ్రాభరణాలను ధరించి ఆకట్టుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం



అనురుధ్ (ఫైల్)

కీసర: ట్రాలీ ఆటో ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి చెందిన సంఘటన సోమవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుందన్‌పల్లి చౌరస్తా సమీపంలో చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాకు చెందిన అనురుధ్(21) మేడ్చల్‌లోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో మిత్రులతో కలిసి ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి మేడ్చల్‌లో పార్టీకి వెళ్లిన అతను సోమవారం ఉదయం బైక్‌పై తిరిగి వస్తుండగా కుందన్‌పల్లి చౌరస్తా సమీపంలో తిమ్మాయిపల్లి నుంచి సెంట్రింగ్ సమాగ్రితో వస్తున్న ఆటో ట్రాలీ ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అనురుధ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న కీసర పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళపై కత్తితో దాడి చేసి బంగారం చోరీ

మేడ్చల్‌రూరల్: గుర్తుతెలియని వ్యక్తి ఓ ఇంట్లోకి చొరబడి మహిళపై కత్తితో దాడి చేసి బంగారు ఆభరణాలు లాక్కెళ్లిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అత్వెల్లి, ఎస్ఎల్ఆర్ వెంచర్‌లో దయానంద్, మహామాయ దంపతులు నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం దయానంద్ పాలప్యాకెట్ కోసం బయటికి వెళ్లగా ఆయన భార్య మహామాయ ఇంట్లో ఉన్నారు. దీనిని అదునుగా చేసుకుని మంకీ క్యాప్ ధరించిన వ్యక్తి గోడదూకి ఇంట్లోకి చొరబడ్డాడు. మహామాయను కత్తితో బెదిరించి ఆమె మెడలోని పుస్తెలతాడు లాక్కునే ప్రయత్నం చేయగా ఆమె గట్టిగా అరుస్తూ గొలుసును పట్టుకుంది. దీంతో బాత్ రూంలో ఉన్న ఆమె అత్త బయటికి రావడంతో ఆగంతకుడు భయంతో చేతికి అందిన పుస్తెలు లాక్కుని పరుగులు తీశాడు. 5 గ్రాముల పుస్తెలు, గ్రాము గుండ్లు మాత్రమే దుండగుడికి చిక్కాయి. మేడ్చల్ పోలీసులు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించారు. బాధితురాలి మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాయం చేస్తున్నట్లు నటించి..

రూ.1.73 లక్షలు కాజేశాడు

మేడ్చల్‌రూరల్: ఏటీఎం నుంచి డబ్బులు విత్ డ్రా చేసి ఇవ్వాలని సాయం కోరిన మహిళ కార్డు తస్కరించి పలు దఫాలుగా రూ.1.73 లక్షలు కాజేసిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన పుణ్యవతి గత జనవరి 27న నగదు డ్రా చేసుకునేందుకు మేడ్చల్ పట్టణంలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంకు వెళ్లింది. ఈ సందర్భంగా అక్కడే ఉన్న ఓ యువకుడిని ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేసి ఇవ్వాలని కోరింది. అతడు ఏటీఎం కార్డు తీసుకుని పిన్ నంబర్ చెప్పమని అడగడంతో వివరాలు చెప్పింది. దీంతో రూ.4 వేలు డ్రా చేసి ఇచ్చిన అతను ఆమె ఏటీఎం కార్డుకు బదులుగా తన వద్ద ఉన్న ఎస్బీఐ బ్యాంకుకు చెందిన మరో ఏటీఎం కార్డు ఇచ్చాడు. ఆ తర్వాత తస్కరించిన కార్డుతో విడతల వారీగా పుణ్యవతి ఖాతాలో ఉన్న రూ. 1.73 లక్షలు కాజేశాడు. నాలుగు రోజుల క్రితం డబ్బులు అవసరమై బ్యాంకుకు వెళ్లిన పుణ్యవతి ఖాతాలో డబ్బులు లేకపోవడంతో బ్యాంకు అధికారులను సంప్రదించింది. కార్డు ద్వారా డబ్బులు విత్ డ్రా చేసినట్లు బ్యాంక్ అధికారులు చెప్పడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు సోమవారం మేడ్చల్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకోమంటే.. గొంతు కోసుకున్నాడు

మీర్‌పేట పీఎస్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న ఆకాశ్

మీర్‌పేట: ఇన్‌స్టాగ్రామ్ పరిచయం కాస్త ప్రేమగా మారింది.. పెళ్లి పేరెత్తగానే సదరు యువకుడు ఠాణాలోనే బ్లేడుతో గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్రాం రెడ్డి కథనం మేరకు.. కడ్తాల్ మండలం, వెల్లిగుట్ట తండాకు చెందిన ఇస్లావత్ ఆకాశ్ (21) నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అచ్చంపేటకు చెందిన యువతితో అతడికి ఇన్‌స్టా ద్వారా పరిచయం ఏర్పడింది. అనంతరం ప్రేమ పేరుతో యువతికి మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఇటీవల యువతి వివాహం చేసుకోవాలని కోరడంతో ఆకాశ్ నిరాకరించాడు. యువతి ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో రెండు రోజుల క్రితం పెద్ద మనుషుల పంచాయితీ పెట్టడంతో పెళ్లికి ఒప్పుకున్న అతను ఆ తర్వాత మాట మార్చాడు. దీంతో బాధితురాలు మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం సాయంత్రం ఇరువురి బంధువులు పోలీస్ స్టేషన్‌కు రాగా యువతి బంధువులు ఆకాశ్‌ను పెళ్లిచేసుకోవాలని ఒత్తిడి చేయడంతో పెళ్లి ఇష్టం లేదని స్టేషన్‌లోనే బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతనికి ఎటువంటి ప్రాణాపాయం లేదని.. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నిబంధనలు పాటించని కాలేజీలపై చర్యలు తీసుకోవాలి: ఏబీవీపీ

పంజగుట్ట: వేసవి సెలవులు ఇవ్వకుండా ఇంటర్ బోర్డు నిభంధనలకు విరుద్ధంగా ఎంసెట్ క్లాసుల పేరుతో ఇంటర్ సెకండ్ ఇయర్ తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు పృథ్వీయాదవ్, కళ్యాణిలతో కలిసి మాట్లాడుతూ... విద్యార్థులు క్లాస్‌లకు అటెండ్ కాకపోతే చదువుల్లో వెనకబడి పోతారని తల్లిదండ్రులను బెదిరిస్తూ కాలేజీల్లో వేసవిలో తీసుకోవాల్సిన ఒక్క జాగ్రత్త కూడా తీసుకోకుండా విద్యా సంస్థలు క్లాసులు చెపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోతిఫికేషన్లు రాకముందే కాలేజీల్లో ఇప్పటికే 90 శాతం అడ్మిషన్లు పూర్తిచేశారని, వారి నుంచి 60 శాతం మేర ఫీజులు కూడా వసూలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'తెలుగు సినిమాకు జై జైలు'కు శ్రీకారం



డాక్యుమెంటరీకి కెమెరా ఆన్ చేస్తున్న మురళీమోహన్

బంజారాహిల్స్: తెలుగు సంవత్సరాది ఉగాది వేళ.. 'తెలుగు సినిమాకు జై జైలు' డాక్యుమెంటరీ చిత్రానికి సోమవారం శ్రీకారం చుట్టారు. రచయిత వడ్డేపల్లి కృష్ణ స్క్రిప్ట్‌ను నిర్మాత ధర్మారావుకు అందజేశారు. సినీ నిర్మాత మండలి కోశాధికారి రామసత్యనారాయణ క్లాప్ చేయగా, సినీనటుడు మురళీమోహన్ కెమెరా ఆన్ చేశారు. తొలుత 'ఇట్ మా', పాస్ ఫిలిం అవార్డు సంస్థల తరుపున మురళీమోహన్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మా కార్యవర్గ సభ్యులు మాణిక్, సినీ విశ్లేషకులు ఎంఎస్ ప్రసాద్, పూర్వ ఐటీసీ జనరల్ మేనేజర్ సురపనేని ప్రసాద్‌లు పాల్గొన్నారు.

వాచ్‌మెన్‌కు కలెక్టర్ నివాళి



సాక్షి, సిటీబ్యూరో: అనారోగ్యంతో మృతి చెందిన హైదరాబాద్ కలెక్టరేట్ వాచ్‌మెన్ సత్యనారాయణకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నివాళులర్పించారు. ఐదేళ్లుగా హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ ఆదివారం గుండెపోటుతో మరణించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కలెక్టర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.కదిరవన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, కలెక్టరేట్ ఏవో సదానందం, పర్యవేక్షకులు రాములు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని కొట్టి ఫోన్ లాక్కెళ్లి...

వెంగళరావునగర్: యువకుడిని కొట్టి ఫోన్ లాక్కెళ్లిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... పల్నాడు జిల్లాకు చెందిన వేముల శ్రీనివాసరావు ఈ నెల 7న రాత్రి 1.30 గంటల సమయంలో ఎస్ఆర్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద బస్సు దిగాడు. ఓలా ఆటో కోసం ఎదురు చూస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు యువకులు వచ్చి అతనిని కొట్టి చేతిలోని ఫోన్‌ను లాక్కెళ్లారు. దాంతో శ్రీనివాసరావు సోమవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యక్తి అదృశ్యం...

శ్రీకాకుళం జిల్లాకు చెందిన గుడియ శంకర్ కొంతకాలంగా రహమత్‌నగర్‌లోని తన అల్లుడు గుడియ గిరిధర్ ఇంట్లో ఉంటూ హోటల్ సర్వెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 6వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాలేదు. దీంతో సోమవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కిషన్‌రెడ్డిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపిస్తాం



మాట్లాడుతున్న కొల్లి నాగేశ్వర్‌రావు

కాచిగూడ: లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపిస్తామని ఆ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్ రావు అన్నారు. సోమవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రూ. 10 కోట్లు ఖర్చు పెట్టి దివ్యాంగులకు కావలసిన పరికరాలు అందించిన మొట్టమొదటి ఎంపీ కిషన్‌రెడ్డి అని అన్నారు. దివ్యాంగులకు అండగా నిలిచిన వ్యక్తి కిషన్‌రెడ్డి అని ఆయన పేర్కొన్నారు. దివ్యాంగులు కిషన్‌రెడ్డికి అండగా నిలిచి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. దివ్యాంగుల సంఘం నాయకులు మహంకాళీ రవీందర్, శంకర్, గోవింద్, రాజు, పర్వతాలు, అశోక్ పాల్గొన్నారు.

కూలిన హోర్డింగ్: హోటల్ వర్కర్‌కు తీవ్ర గాయాలు



కూలిన హోర్డింగ్



గాయపడిన సూరజ్‌కుమార్

బంజారాహిల్స్: విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న ఓ హోటల్ వర్కర్‌పై హోర్డింగ్ పడటంతో తీవ్ర గాయాల పాలైన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పంజగుట్ట మెరిడియన్ హోటల్‌లో పనిచేస్తున్న సూరజ్‌కుమార్ సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో విధులు ముగించుకొని పంజగుట్ట నాగార్జున సర్కిల్ నుంచి నడచుకుంటూ ఇంటికి వెళ్తుండగా, కొత్తగా నిర్మిస్తున్న ఓ నిర్మాణ భవనానికి సంబంధించిన హోర్డింగ్ నేల కూలింది. అదే సమయంలో అక్కడి నుంచి వెళ్తున్న సూరజ్‌కుమార్‌పై హోర్డింగ్ పడటంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే సమీపంలోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. టైమ్స్‌స్క్వేర్ బిల్డింగ్ నిర్మాణం జరుగుతుండగా, దానికి సంబంధించిన హోర్డింగ్ కూలినట్లు పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నగరంలో అక్రమ హోర్డింగులపై ఇటీవల జరిగిన జీహెచ్‌ఎంసీ పాలక మండలి సమావేశంలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తడం తెలిసిందే.

మార్కెట్లకు ఉగాది శోభ

కిటకిటలాడిన మార్కెట్లు

పండగ వేళ కొండెక్కిన ధరలు



బంజారాహిల్స్: ఉగాది పండగ నేపథ్యంలోనే ప్రధాన మార్కెట్లతో పాటు పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన కేంద్రాలా వద్ద పండగ సామగ్రి కొనుగోళ్ల సందడి కనిపించింది. బంజారాహిల్స్, పంజగుట్ట, శ్రీనగర్ కాలనీ, ఖైరతాబాద్, సోమాజిగూడ, అమీర్‌పేట్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పండగ సామగ్రి, కొత్త కుండల విక్రయాలు జరిగాయి. తెలుగు సంవత్సరాది శ్రీ క్రోధి నామ సంవత్సరం సందర్భంగా ఆలయాల్లో సైతం ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద పచ్చడి పంపిణీతో పాటు పంచాంగ శ్రవణం ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీవారి ఆలయం, ఫిలింనగర్ దైవసన్నిధానంలో పంచాంగ శ్రవణం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కొండెక్కిన ధరలు...

పండగ వేళ యధావిధిగా పండగ సామగ్రి ధరలను వ్యాపారులు ఆకాశానికి ఎత్తేశారు. షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడిలో వినియోగించే ప్రతి వస్తువు ధర పెరిగిపోయింది. ప్రత్యేకంగా చామంతి పూలు కిలోకు రూ. 400లకు పైగా పలికాయి. బెల్లం కిలో రూ. 200, ఒక్కో మామిడి కాయను రూ. 50లకు పైగానే విక్రయించారు.







మార్కెట్లలో పండగ సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ కార్పొరేటర్ భారతీనాయక్

బంజారాహిల్స్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ..కాంగ్రెస్‌లో చేరికలు భారీగాత జరుగుతున్నాయి. ముఖ్యంగా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌కు చెందిన నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలకు ఆకర్షితులై ఆ పార్టీ కండువా కప్పుకుంటున్నారు. బంజారాహిల్స్ మాజీ కార్పొరేటర్ బీ భారతీనాయక్, వెంకటేశ్వర కాలనీ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సి.రాములుచౌహాన్, సీనియర్ నేత బాబానాయక్ తదితరులు తమ అనుచరులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మూడు సార్లు కార్పొరేటర్‌గా, రెండు సార్లు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా పనిచేసిన గిరిజన నాయకురాలు భారతీనాయక్ కాంగ్రెస్‌లో చేరడం పట్ల రేవంత్‌రెడ్డి ఆనందం వ్యక్తంచేస్తూ ఆమెకు ఘన స్వాగతం పలికారు.



సీఎం రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ నేత మోహన్‌యాదవ్

జూబ్లీహిల్స్ నుంచి...

జూబ్లీహిల్స్ డివిజన్ నేత పి.మోహన్‌యాదవ్ సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. విజయారెడ్డి నేతృత్వంలో సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా మోహన్‌యాదవ్ తెలిపారు.

నృత్యగురు ఉషా గాయత్రికి సత్కారం

బంజారాహిల్స్: ప్రముఖ నృత్యగురు డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం అందుకున్న సందర్భంగా ఆమెకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నృత్య కిన్నెర, కిన్నెర ఆర్ట్స్ థియేటర్‌లు సంయుక్త ఆధ్వర్యంలో బేగంపేటలోని టూరిజం ప్లాజాలో జరిగిన ఆత్మీయ అభినందన సభలో ఉషా గాయత్రిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారుడు కేవీ రమణాచారి, అంతర్జాతీయ తెలుగు సంఘం (ఇట్ క్లా) అధ్యక్షులు, సంస్కృతి రత్న ధర్మారావులు అతిథులుగా విచ్చేసి ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు. మున్ముందు మరెన్నో ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకోవాలని వారు ఆకాంక్షించారు.



ప్రముఖ నృత్యగురు ఉషా గాయత్రిని సత్కరిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ ఆఫీసర్ల పాత్ర కీలకం

- అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి
- పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలి
- సికింద్రాబాద్ ఆర్ఓ హేమంత పాటిల్ సూచన



మాట్లాడుతున్న సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఆర్ఓ హేమంత పాటిల్

బంజారాహిల్స్: ఎన్నికల నిర్వహణలో సెక్టార్ ఆఫీసర్ల పాత్ర కీలకమని, ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వడంలోనూ, ఎన్నికలు సజావుగా జరపడంలోనూ పూర్తి బాధ్యత వీరిదేనని సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ హేమంత పాటిల్ అన్నారు.

- సోమవారం ఖైరతాబాద్ నియోజకవర్గం సెక్టార్ ఆఫీసర్ల సమావేశం జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి హేమంత్ బోర్కాడే అధ్యక్షతన జరిగింది.
- ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి హేమంత మాట్లాడుతూ... చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లేగ్రౌండ్ నుంచి ఈవీఎంలు, వీవీ ప్యాట్లు తదితర ఇతర ఎన్నికల సామాగ్రిని యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియానికి తీసుకురావడంతో పాటు ఒక రోజు ముందు బ్యాలెట్ పేపర్లను అమర్చడం తదితర కమిషనింగ్ పనులను సెక్టార్ ఆఫీసర్లు బాధ్యతాయుతంగా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.
- పోలింగ్ స్టేషన్లకు సిబ్బందిని తరలించడంలోనూ, అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షించడంలోనూ వీరిదే ముఖ్యపాత్ర అని పేర్కొన్నారు. సెక్టార్ ఆఫీసర్లు ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ సరళిని తెలియజేయాల్సి ఉంటుందన్నారు.
- పోలింగ్ పూర్తయిన తరువాత ఈవీఎంలను కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియానికి తరలించడంలోనూ ప్రశాంత వాతావరణంలో సకాలంలో తీసుకురావడంలోనూ వీరు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో 245 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, 30 మంది సెక్టార్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. ఇందులో ఐదు మంది సెక్టార్ ఆఫీసర్లు రిజర్వ్‌లో ఉంటారన్నారు.
- ఏఆర్ఓ హేమంత్ బోర్కాడే మాట్లాడుతూ... సెక్టార్ ఆఫీసర్లు తమకు ఉన్న సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని, ఎన్నికల అధికారుల నుంచి తగిన సమాచారాన్ని సేకరించుకోవాలన్నారు.
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికలు ఎంతో ప్రశాంతంగా జరిగాయని, అదే స్ఫూర్తితో సికింద్రబాద్ పార్లమెంట్ ఎన్నికలు కూడా నిర్వహించడానికి సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో నియోజకవర్గం ఈఆర్‌ఓలు ప్రశాంతి, అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పనిచేసే వారికి గుర్తింపు



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హిమాయత్‌నగర్: బీజేపీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ సహ కన్వీనర్‌గా శివాయల నరహరిని నియమించారు. ఈ మేరకు సోమవారం నియమాకపత్రాన్ని అందజేశారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, నగర ఉపాధ్యక్షుడు పందిర్ల ప్రసాద్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, నర్సింగ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

బీజేపీ అంబర్‌పేట జాయింట్ కన్వీనర్‌గా రాజు

కాచిగూడ: బీజేపీ అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్‌గా మైలారం రాజును నియమిస్తూ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు నియామక పత్రాన్ని అందజేశారు. సోమవారం బర్కత్‌పురాలోని పార్టీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ గౌతంరావు మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి గెలుపుకోసం పార్టీ నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణ గల సైనికుల వలే పనిచేయాలని సూచించారు. పార్టీ నేతలు ఆనంద్‌గౌడ్, అజయ్, కృష్ణగౌడ్, శ్యామ్‌రాజ్, నాగభూషణం చారి, భిక్షపతి, మనోజ్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రచార రథాలు సిద్ధం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీపడుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచార రథాలను సిద్ధం చేసుకుంటున్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసం వద్ద అన్ని హంగులతో తీర్చిదిద్దిన ప్రచార రథాన్ని నేతలతో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలతో కూడిన ఈ ప్రచార రథం పూర్తిగా సిద్ధం కాగా నామినేషన్ల ప్రక్రియ నుంచి వాడవాడలా దీనిని తిప్పాలని నిర్ణయించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఈ ప్రచార రథంతో పాటు మరికొన్నింట్లో అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నాగేందర్ మాట్లాడుతూ... ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను తలదన్నేలా తమ ప్రచారం దూసుకుపోతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని వెల్లడించారు. తుక్కుగూడ జనజాతర బహిరంగ సభ విజయవంతమైందని, సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి మహిళలు భారీగా తరలివచ్చారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రచారాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

'జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ తెప్పిస్తాం'

: కార్పొరేటర్ వెల్దండ



మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్: వచ్చే నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ విజయానికి రేయింబవళ్లు కృషి చేస్తామని, ఆయన గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. పద్మారావుగౌడ్ సమక్షంలో జూబ్లీహిల్స్ డివిజన్ నుంచి భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కారు సత్తా చాటుతామన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల్లోనూ జూబ్లీహిల్స్ డివిజన్‌లో కారు స్పీడ్ పెంచుతామని, ఇక్కడి నుంచి భారీ మెజార్టీ తీసుకువస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు ఇంకా కేసీఆర్‌ను మరిచిపోలేదని పేర్కొన్నారు. డివిజన్‌లో ఇప్పటికీ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్‌తోనే ఉన్నారని, ఇది తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యకర్తలు ఇతర పార్టీల వైపు వెళ్లకుండా పూర్తిగా కేసీఆర్, కేటీఆర్ వెంటే ఉన్నారని, పద్మారావుగౌడ్ విజయానికి తమ వంతు కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలోనే డివిజన్‌లో ప్రచారం ఉధృతం చేస్తామని, ఈ ఎన్నికల్లో పద్మారావుగౌడ్ విజయం ఖాయమన్నారు.

పార్సిల్ ద్వారా డ్రగ్స్ తెస్తున్నారంటూ మోసం

హిమాయత్‌నగర్: కొరియర్ ద్వారా విదేశాల నుంచి డ్రగ్స్ తీసుకొస్తున్నారంటూ ఓ మహిళను సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం... నగరానికి చెందిన 50 ఏళ్ల మహిళకు ముంబై పోలీసుల మంటూ సైబర్ కేటుగాళ్లు ఫోన్ చేశారు. తన పేరుతో ఫెడెక్స్ పార్శిల్ తైవాన్ నుంచి ముంబైకి వచ్చిందని, వాటిలో నిషేధిత డ్రగ్స్ ఉన్నాయని బెదిరించారు. తాము చెప్పినట్లు చేయకపోతే వెంటనే అరెస్ట్ చేయిస్తామని భయపెట్టారు. ఆ వెంటనే మరో టీమ్‌తో చీటర్స్ సైబర్ క్రైమ్ పోలీసుల మంటూ వీడియో కాల్ చేశారు. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని, చెబితే బాధితురాలి పిల్లల జీవితాలను నాశనం చేస్తామని కేటుగాళ్లు బెదిరించారు. బాధితురాలు తమ బ్యాంక్ అకౌంట్లలో అక్రమ లావాదేవీలు జరిగాయని, వెంటనే వెరిఫై చేయాలని నమ్మించి బాధితురాలి బ్యాంక్ వివరాలను, ఆధార్ కార్డు, బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను తీసుకున్నారు. అనంతరం ఆమె వారు చెప్పిన విధంగా రూ. 1.11 లక్షలను చీటర్స్ అకౌంట్‌కి ట్రాన్స్‌ఫర్ చేసింది. అనంతరం మోసపోయానని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వల్లాల గ్రౌండ్‌లో ఘనంగా ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న కార్పొరేటర్, కాంగ్రెస్ నేతలు



ముస్లింలకు ఖర్జూరా తినిపిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

వెంగళరావునగర్: కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి వి.నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం యూసుఫ్‌గూడలోని వల్లాల గ్రౌండ్‌లో ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వి.చిన్న శ్రీశైలం యాదవ్, రహమత్ నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, పలువురు సీనియర్ నేతలు, ముస్లిం మత పెద్దలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

సందడిగా ఇఫ్తార్

బంజారాహిల్స్: పంజగుట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కన మసీదులో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

మాదిగలకు టిక్కెట్ విషయంలో సీఎం పునరాలోచించాలి

మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు

పంజగుట్ట: తన నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో కాంగ్రెస్‌లో మాదిగలు లేకుండా టిక్కెట్ పంపిణీ జరగడం ఇదే మొదటిసారి అని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. మాదిగలకు రిజర్వేషన్లే లేవు, వారంటే లెక్కలేదు అన్నట్లు కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిందని, ఇలానే ఉంటే రాష్ట్రంలోని 70 లక్షలకు పైగా ఉన్న మాదిగలు పార్టీకి దూరమయ్యే అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సీఎం మరోసారి పునరాలోచించాలని కోరారు. మాదిగ జేఏసీ, మాదిగ శక్తి, మాదిగ రాజకీయ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికలో మాదిగలకు జరిగిన తీవ్ర అన్యాయంపై సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అధ్యక్షత వహించారు. తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం మాట్లాడుతూ... ఈ నెల 13వ తేదీన చలో గాంధీభవన్ చేపట్టి ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తామన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ కాశీం, వరప్రసాద్, రాధిక, ప్రభాకర్, సన్ని సురేందర్ పాల్గొన్నారు.

'ప్రజల అజెండానే బీఎల్ఎఫ్ అజెండా'



మాట్లాడుతున్న నల్లా సూర్యప్రకాష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజల అజెండానే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) అజెండా అని ఆ పార్టీ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఎల్ఎఫ్ రెండు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బహుజనులకు రాజ్యాధికారం వచ్చేదాక తమవంతుగా పోరాటం చేస్తామన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న బీజేపీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని కోరారు. వరంగల్ పార్లమెంటు స్థానానికి ఎంసీపీఐయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాస్ సావిత్రి, నాగర్‌కర్నూల్ పార్లమెంటు స్థానానికి కంబలి బాలస్వామిలను తమ అభ్యర్థులుగా ప్రకటించారు. ఇప్పటికే ఏడు స్థానాలలో అభ్యర్థులను ప్రకటించామని త్వరలో మరిన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు. బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్, దొంతు రాజేష్, పల్లెపు ఉపేందర్‌రెడ్డి, గోనె కుమారస్వామి, పెద్దారపు రమేష్, ఎస్.ప్రతాప్, బాబురావు, గద్దం నాగార్జున, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 17, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 35, పందిరి బీర 40, క్యాబేజీ 21, క్యారెట్ 25, దొండ 18, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 50, గోకరకాయ 28, కీర 22, దోసకాయ 17, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 35, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

డిజైన్ టెక్ ఆస్తులను ఈడీ జప్తు చేయడం సబబే

- ఆ ఆస్తిని నేరం ద్వారా సంపాదించారనేందుకు ఆధారాలు ఉంటే జప్తు చేయొచ్చు
- స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో డిజైన్ టెక్‌కు గట్టి ఎదురుదెబ్బ
- కుంభకోణం తీవ్రత, ప్రజాధనం దృష్ట్యా డిజైన్ టెక్ వాదనను ఆమోదించలేం
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి కీలక తీర్పు
- అడ్జ్యుడికేటింగ్ అథారిటీ షోకాజ్ నోటీసులకు సమర్థన.. డిజైన్ టెక్ పిటిషన్ కొట్టివేత

రాజకీయాల్లోనూ పవన్‌ది నటనే



- స్వార్థం కోసమే పవన్ జనసేనను స్థాపించారు
- త్యాగం పేరుతో లోపాయికారి ఒప్పందాలతో నాలాంటి వారిని నట్టేట ముంచారు
- జన సైనికులను జెండా కూలీలుగా, టీడీపీకి బానిసలుగా మార్చారు
- పార్టీని పూర్తిగా నాశనం చేసిన నాదెండ్ల మనోహర్
- జనసేనకు రాజీనామా చేసిన ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేశ్

టీడీపీలో 'ఆడియో' దుమారం



- వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఫోన్ సంభాషణతో ఆ పార్టీలో కలవరం.. సర్వేపల్లిలో సోమిరెడ్డి ఓడిపోతాడు
- ఆత్మకూరులో 'ఆనం'కు పదివేలతో ఓటమి ఖాయం
- వైఎస్సార్‌సీపీని వీడిపోవడం నాకిష్టం లేదు
- ఎన్నికల్లో విజయం సాధించకుంటే క్విట్ అవుతాం
- కలకలం రేపుతున్న టీడీపీ కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వ్యాఖ్యలు
- ఆడియో విడుదల చేసిన ఎమ్మెల్యే ప్రసన్న సోదరుడు

షర్మిలకు ఝలక్

- ఎన్నికల ప్రచారంలో సీఎం వైఎస్ జగన్‌పై తీవ్ర విమర్శలు చేసిన పీసీసీ అధ్యక్షురాలు
- చలించిపోయిన వైఎస్సార్ అభిమాని చంద్రఓబులరెడ్డి
- జై జగన్ అంటూ నినాదాలు.. సభికులంతా గొంతు కలిపిన వైనం
- అక్కడ నుంచి కాదు.. తన వద్దకు వచ్చి మాట్లాడాలని షర్మిల సవాల్
- దీంతో ఆమె వద్దకు వెళ్లి సీఎం చేసిన మంచి పనులను వివరించిన ఓబులరెడ్డి
- మాట రాక నిశ్చేష్టురాలైన షర్మిల

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అవ్వాతాతలూ ఆలోచించండి

పింఛనుదారులతో ముఖాముఖిలో ముఖ్యమంత్రి జగన్ • చంద్రబాబు చెప్పేవన్నీ హద్దుల్లేని అబద్ధాలే

- మీ బిడ్డకు మోసం చేయడం తెలియదు
- నాకు తెలిసింది విలువలు, విశ్వసనీయతే
- చంద్రబాబు హయాంలో ఇచ్చిన పెన్షన్లు 39 లక్షలు
- మన ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్లు ఏకంగా 66.34 లక్షలు
- చంద్రబాబు మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేశాడు
- మేం చెప్పిన ప్రతి హామీని 99 శాతం నెరవేర్చాం
- మంచి చేసే విషయంలో మనతో ఎవరూ పోటీ పడలేరు
- అవ్వాతాతల విషయంలో అసలు తగ్గే పరిస్థితే ఉండదు



ప్రకాశం జిల్లా వెంకటాచలంపల్లి వద్ద ఓ మహిళను ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం జగన్

సాక్షి, ప్రతినిధి, ఒంగోలు: ''పేదలకు గానీ, అవ్వాతాతలకు గానీ, పిల్లలకు గానీ, ఏ వర్గానికైనా సరే.. మంచి చేసే విషయంలో జగన్‌తో పోటీ పడే నాయకుడు ఈ దేశంలోనే ఎక్కడా డడు అని గర్వంగా చెబుతున్నా. వెసులుబాటును బట్టి అవకాశం ఉంటే ఎక్కడా మీ బిడ్డ తగ్గడు. మరీ ముఖ్యంగా అవ్వాతాతల విషయంలో అసలు తగ్గే అవకాశం, పరిస్థితి ఉండనే ఉండదు అని స్పష్టంగా చెబుతున్నా. మన ప్రమాణ స్వీకారం రోజు వలంటీర్ వ్యవస్థను మళ్లీ పునరుద్ధరించే కార్యక్రమంపైనే మొట్ట మొదటి సంతకం చేస్తా''అని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మీ బిడ్డకు అబద్ధాలు ఆడటం, మోసం చేయడం తెలియదు కాబట్టి చంద్రబాబు, ఆయన కూటమితో ఈ రెండు విషయాల్లో మాత్రం పోటీ పడలేడని వ్యాఖ్యానించారు. సోమవారం ప్రకాశం జిల్లా వెంకటాచలంపల్లి గ్రామంలో పెన్షనర్లతో సీఎం జగన్ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

అవ్వాతాతలపై ప్రేమతో...

ఈరోజు అవ్వాతాతలతోపాటు ప్రతి ఒక్కరూ కొన్ని విషయాలపై ఆలోచన చేయమని కోరుతున్నా. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు రెండు నెలల ముందు వరకూ ఇచ్చిన పెన్షన్ రూ.1, అది కూడా జన్మభూమి కమిటీలకు లంచాలు సమర్పించుకుంటేనే అందిన దుస్థితి. ఎన్నికలకు ఆర్నెళ్ల ముందు వరకు కేవలం 39 లక్షల మందికి మాత్రమే పెన్షన్లు ఇచ్చారు. అప్పట్లో నెలకు వెచ్చించిన వ్యయం కేవలం రూ.400 కోట్లు. అలాంటి పరిస్థితుల్లో మొట్ట మొదటి సారిగా మీ బిడ్డ అవ్వాతాతల గురించి, వారి కష్టాలు, ఆత్మగౌరవం గురించి ఆలోచన చేశాడు. అధికారంలోకి రాగానే దేశంలో ఎప్పుడూ చూడని విధంగా గ్రామ స్వరాజ్యానికి నిర్వచనం ఇస్తూ ప్రతి గ్రామంలో సచివాలయాలను నెలకొల్పి వలంటీర్ వ్యవస్థను తెచ్చాం. ప్రతి నెలా 1వ తారీఖునే అది సెలవు రోజైనా, ఆదివారమైనా సరే ఇంటివద్దే నేరుగా అవ్వాతాతల చేతుల్లో పెన్షన్లు పెట్టిన పరిస్థితి 56 నెలలు మన ప్రభుత్వం హయాంలోనే జరిగింది. గతంలో 39 లక్షలు మంది మాత్రమే ఫించనుదారులుండగా ఈరోజు వివక్ష లేకుండా 66.34 లక్షల మందికి టంచన్‌గా పెన్షన్ అందిస్తున్నాం.

తెలుగు ప్రజలకు సీఎం జగన్ ఉగాది శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అన్నీ శుభాలు జరగాలని.. విజయాలు సిద్ధించాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులకు మేలు కలగాలని, సకల వృత్తుల వారు ఆనందంగా.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇల్లూ కళకళలాడాలని, మన సంస్కృతీ సంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

అది కూడా గత సర్కారు హయాంలో మాదిరిగా రూ.వెయ్యి కాకుండా ఏకంగా రూ.3 వేల దాకా పెంచుకుంటూ వెళ్లి అవ్వాతాతలకు మంచి చేశాం. ఈ తేడాను ఒక్కసారి గమనించండి.

> ''వాళ్లు ఎలాగూ చేసేది లేదు కాబట్టి చెప్పడానికేముంది? నోటికి అడ్డేముంది? అబద్ధాలకు రెక్కలు కట్టేస్తే చాలు.. ఎలాగూ చేసేది లేదు కదా! అనే మనస్తత్వం వాళ్లది. మీ బిడ్డ అలా కాదు. ఏదైనా చెప్పాడంటే కచ్చితంగా చేసి చూపిస్తాడు''
> – ఫించన్‌దారులతో సీఎం జగన్

బాబు ఆ ఆలోచనే చేయలేదు..

గత పాలకులను చూశారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా, మూడుసార్లు పరిపాలన చేశానని చెబుతుంటారు. కానీ ఏ ఒక్క రోజైనా మీ బిడ్డ మాదిరిగా అవ్వాతాతల గురించి ఆయన ఆలోచన చేశాడా? అవ్వాతాతల ముఖంలో చిరునవ్వులు చూడాలనే తాపత్రయం, మనసులో ప్రేమ ఉంటేనే చేతల్లో బయటకు వస్తుంది. ఇవాళ రాజకీయాలు పాతాళానికి దిగజారాయి. విలువలు, విశ్వసనీయత లేవు. ఈ వ్యవస్థను మార్చడానికి మీ బిడ్డ తొలిసారిగా అడుగులు వేగంగా వేశాడు. మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో ఏకంగా 99 శాతం అమలు చేసి చిత్తశుద్ధితో మీ ముందుకు వచ్చాడు. మీ బిడ్డకు అబద్ధాలు, మోసాలు తెలియవు. ఏదైనా చెప్పాడంటే కచ్చితంగా చేసి చూపిస్తాడు. మీ ముందు ఉంచుతున్న వాస్తవాలపై ఆలోచన చేయమని అందరినీ కోరుతున్నా.

రూ.3 వేలు పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం మనదే

ప్రకారం చూస్తే ఐదు కోట్ల మందిలో 66.34 లక్షల మందికి పెన్షన్లు, అత్యధికంగా ఫించన్ మొత్తాన్ని అందిస్తున్న రాష్ట్రం మనదే. నెలకు రూ.3 వేల పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం దేశంలో మరొకటి లేదు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో ఫించన్ల కోసం నెలకు రూ.400 కోట్లు కూడా ఇవ్వని పరిస్థితి నుంచి ఈరోజు నెలకు రూ.2 వేల కోట్లు కేవలం పెన్షన్ల కోసమే అందచేస్తున్నాం. సంవత్సరానికి రూ.24 వేల కోట్లు పెన్షన్ల రూపంలో ఇస్తున్నాం. మీ బిడ్డ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఏప్రిల్ కూడా కలిపితే ఏకంగా రూ.90 వేల కోట్లు పెన్షన్ల రూపంలో అవ్వాతాతల ముఖంలో చిరునవ్వులు చూసేందుకు చేతిలో పెట్టినట్లయింది. ఏటా రూ.24 వేల కోట్లు ఫించన్ల కోసం ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కాగా బిహార్‌లో రూ.4300 కోట్లు, ఉత్తరప్రదేశ్‌లో రూ.5,160 కోట్లు, కర్ణాటకలో రూ.4,700 కోట్లు, పక్కన తెలంగాణలో రూ.8,180 కోట్లు చొప్పున ఏటా పెన్షన్ల కోసం వ్యయం చేస్తున్నారు. ఈ విషయాలన్నీ ఎందుకు చెబుతున్నానంటే అవ్వాతాతలను మోసం చేసేందుకు రూ.4 వేలు.. రూ.5 వేలు.. రూ.6 వేలు అని చెబుతారు. ఇంకా అవసరం అయితే ఎలాగూ చేసేది లేదు కాబట్టి ప్రతి ఒక్కరికీ రూ.8 వేలు అని కూడా అంటారు. మేనిఫెస్టోలో చెప్పినా, చెప్పకపోయినా చేయగలిగిందే చెప్పాలి. చెయ్యలేనిది నా నోట్లో నుంచి రాదు. ఈ 58 నెలల పాలన చూస్తే చెప్పనివి కూడా చాలా చేసిన పరిస్థితి మీ అందరికీ కనిపిస్తుంది.

బాబును నమ్మితే పులి నోట్లో తల పెట్టినట్లే

2014లో చంద్రబాబు స్వయంగా సంతకం చేసి ప్రధాని మోదీ, దత్తపుత్రుడి ఫొటోలతో ఎన్నికల ప్రణాళికలో ఏం చెప్పాడో మీ అందరికీ తెలుసు. ఎన్నికలు ముగిసి అధికారంలోకి రాగానే ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. చంద్రబాబు మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేశాడు. మీ అందరికీ అందుకే చెబుతున్నా. మోసం చేసే వాళ్లను, అబద్ధాలు చెప్పే వాళ్లను నమ్మొద్దండి. మీ బిడ్డ పేదల సంక్షేమానికి సంవత్సరానికి దాదాపుగా రూ.70 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాడు. ఎక్కడా అవినీతి, వివక్ష లేకుండా మీ బిడ్డ సమూల మార్పులు తేవడంతో ఈరోజు ఇన్ని మంచి పనులు జరుగుతున్నాయి. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అని నమ్మబలుకుతున్న చంద్రబాబు హామీలు రూ.1.40 లక్షల కోట్లు దాటుతున్నాయి. సునాయాసంగా నోటికొచ్చిన అబద్ధాలు చెబుతున్నారు. చంద్రబాబుకు పొరపాటున ఓటేస్తే పులి నోట్లో తలకాయ పెట్టినట్లే అన్నది ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోండి. మీలో ఎవరైనా నాకు సూచనలు, సలహాలు ఇవ్వాలనుకుంటే స్లిప్పులో రాసి బాక్సులో వేస్తే నావద్దకు వస్తాయి. తెలుగువారి నూతన సంవత్సరాది ఉగాది సందర్భంగా మీ అందరికీ పండుగ శుభాకాంక్షలు.

సీఐడీ కేసుల్లో దోషులకు శిక్ష ఖాయం

5 కేసులు దర్యాప్తు చేస్తున్నాం

పూర్తి ఆధారాలతో కోర్టులో చార్జిషీట్లు దాఖలు.. కేస్ డైరీలు, ఇతర ఆధారాలన్నీ న్యాయస్థానానికి ఇచ్చాం

- అందుకోసం లక్షల పేజీల ఫొటోస్టాట్ కాపీలు తీశాం.. సక్రమంగా రాని కాపీలను చిత్తుగా పరిగణించి కాల్చివేశాం
- ఇది అన్ని దర్యాప్తు సంస్థలు పాటించే విధానమే.. దీన్ని వక్రీకరిస్తూ ఓ వర్గం మీడియా దుష్ప్రచారం
- కేసుల ఆధారాలన్నీ భద్రంగా ఉన్నాయి
- ఆదాయ పన్ను శాఖ నుంచి సక్రమంగానే హెరిటేజ్ ఐటీ రిటర్న్‌లు
- హెరిటేజ్ నుంచి కూడా కొన్ని పత్రాలు తీసుకున్నాం.. సిట్ స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి, కుంభకోణాలపై సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నమోదు చేసిన కేసుల్లో దోషులకు శిక్ష ఖాయమని తేలడంతో ఎల్లో గ్యాంగ్ బెంబేలెత్తుతోంది. దాంతో సిట్‌పై దుష్ప్రచారం చేసేందుకు యత్నించి బోర్లా పడింది. చంద్రబాబు కేసుల పత్రాలను సిట్ కార్యాలయం ప్రాంగణంలో కాల్చివేస్తున్నారంటూ ఎల్లో చానళ్లు సోమవారం హడావుడి చేశాయి. ఈ ఎన్నికల తరువాత వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని భావించే సిట్ అధికారులు ఇలా పత్రాలను కాల్చివేస్తున్నారంటూ వక్రీకరించిన కథనాలతో ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించాయి. కానీ తాము దర్యాప్తు చేస్తున్న అయిదు కేసుల్లో పూర్తి ఆధారాలతో న్యాయస్థానాల్లో చార్జ్‌షీట్లు దాఖలు చేశామని, అంతకు ముందే కీలక కేస్ డైరీలు, ఆధారాలుగా ఉన్నఒరిజినల్ పత్రాలను కూడా న్యాయస్థానాలకు సమర్పించామని సిట్ స్పష్టం చేసింది. ఆ సందర్భంగా తీసిన లక్షలాది ఫొటోస్టాట్ కాపీల్లో సరిగా రాని వాటిని చిత్తుగా పరిగణించి కాల్చివేశామని వెల్లడించడంతో ఎల్లో మీడియా నోళ్లు మూతపడ్డాయి. అసలు కేసులకు సంబంధించిన పత్రాలను రహస్యంగా కాల్చివేసే ఉద్దేశమే ఉంటే ఎక్కడో రహస్యంగా చేస్తారు. అది పెద్ద కష్టమేమీ కాదు. కానీ, సిట్ కార్యాలయ ప్రాంగణంలో.. అదీ పట్టపగలు అందరూ చూస్తుండగా ఎందుకు చేస్తారు? ఈ చిన్న లాజిక్‌ను మర్చిపోయిన ఎల్లో మీడియా బోల్తా పడింది.

అదిగో తోక.. ఇదిగో పులి..

తాడేపల్లిలోని సిట్ కార్యాలయం ఉన్న గేటెడ్ కమ్యూనిటీ ప్రాంగణం సమీపంలో కొన్ని చిత్తు కాగితాలను సిబ్బంది సోమవారం ఉదయం కాల్చివేశారు. అది చూసి టీడీపీ నేతలు, ఆ పార్టీకి కొమ్ముకాసే ఎల్లో మీడియా చానళ్లు హడావుడి మొదలుపెట్టాయి. చంద్రబాబుపై నమోదు చేసిన కేసుల కీలక పత్రాలను సిట్ అధికారులు రహస్యంగా దహనం చేసేస్తున్నారని, వాటిలో హెరిటేజ్ ఫుడ్స్‌కు సంబంధించిన పత్రాలు ఉన్నాయంటూ ప్రచారం ప్రారంభించాయి. అనుమతి లేకుండా సిట్ అధికారులు తీసుకున్న హెరిటేజ్ ఫుడ్స్, నారా భువనేశ్వరిల ఆదాయ పన్ను రిటర్న్ కాపీలు వీటిలో ఉన్నాయని ఊదరగొట్టాయి. చంద్రబాబుపై అక్రమంగా కేసులు నమోదు చేశారని, లోకేశ్‌ను అక్రమంగా విచారించారని, అందుకే ఆ కేసుల కాపీలను దహనం చేసేస్తున్నారని కూడా చెప్పుకొచ్చాయి. అంతే కాదు.. ఈ ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బండారం బయటపడుతుందనే ఆందోళనతోనే సిట్ అధికారులు ఇలా పత్రాలను రహస్యంగా దహనం చేస్తున్నారని కూడా ఇష్టానుసారం వక్రీకరణలతో కూడిన కథనాలను ప్రసారం చేశాయి. ఎన్నికల వేళ ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు పడరాని పాట్లు పడ్డాయి.

దుష్ప్రచారాన్ని తిప్పికొట్టిన సిట్

టీడీపీ నేతలు, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని సిట్ ఓ ప్రకటనలో సమర్థంగా తిప్పికొట్టింది. 'సిట్ కార్యాలయం సమీపంలో దహనం చేసినవి చిత్తు ప్రతులే. మేము దర్యాప్తు చేస్తున్న 5 కేసుల్లో పూర్తి ఆధారాలతో ఇప్పటికే విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో చార్జిషీట్లు దాఖలు చేశాం. ఈ కేసుల కేస్ డైరీలు, ఇతర కీలక ఆధారాలను న్యాయస్థానానికి ఎప్పటికప్పుడు సమర్పించాం. ఆధారాల్లో వేటినీ ధ్వంసం చేయలేదు. ఆధారాలన్నీ భద్రంగా ఉన్నాయి. పూర్తి ఆధారాలతో నమోదు చేసిన ఈ కేసుల్లో దోషులకు శిక్షలు పడటం ఖాయం. ప్రతి కేసులో 40 మంది వరకు నిందితులు ఉన్నారు. ఒక్కో కేసులో ఒక్కో నిందితునికి సంబంధించి దాదాపు 10 వేల పేజీలను ఫొటోస్టాట్ కాపీలు తీయాల్సి వచ్చింది. లక్షలాది పేజీలు కాపీలు తీసే క్రమంలో మెషిన్లు వేడెక్కడ,ం కాగితాలు వాటిలో ఇరుక్కుపోవడం, ఇంకు తగ్గిపోవడం వంటి కారణాలతో చాలా కాపీలు ఫేడ్ అవుట్ అయ్యాయి. వీటిని పక్కనపెట్టేసి కొత్తగా మళ్లీ కాపీలు తీయాల్సి వచ్చింది. ఫేడ్ అవుట్ అయిన వాటిని చిత్తుగా పరిగణించి కాల్చివేశాం. ఇది అన్ని దర్యాప్తు సంస్థల్లో, సాధారణ ఆఫీసుల్లో కూడా పాటించే ప్రక్రియే' అని సిట్ అధికారులు పేర్కొన్నారు.

నిబంధనల ప్రకారమే హెరిటేజ్ ఐటీ రిటర్న్‌లు తీసుకున్నాం

హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీ, చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల ఆదాయ పన్ను రిటర్న్ కాపీలను అక్రమంగా తీసుకున్నారని, అందుకే వాటిని దహనం చేశారన్న ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని కూడా సిట్ తిప్పికొట్టింది. తాము నిబంధనల ప్రకారమే హెరిటేజ్ ఫుడ్స్, ఇతర నిందితుల ఆదాయ పన్ను రిటర్న్ కాపీలను తీసుకున్నామని తెలిపింది. ఆదాయ పన్ను శాఖకు అధికారికంగా లిఖిత పూర్వకంగా కోరి వారి నుంచి ఆ కాపీలను తీసుకున్నామని చెప్పింది. హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీ నుంచి కూడా అధికారికంగానే లేఖ రాసి మరీ చాలా పత్రాలను తీసుకున్నామంది. ఆ ఐటీ రిటర్న్‌లు, హెరిటేజ్ ఫుడ్స్ నుంచి తీసుకున్న పత్రాల ఆధారాంగానే ఈ కేసులో లోకేశ్, ఇతర నిందితులను విచారించామని సిట్ తెలిపింది. ఆ దర్యాప్తు నివేదికను కూడా న్యాయస్థానానికి సమర్పించామని చెప్పింది. ఓ వర్గం మీడియా ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేయడాన్ని సిట్ తీవ్రంగా ఖండించింది. ఆ మీడియా చానళ్ల దుష్ప్రచారాన్ని మాని వాస్తవాలను తెలుసుకోవాలిన హితవు చెప్పింది.

'హెరిటేజ్'కు దీటైన జవాబు ఇచ్చిన సిట్

చంద్రబాబుపై నమోదైన కేసులకు సంబంధించిన తమ కంపెనీ పత్రాల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ హెరిటేజ్ ఫుడ్స్ రాసిన లేఖకు సీఐడీ దీటైన సమాధానం ఇచ్చింది. హెరిటేజ్ ఫుడ్స్‌కు సంబంధించిన పత్రాలపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని, అవన్నీ న్యాయస్థానానికి తాము ఎప్పుడో సమర్పించామని, అన్ని పత్రాలు భద్రంగా ఉన్నాయని స్పష్టం చేసింది. ఈమేరకు సిట్ అధికారులు హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీ సెక్రటరీ ఉమాకాంత బారిక్‌కు సోమవారం ఓ లేఖ రాశారు. తాము హెరిటేజ్ ఫుడ్స్‌కు అధికారికంగా లేఖ ద్వారా కోరి 2022 సెప్టెంబరు 12 నుంచి 2023 అక్టోబరు 4 వరకు ఏడుసార్లు పొందిన ఆ కంపెనీ పత్రాల వివరాలను వెల్లడించారు. ఆ ఒరిజినల్ పత్రాలను న్యాయస్థానానికి సమర్పించిన వివరాలను సీఎఫ్ఆర్ నంబర్లతో సహా తెలిపారు. ఓ వర్గం మీడియా ఉద్దేశపూర్వకంగా చేసిన దుష్ప్రచారాన్ని ఖండిస్తూ తాము జారీ చేసిన ప్రెస్ నోట్‌ను కూడా ఈ లేఖకు జతపరిచారు. ఆ వర్గం మీడియా రాజకీయ దురుద్దేశాలతో సిట్‌పై చేస్తున్న దుష్ప్రచారంపై ఎన్నికల కమిషన్‌కు చేసిన ఫిర్యాదు కాపీని కూడా హెరిటేజ్ ఫుడ్స్‌కు అందించారు.

మళ్లీ పలికిన బాబు చిలక

వరదలో కొట్టుకుపోతున్న వాడికి గడ్డి పోచ దొరికినా ఆశగా దాన్ని పట్టుకుంటాడు. అలాగే ప్రజా వ్యతిరేక వరదలో కొట్టుకుపోతున్న చంద్రబాబు.. ప్రశాంత్ కిషోర్ అనే గడ్డిపోచ పట్టుకుని ఎన్నికల్లో గట్టెక్కేయాలని తెగ ఆరాట పడుతున్నారు. అయితే ఈ గడ్డిపోచ పరిస్థితి ఇప్పటికే తెగిన గాలిపటంలా మారిందని దేశ వ్యాప్తంగా అందరికీ తెలుసు. మాకక్కర్లేదని రెండు జాతీయ పార్టీలు విసిరికొడితే ఉనికి కోసం పాట్లు పడుతున్న ఇతగాడు చంద్రబాబు గూటికి చేరారు. అలాగని ఆ విషయాన్ని ధైర్యంగా బయటకు చెప్పే ధైర్యం లేదు. రాజకీయాలకు పనికి రాక, ఒంటరిగా ఏమీ చేయలేక.. బాబు ఇచ్చింది పుచ్చుకుని ఆయన చెప్పిన మాటలను వల్లె వేస్తున్నారు.

నాడు లగడపాటిలా నేడు పీకే చిలక జోస్యం

చంద్రబాబు విసిరే ప్యాకేజీ కోసం పచ్చగూటికి చేరిన ప్రశాంత్ కిశోర్

- అవసరమైనప్పుడల్లా బాబుకు అనుకూల ప్రకటనలు.. మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని డజనుకు పైగా జాతీయ మీడియా సంస్థల సర్వేల్లో వెల్లడి
- ఏ యంత్రాంగం లేని పీకే.. ప్యాకేజీ కోసమే చంద్రబాబు మాటలు
- 2019లోనూ లగడపాటి రాజగోపాల్‌తో చిలక జోస్యం చెప్పించిన చంద్రబాబు
- ఆ జోస్యం వికటించడంతో మాయమైన లగడపాటి.. ఈ ఎన్నికల తర్వాత పీకే కూడా మాయమవడం ఖాయం
- రాజకీయంగా కలిసిరాక దిక్కుతోచని స్థితి
- దాంతో ఇం'ధనం' కోసం ఎవరికి నచ్చినట్లుగా వారికి చిలక జోస్యం
- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లలో వికటించిన జోస్యం

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో జనసేన–బీజేపీతో జట్టు కట్టినా.. కాంగ్రెస్‌తో కలిసి కుట్రలు చేస్తున్నా వైఎస్సార్‌సీపీ ప్రభంజనంలో కొట్టుకుపోవడం ఖాయమని.. గత ఎన్నికల కంటే ఘోర పరాజయం తప్పదని గ్రహించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఉనికి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. గత ఎన్నికల్లో లగడపాటి రాజగోపాల్‌తో ఎప్పటికప్పుడు టీడీపీ గెలుస్తుందంటూ చిలక జోస్యం చెప్పించిన చంద్రబాబు.. ఇప్పుడు అదే రీతిలో ప్రశాంత్ కిశోర్(పీకే)తో టీడీపీకి అనుకూలంగా జోస్యం చెప్పిస్తున్నారు. నెల క్రితం వల్లె వేసిన మాటలనే ఆదివారం పీటీఐ ప్రతినిధుల భేటీలో మరోమారు చెప్పించారు. అటు దేశంలో.. ఇటు రాష్ట్రంలో విస్తృత యాంత్రాంగం ఉన్న టైమ్స్‌నౌ–ఈటీజీ, జీన్యూస్ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన డజనుకుపైగా సర్వేల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధిస్తుందని స్పష్టమైంది. కానీ.. ఏ యంత్రాంగం లేని ప్రశాంత్ కిశోర్ – ప్యాకేజీ కోసం చంద్రబాబు చెప్పే మాటలనే జోస్యంగా వెల్లడిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యాక లగడపాటిలానే ప్రశాంత్ కిశోర్ కూడా మాయం కావడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.



ప్రశాంత్ కిశోర్ జోస్యాలన్నీ తప్పే

పశ్చిమబెంగాల్ ఎన్నికల తర్వాత ఎన్నికల వ్యూహకర్తగా పని చేయబోనని భీషణ ప్రతిజ్ఞ చేసి.. ఐప్యాక్ నుంచి తప్పుకుని.. బీహార్‌లో రాజకీయ అరంగేట్రం చేశారు. తొలుత బీహార్ సీఎం నితీష్‌కుమార్ పంచన చేరి, జేడీ(యూ) నేతగా చలామణి అయ్యారు. ఆ తర్వాత నితీశ్‌తో విభేదించి.. సొంత కుంపటి పెట్టుకుని బీహార్‌లో పాదయాత్ర చేశారు. అయినప్పటికీ బీహార్‌లో ఎలాంటి ప్రభావం చూపలేకపోయారు. అంటే.. అక్కడ చెల్లని కాసుగా ముద్రపడ్డారు. ఇదే సమయంలో ఇక్కడ స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేయడంతో భయపడి ఢిల్లీలో తలదాచుకున్న లోకేష్.. రాజకీయంగా బీహార్‌లో గిట్టుబాటుకాని ప్రశాంత్ కిశోర్‌ను కలిశారు. తమకు ఎన్నికల వ్యూహకర్తగా పని చేయాలని కోరారు. ఆ క్రమంలోనే చంద్రబాబు బెయిల్‌పై విడుదలయ్యాక.. ప్రశాంత్ కిశోర్‌ను సీఎం రమేష్ స్పెషల్ ఫ్లైట్‌లో లోకేష్ విజయవాడకు తీసుకొచ్చారు. ఆ తర్వాత ఉండవల్లిలోని తమ అక్రమ నివాసంలో చంద్రబాబు ఎదుట కూర్చొబెట్టారు. అప్పుడు మాత్రం తాను ఏ పార్టీకి వ్యూహకర్తగా పని చేయనని ప్రశాంత్ కిశోర్ చెప్పారు. ఈ క్రమంలోనే గతేడాది ఆఖర్లో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరాం రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ జోస్యాలన్నీ తప్పాయి. తెలంగాణలో బీఆర్ఎస్ గెలుస్తుందని ప్రశాంత్ కిశోర్ కుండబద్దలు కొడితే.. అక్కడ కాంగ్రెస్ గెలిచింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్ గెలుస్తుందని చెబితే.. ఆ మూడు రాష్ట్రాల్లోనూ బీజేపీ గెలిచింది.

డబ్బుల కోసమే ఆ మాటలు..

ఐప్యాక్ నుంచి తప్పుకున్న ప్రశాంత్ కిశోర్.. డబ్బుల కోసమే చంద్రబాబు చెప్పిన మాటలను తన జోస్యంగా వల్లె వేస్తున్నారని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఎలాంటి యంత్రాంగం, వ్యవస్థ లేని ప్రశాంత్ కిశోర్.. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిస్థితులను ఎలా అంచనా వేయగలుగుతారని ప్రశ్నిస్తున్నారు. గత 58 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో రాష్ట్రాన్ని సీఎం జగన్ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారు. అందుకే సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత రోజురోజుకూ పెరుగుతోంది. ఇది సిద్ధం సభల్లో.. బస్సు యాత్రలో ప్రస్ఫుటితమవుతోంది. చెప్పిన మాటపై నిలబడని చంద్రబాబు మోసం చేస్తాడనే భావన ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ప్రజాగళం పేరుతో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నిర్వహించిన సభకు.. చంద్రబాబు నిర్వహిస్తున్న సభలకు జనం మొహం చాటేయడమే అందుకు నిదర్శనం. కూటమికి ఘోర పరాజయం తప్పదన్నది కళ్ల ముందే కన్పిస్తుండటంతో ఉనికి చాటుకోవడానికి ప్రశాంత్ కిశోర్‌తో పదే పదే తన మాటలను జోస్యంగా చంద్రబాబు చెప్పిస్తున్నారనే భావన ప్రజల్లో బలంగా వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా...

15లోగా 'బీజేపీ సమ్మేళనాలు' ముగించాలి



సాక్షి, హైదరాబాద్ : ఈ నెల 15వ తేదీలోగా ఎంపీ నియోజకవర్గాల్లో పార్టీ సమ్మేళనాలు ముగించాలని బీజేపీ నిర్ణయించింది. బుధవారం మెదక్, హైదరాబాద్ ఎంపీ సెగ్మెంట్ల పరిధిలో ఇవి జరగనున్నాయి. 11న భువనగిరి, 12న వరంగల్, మహబూబ్‌నగర్, 13న సికింద్రాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, ఖమ్మం, 14న పెద్దపల్లి, జహీరాబాద్, 15న నిజామాబాద్‌లలో సమ్మేళనాలు ఉంటాయని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక ఎంపీ సీట్లలో గెలుపే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక అమలుకు ఈ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశాల్లో పోలింగ్‌బూత్‌ల కోఆర్డినేటర్లు, బూత్ అధ్యక్షుడు, కార్యదర్శి ఆ పైస్థాయి నాయకులు పాల్గొంటారన్నారు. ఈ సమ్మేళనాలకు జాతీయ, రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలు హాజరై పార్టీనాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారని చెప్పారు.

అన్నదాతలను నిలువునా ముంచిన కాంగ్రెస్

ప్రభుత్వానికి ముందుచూపు లేకనే పంటలు ఎండిపోతున్నాయి: ఏలేటి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేకనే పంటలు ఎండిపోతున్నాయని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు. గత అసెంబ్లీ ఎన్నికల వేళ ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయకుండా అన్నదాతలను నిండా ముంచిందని విమర్శించారు. చేతికొచ్చిన పంట కళ్లముందు ఎండిపోతుందనే ఆవేదనతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. సోమవారం పార్టీ అధికార ప్రతినిధి ఎన్వీసుభాష్‌తో కలిసి మహేశ్వర్ రెడ్డి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రూ 15వేలు రైతు భరోసా ఇస్తామంటూ చెప్పిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. కాంగ్రెస్ సర్కారు రైతులకు రుణమాఫీ ఎలా ఎగ్గొట్టాలనే ఆలోచనలో ఉందని ఆరోపించారు. గత ప్రభుత్వం రూ.7 వేల కోట్లను రైతుబంధు కోసం కేటాయించి రైతుల అకౌంట్లలో జమ చేస్తుండగా.. ఎన్నికల కోడ్‌తో ఆగిపోయాయని, ఆ రూ.7 వేల కోట్లు ఎటుపోయాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఖమ్మం జిల్లాలో ఫోన్ ట్యాపింగ్ కలకలం

నేలకొండపల్లి మండలం గెస్ట్‌హౌస్‌ను పరిశీలించిన ఎస్‌ఐబీ?

నేలకొండపల్లి: రాష్ట్రంలో సంచలనం కలిగించిన ఫోన్ ట్యాపింగ్ ఆనవాళ్లు ఖమ్మం జిల్లాలోనూ ఉన్నట్లు జరుగుతున్న ప్రచారం కలకలం సృష్టిస్తోంది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువుమాదారం సమీపంలో ఓ మామిడి తోటలోని గెస్ట్ హౌజ్‌ను ఎస్‌ఐబీ అధికారులు సోమవారం పరిశీలించారని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణ వేగంగా సాగుతుండగా, అధికారులు ఇక్కడ విచారించారని చెబుతున్నారు. ఇక్కడి మామిడి తోటలోని గెస్ట్‌హౌజ్ కేంద్రంగా పాలేరు నియోజకవర్గంలోని పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంట్రాక్టర్ల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ అంశాన్ని పోలీసు అధికారులెవరూ ధ్రువీకరించడం లేదు.

పూలే ఉత్సవాల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా శ్రీశైలం

ఘనంగా పూలే 198వ జయంతి: జాజుల



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): బీసీల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే 198వ జయంత్యుత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా బీసీ కులసంఘాలు, కళాకారులతో కలసి ఘనంగా నిర్వహిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఉత్సవాల నిర్వహణ కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బీసీ కుల సంఘాల జేఏసీ కోచైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్‌ను ప్రకటించారు. అనంతరం జాజుల మాట్లాడుతూ ఏటా పూలే ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహించేదని, పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వ పెద్దలు కాకుండా ఈసారి అధికారులు మాత్రమే నిర్వహిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదెకరాల్లో పూలే స్మృతి వనం ఏర్పాటు చేసి 200 అడుగుల పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ సీఎం కేసీఆర్ ఏనాడూ పూలే చిత్రపటానికి దండ కూడా వేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోకి రాగానే ప్రగతి భవన్‌కు పూలే పేరును పెట్టడాన్ని స్వాగతిస్తున్నామని జాజుల అన్నారు. సమావేశంలో బీసీ రాష్ట్ర నాయకులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఓరుగల్లులో కారెక్కేది ఎవరు?

రోజుకో పేరు తెరమీదకు!
- వరంగల్ అభ్యర్థి వేటలో బీఆర్ఎస్
- రాజయ్య రాకపై కొనసాగుతున్న సస్పెన్స్
- నలుగురి పేర్లను కేసీఆర్‌కు సూచించిన ఆ జిల్లా నేతలు



సాక్షి, హైదరాబాద్: వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిపై రోజుకో పేరు తెరమీదకు వస్తోంది. పార్టీ ఖరారు చేసిన అభ్యర్థి కడియం కావ్య బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగుతుండటంతో దీటైన అభ్యర్థి కోసం అన్వేషణ కొనసా.. గుతోంది. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీని వీడిన నేపథ్యంలో బలమైన అభ్యర్థిని ఎంపిక చేస్తేనే గెలిచే అవకాశముందని బీఆర్ఎస్ నేతలు అధినేత కేసీఆర్‌కు ఇప్పటికే తమ అభిప్రాయం వినిపించారు. మాదిగ సామాజికవర్గం అభ్యర్థినే బరిలోకి దింపాలని వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు కోరుతున్నారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్తగా పనిచేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఇటీవల సెగ్మెంట్ పరిధిలోని కీలక నేతలతో భేటీ జరిపి అభిప్రాయాలు సేకరించారు. ఈ నేపథ్యంలో మాదిగ సామాజికవర్గానికి చెందిన పలువురి పేర్లపై పార్టీ అధినేత కేసీఆర్ వివిధ కోణాల్లో మదింపు చేస్తున్నారు. ఆది, సోమవారాల్లో ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో పార్టీ అధినేత కేసీఆర్‌తో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, హరీశ్‌రావు పార్టీ జరిపిన భేటీలో వరంగల్ అభ్యర్థి ఎంపిక అంశమే ప్రధానంగా చర్చకు వచ్చినట్లు సమాచారం.

మాదిగ సామాజికవర్గానికే మొగ్గు!

మాదిగ సామాజికవర్గానికి చెందిన అభ్యర్థినే ఎంపిక చేయాలని పార్టీ నిర్ణయించిన నేపథ్యంలో పలువురు పేర్లను కేసీఆర్ పరిశీలిస్తున్నారు. కాకతీయ యూనివర్సిటీలో అసిస్టెంట్‌గా ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పుల్లా శ్రీనివాస్‌తో పాటు హన్మకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్ పేర్లు తాజాగా తెరమీదకు వచ్చాయి. పుల్లా శ్రీనివాస్ అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాల్సిందిగా నాగర్‌కర్నూలు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వరంగల్ జిల్లాకు చెందిన పలువురు నేతలను కోరినట్లు సమాచారం.

రాజయ్య వచ్చినా.. అసెంబ్లీకి పంపాలనే నిర్ణయం?

ఇదిలా ఉంటే మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య బీఆర్ఎస్‌లో తిరిగి చేరేందుకు సుముఖంగా ఉన్నా ఆయనకు కేవలం స్టేషన్ ఘన్‌పూర్ పార్టీ ఇన్‌చార్జి పదవి ఇచ్చేందుకే కేసీఆర్ మొగ్గు చూపుతున్నారని తెలుస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత వేటు పడితే జరిగే ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా అవకాశం ఇస్తామని పార్టీ ప్రతిపాదించింది. అయితే తనకు సుమారు 30 ఏళ్లుగా రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న కడియం శ్రీహరి కుమార్తె కావ్యపై ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని రాజయ్య కోరుతున్నారు. వరుసగా నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన తనకు ఎంపీ టికెట్ ఇవ్వాలనే షరతును రాజయ్య విధిస్తున్నట్లు తెలిసింది. మొత్తంమీద వరంగల్ ఎంపీ అభ్యర్థిపై ఒకటి రెండు రోజుల్లో కసరత్తు పూర్తి చేసి అధికార ప్రకటన చేసే అవకాశముందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

నాలుగు పేర్లు కేసీఆర్‌కు సిఫార్సు

వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని ఐదుగురు మాజీ ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మరికొందరు బీఆర్ఎస్ కీలక నేతలు సోమవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నివాసంలో సమావేశమయ్యారు. ఈ భేటీలో లోకసభ అభ్యర్థి ఎవరు ఉంటే బాగుంటుందనే అంశంపై చర్చించారు. మాదిగ సామాజిక వర్గం నుంచి ముగ్గురు, మాల సామాజిక వర్గం నుంచి ఒకరి పేర్లను కేసీఆర్‌కు సిఫారసు చేశారు. మాదిగ సామాజిక వర్గం నుంచి మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్, కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ పుల్ల శ్రీనివాస్ పేర్లు ఉన్నాయి. ఒకవేళ మాల సామాజిక వర్గం నుంచి కూడా పేరును పరిశీలిస్తే నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి స్వప్న పేరును పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా పార్టీ నేతలు కోరారు.

ప్రెస్‌క్లబ్‌కు అద్భుతమైన భవనం నిర్మిస్తాం

రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రెస్‌క్లబ్‌కు అన్ని హంగులతో అద్భుత భవనం నిర్మించి ఇస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ నూతన భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వానికి జర్నలిస్టులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, తాము ఈ ఏడాది చివరి నాటికే కొత్త భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని చెప్పారు. రూ.20 కోట్లు ఖర్చు అయినా సరే.. పాత్రికేయులకు అన్ని హంగులతో కూడిన భవనం నిర్మించి ఇస్తామని వెల్లడించారు. ప్రజల పక్షాన పనిచేసే జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం ప్రెస్‌క్లబ్‌లో మహిళల సౌకర్యం కోసం నిర్మిస్తున్న భవనానికి తన స్వచ్ఛంద సంస్థ అయిన ప్రతీక్ ఫౌండేషన్ నుంచి రూ. 5 లక్షల నగదు సహాయం అందిస్తానని మంత్రి వెల్లడించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణం గురించి జర్నలిస్టులు మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన క్లబ్ కార్యవర్గంతో చర్చించి ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ముఖ్యమంత్రితో సమావేశం నిర్వహించి జీ +4 గా ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి కావాల్సిన బడ్జెట్ మంజూరు చేసి భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నిజాముద్దీన్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాలనాయుడు, రవికాంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌రావు, వనజ, జాయింట్ సెక్రెటరీ హరిప్రసాద్, కోశాధికారి రాజేష్, ఈసీ మెంబర్లు శ్రీనివాస్, వసంత్‌కుమార్, బి.గోపరాజు, సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్, యూసుఫ్‌బాబు, ఆజంఖాన్ తదితరులు హాజరయ్యారు. ముస్లిం మతగురువు సయ్యద్‌షా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నేతన్నలను వంచించింది మీరు కాదా?

- వస్త్ర పరిశ్రమకు రూ.558 కోట్ల బకాయిలు ఎవరు పెట్టారు?
- బీఆర్ఎస్, బీజేపీలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్



సిరిసిల్ల: రాష్ట్రంలో, కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీలు సిరిసిల్లలో శవ రాజకీయాలు చేస్తున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేత కె.కె.మహేందర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం వస్త్రపరిశ్రమను, నేతన్నలను ఆదుకోకుండా.. తాత్కాలిక ఆర్డర్లతో కాలం వెల్లదీసిందని, వస్త్ర పరిశ్రమకు రూ.558 కోట్లు బకాయిలు పెట్టిందని తెలిపారు. వస్త్రోత్పత్తి ఆర్డర్లను గతేడాది ఫిబ్రవరిలో ఇచ్చి అక్టోబర్‌లో వస్త్రాన్ని కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా బకాయి పెట్టిన బీఆర్ఎస్ నేతలే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందిస్తున్నారని ప్రభాకర్ పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రిగా, సీఎం తనయుడిగా సిరిసిల్ల వస్త్రపరిశ్రమను కేటీఆర్ సంక్షోభంలో ముంచాడని అన్నారు. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వస్త్రంపై 12 శాతం జీఎస్టీని విధించిందని, టెక్స్‌టైల్ బోర్డును రద్దు చేసిందని ఆరోపించారు. తమిళనాడుకు వేలకోట్ల పథకాలు తరలిపోతుంటే.. ఒక్క పైసా తేలేని స్థానిక ఎంపీ నేతన్నల కోసం 10వ తేదీన దీక్షలు చేస్తారట అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4 నెలలే అయింది.. నాలుగు నెలల్లోనే అన్నీ అయిపోతాయా? అని పొన్నం ప్రశ్నించారు. అన్ని సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. అనంతరం సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులతో వస్త్రవ్యాపార సంఘ భవనంలో పొన్నం ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

వెంకట్రామిరెడ్డిపై మనీలాండరింగ్ కేసు పెట్టాలి

బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థిపై ఈడీకి బీజేపీ అభ్యర్థి రఘునందన్ ఫిర్యాదు
- ఎంపీగా పోటీచేయకుండా అనర్హత వేటు, ఎమ్మెల్సీగా కూడా అనర్హుడిగా ప్రకటించాలి
- మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లపైనా ఈడీ కేసు పెట్టాలి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిపై మనీలాండరింగ్ కింద కేసు నమోదు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు కోరారు. మనీలాండరింగ్ వంటి తీవ్రమైన కేసులో ప్రమేయమున్న వెంకట్రామిరెడ్డిపై వెంటనే చర్యలు తీసుకొని లోక్‌సభకు పోటీచేయకుండా అనర్హుడిగాప్రకటించడంతో ఎమ్మెల్సీగానూ అనర్హత వేటు వేయాలని ఈడీకి విన్నవించారు. ఈ వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్, ఇతర మాజీ మంత్రులు, ప్రభుత్వఅధికారులపై ఈడీ కేసులు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో ఈడీ జాయింట్ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు ఇచ్చిన నేరాంగీకార ప్రకటనలో రాజపుష్ప అధినేత నుంచి కోట్లాది రూపాయలు ఎన్నికలకు వినియోగించినట్టు వెల్లడైందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు జిల్లా కలెక్టర్‌గా ఉన్న వెంకట్రామిరెడ్డి బీఆర్ఎస్‌కు అక్రమంగా ఎన్నికల నిధులు సమకూర్చినట్టు, పోలీసులు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తన అధికార హోదాను ఉపయోగించి కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించారని ఆరోపించారు. దీని ఆధారంగా వెంకట్రామిరెడ్డిపై ఈడీ దర్యాప్తు చేయాలని కోరామన్నారు. కాగా, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి వెంకట్రామిరెడ్డి ఉద్యోగులతో భేటీపై చర్యలు తీసుకోని సిద్దిపేట పోలీస్ కమిషనర్, కలెక్టర్, ఏఆర్వోలపై చర్య తీసుకోవాలని ఎన్నికల ప్రధానాధికారికి రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు. సోమవారం బీఆర్‌కే భవన్‌లో సీఈఓకు ఫిర్యాదు చేశాక మీడియాతో మాట్లాడారు.

వెంకట్రామిరెడ్డిపై కేసు నమోదు

సిద్దిపేటఅర్బన్: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులతో సమావేశం నిర్వహించిన ఘటనపై బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిపై సిద్దిపేట త్రీటౌన్ పీఎస్‌లో కేసు నమోదైంది. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ ఎంపీగా పోటీ చేస్తున్న వెంకట్రామిరెడ్డి సిద్దిపేటలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులను ప్రలోభ పెట్టడానికి భోజనాల పేరుతో సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ పృథ్వీరాజ్ అక్కడకు చేరుకోగా, ప్రభుత్వ ఉద్యోగులు తమ వాహనాలు వదిలి గోడదూకి పారిపోయారు. అక్కడి సీసీ కెమెరాల పుటేజీ పరిశీలించిన ఎన్నికల అధికారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎంపీ అభ్యర్థితోపాటు సుడా మాజీ చైర్మన్ తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. 13 బైక్‌లు, మూడు కార్లు, వంట సామగ్రిని సీజ్ చేశారు.

మళ్లీ అధికారంలోకి వచ్చేది మేమే

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, సిద్దిపేట/సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఎన్ని రోజులు ఉంటుందో తెలియదని, ఆపార్టీ ఏ రాష్ట్రంలోనూ ఐదు సంవత్సరాలకు మించి అధికారంలో ఉండటం చాలా తక్కువని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో సెల్ఫ్ గోల్‌తో ఐదేళ్ల కంటే ముందే అధికారం కోల్పోయిందని, ఇక్కడ మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనని ఆయన స్పష్టం చేశారు. సోమవారం సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్, యువజన, విద్యార్థి నాయకులతో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం లీకులు.. ఫేక్‌లతో పాటు కేసులు పెడుతూ ప్రజలను తికమక పెడుతోందని ఆరోపించారు. ఉద్దెర మాటలు మాట్లాడుతుందే తప్ప.. ఉద్ధరించే పనులు చేయడం లేదన్నారు. కొత్త జిల్లాలను రద్దు చేస్తామని అంటున్న కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలన్నారు. సిద్దిపేట వెటర్నరీ కళాశాలను రద్దు చేసి కొడంగల్‌కు తీసుకువెళ్లి, ఇక్కడి ప్రజలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓట్ల ద్వారా గుణపాఠం చెప్పాలన్నారు.

పొద్దు తిరుగుడును పూర్తిగా కొనుగోలు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం పొద్దుతిరుగుడు పంటను కనీస మద్దతు ధరతో పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు కనీస మద్దతు ధరకంటే తక్కువకు పంటను అమ్ముకుని నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన సోమవారం లేఖ రాశారు.

రేవంత్ ఇంటి దగ్గర్లోనూ ఓ వార్‌రూమ్!

▶ మొదటి పేజీ తరువాయి

'ఓటుకు కోట్లు'వ్యవహారం, 2022లో చోటు చేసుకున్న 'ఎమ్మెల్యేలకు ఎర'అంశం వెలుగులోకి వచ్చాయి. ప్రభాకర్‌రావు ఎస్ఐబీ చీఫ్‌గా మారిన తర్వాత ట్యాపింగ్ దుర్వినియోగం కావడం మొదలైంది. తొలినాళ్లలో ఈ విభాగం నిబంధనల ప్రకారమే అవసరమైన ఫోన్‌నంబర్లను లీగల్ ఇంటర్‌సెప్షన్‌గా (ఎల్ఐ) పిలిచే చట్టబద్ధమైన విధానం ద్వారానే ట్యాప్ చేసింది. అయితే 2018 ఎన్నికల నుంచి వీరి ట్యాపింగ్ పంథా మారిపోయింది. దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల నేపథ్యంలో ఫోన్లతోపాటు సోషల్‌మీడియాను ట్యాప్ చేయాలని భావించారు. ప్రణీత్‌రావు, తిరుపతన్న, వేణుగోపాల్‌రావు తదితరులను ఎస్ఐబీలోకి తీసుకున్న తర్వాత, భుజంగరావు పొలిటికల్ ఇంటెలిజెన్స్ బాధ్యతలు చేపట్టడంతో ప్రభాకర్‌రావు ట్యాపింగ్‌ను కొత్త పుంతలు తొక్కించారు. దీని కోసం విదేశాల నుంచి ఉపకరణాలు, సాఫ్ట్‌వేర్స్ అక్రమంగా దిగుమతి అయ్యాయి. టెక్నాలజీ కన్సల్టెంట్ రవిపాల్ అలియాస్ పాల్ రవికుమార్ సహకారంతో ఇజ్రాయెల్ నుంచి సాఫ్ట్‌వేర్స్, ఎంసీ క్యాచర్స్ సమీకరించుకున్నారు. సూట్‌కేస్‌లో ఇమిడిపోయి ఉండే ఈ ట్యాపింగ్ పరికరం మ్యాన్ ఇన్ ది మిడిల్ (ఎంఐటీఎం) ఎటాక్స్‌కు వినియోగించారు. దీన్ని ప్రణీత్‌రావు టీమ్ ఓ వాహనంలో పెట్టుకొని టార్గెట్ చేసిన వ్యక్తి ఇల్లు, కార్యాలయ సమీపంలో మాటు వేసేది. ఈ పరికరానికి ఓ కృత్రిమ సెల్‌ఫోన్ టవర్‌గా మారిపోయి 300 మీటర్ల పరిధిలో పనిచేస్తున్న ప్రతి ఫోన్ ద్వారా జరిగే కమ్యూనికేషన్ తెలుసుకునే సామర్థ్యం ఉంది. వాటిలో తమకు కావాల్సిన దాన్ని ఎంచుకొని, దానికి సంబంధించిన సోషల్‌మీడియా సహా ప్రతి కమ్యూనికేషన్‌ను ట్యాప్ చేసే అవకాశం దానిని ఆపరేట్ చేసే వ్యక్తికి ఉంటుంది. ఇలాంటి ఓ ఉపకరణాన్నే ప్రణీత్‌రావు బృందం రేవంత్ ఇంటికి సమీపంలో తీసుకున్న గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసింది. అక్కడ నుంచే రేవంత్ తోపాటు ఆయన కుటుంబీకులు, ప్రధాన అనుచరుల ఫోన్లపై నిఘా ఉంచింది. రాధాకిషన్‌రావు, భుజంగరావులు ఇదే గెస్ట్‌హౌస్ కేంద్రంగా కొన్ని సెటిల్‌మెంట్లు కూడా చేశారని తెలుస్తోంది. ఈ వ్యవహారాలను ప్రభాకర్‌రావు నేరుగా పర్యవేక్షించి భారీ వసూళ్లకు తెర లేపినట్టు పోలీసులు గుర్తించారు.

మూడంచెల వ్యూహం

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే పార్టీ ఇన్‌చార్జిలుగా ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ద్వితీయ శ్రేణి కేడర్‌కు సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తున్నారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

8 చోట్ల మెజారిటీపై దృష్టి

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చాలాచోట్ల 20 వేల కంటే ఎక్కువ మెజార్టీ సాధించింది. 20–50 వేల మధ్య మెజార్టీ సాధించిన స్థానాలు 40 వరకు ఉన్నాయి. ఇందులో పార్లమెంటు స్థానాల వారీగా పరిగణనలోకి తీసుకుంటే కనీసం 8 చోట్ల కాస్త కష్టపడితే విజయం ఖాయమని కాంగ్రెస్ పార్టీ అంచనా వేస్తోంది. ఇందులో నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, మహబూబాబాద్, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, వరంగల్, జహీరాబాద్ నియోజకవర్గాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా స్థానాల్లో సాధ్యమైనంత మెజార్టీ సాధన దిశగా వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యూహంలో భాగంగా ఆయా జిల్లాల పరిధిలోని మంత్రులు, లోక్‌సభ ఇన్‌చార్జులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొనేలా చూసుకోవాలని, అలాగే పోలింగ్ రోజున అప్రమత్తంగా ఉంటే సరిపోతుందని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు తెలిసింది.

ఆరుచోట్ల జాగ్రత్తగా..

కాంగ్రెస్ పార్టీ అంతర్గత లెక్కల ప్రకారం బీ కేటగిరీలో ఆరు స్థానాలున్నాయని తెలుస్తోంది. ఆదిలాబాద్, నిజామాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్, మహబూబ్‌నగర్ స్థానాల్లో గెలుపు కష్టమైనా.. అందుకోసం గట్టిగా కృషి చేయాలని అంచనా వేస్తున్నట్లు సమాచారం. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం తాను ప్రాతినిధ్యం వహిస్తున్నది కావడంతో ఈ నియోజకవర్గాన్ని సీఎం రేవంత్ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక్కడ కాంగ్రెస్ మాజీ నేత, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె.అరుణ పోటీ చేస్తున్న నేపథ్యంలో ఎలాగైనా కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించడం ద్వారా ఉమ్మడి పాలమూరు రాజకీయాల్లో ఆధిపత్యం చాటాలని ఆయన పట్టుదలతో ఉన్నట్టు చెబుతున్నారు. ఇక నిజామాబాద్‌లో జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్‌లో ఆత్రం సుగుణ అభ్యర్థిత్వాలు కలిసి వస్తాయని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వీరిద్దరికీ ఉన్న మంచి పేరుకు తోడు పార్టీ అభ్యర్థిత్వాలు కలిసి రేసులో ప్రతిపక్షాల కంటే ముందే ఉంటామనే ధీమాతో అధికార పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాలకు గ్రేటర్ హైదరాబాద్‌తో సంబంధమున్న నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను చూసుకుంటే ఇక్కడ గెలుపు కష్టమేనని, అయితే మారిన రాజకీయ పరిణామాలు, అభ్యర్థుల ఖరారులాంటి అంశాలు విజయానికి బాటలు వేస్తాయని భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ ఆరు స్థానాల్లో ఏ స్థానానికి ఆ స్థానంలో ప్రత్యేక ప్రణాళికలను అమలు చేయనున్నట్లు తెలుస్తోంది.

14 సీట్లు కాంగ్రెస్‌వే

- కొడంగల్ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- నియోజకవర్గంలో పార్టీకి 50 వేల మెజారిటీ రావాలి



కొడంగల్: ఎంపీ ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా 14 స్థానాలను కాంగ్రెస్ సొంతం చేసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొడంగల్ తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా నిలిచిందని చెప్పారు. నియోజకవర్గంలో తనకు 33 వేల ఓట్ల మెజారిటీ వచ్చిందని, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థికి ఈ నియోజకవర్గం నుంచి 50 వేల మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని సూచించారు. సోమవారం కొడంగల్‌లోని తన నివాసంలో పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. ప్రతి మండలంలో పోలింగ్ బూత్‌ల వారీగా పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సీఎం సొంత జిల్లా అయిన పాలమూరులో కాంగ్రెస్‌ను ఓడిస్తే రేవంత్ ప్రాబల్యం తగ్గుతుందని బీజేపీ, బీఆర్ఎస్ భావిస్తున్నాయని రేవంత్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి ఈ ప్రాంత గౌరవాన్ని మరింత పెంచాలని కోరారు. కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ప్రజలు అన్ని విషయాలను గమనించి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో ఎంపీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి, కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కాన్వాయ్‌లో పేలిన వాహనం టైర్

పూడూరు: సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌కి త్రుటిలో ప్రమాదం తప్పింది. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొనేందుకు సీఎం హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరారు. మన్నెగూడ సమీపంలోకి రాగానే.. కాన్వాయ్‌లోని ఓ వాహనం ముందు టైర్ ఒక్కసారిగా పేలింది. అప్రమత్తమైన డ్రైవర్ చాకచక్యంగా వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపాడు. టైర్ మార్చిన అనంతరం వాహనం కొడంగల్‌కు బయలుదేరింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

బస్సు యాత్రతో 'కారు' ప్రచారం

▶ మొదటి పేజీ తరువాయి

దోహద పడుతుందని భావిస్తున్నారు. వేసవి తీవ్రతలో జన సమీకరణ కష్టతరమవుతుందనే ఉద్దేశంతో బస్సు యాత్ర చేస్తేనే మంచిదనే అభిప్రాయానికి ఇప్పటికే కేసీఆర్ వచ్చినట్లు తెలుస్తోంది.

మెదక్ లేదా ఆదిలాబాద్ నుంచి ప్రారంభం!

ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వైఎస్ జగన్ చేస్తున్న బస్సు యాత్ర తీరుతెన్నులను పరిశీలించిన కేసీఆర్ ఇక్కడ కూడా అదే రీతిలో ప్రచారం చేయాలనే ఉద్దేశంతో ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బస్సు యాత్ర ద్వారా సుమారు వంద అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో మినీ మీటింగులు లక్ష్యంగా, వీలైనన్ని మండలాలను కవర్ చేసేలా ప్రచారానికి రూట్ మ్యాప్, షెడ్యూలుపై కసరత్తు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఈ నెల 15 తర్వాత మెదక్ లేదా ఆదిలాబాద్ నుంచి యాత్ర ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

ప్రతికూలాంశాలపైనా చర్చ


నాలుగు నెలల క్రితం ప్రమాదానికి గురైన కేసీఆర్ ఇంకా ఊతకర్ర సాయంతోనే నడుస్తుండటంతో బస్సు యాత్ర ఎంతవరకు సాధ్యమనే చర్చా జరిగినట్టు తెలిసింది. మరోవైపు ఇటీవల ఉమ్మడి వరంగల్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లో కేసీఆర్ చేసిన 'పొలంబాట'సందర్భంగా భద్రతాపరమైన సమస్యలు తలెత్తినట్లు పార్టీ వర్గాలు గుర్తించాయి. పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి తోపులాటకు దిగుతుండటంతో వారిని నియంత్రించడం కష్టతరమవుతోందని సెక్యూరిటీ విభాగం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఈ అంశాన్ని కూడా పరిశీలించినట్లు సమాచారం.

13న చేవెళ్లలో బహిరంగ సభ

కేసీఆర్ బస్సు యాత్రకు ముందు, గతంలో నిర్ణయించిన మేరకు ఈ నెల 13న చేవెళ్లలో బహిరంగ సభ నిర్వహించాలని, ఈ సభతోనే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ కేడర్, ముఖ్య నేతలతో జరుగుతున్న సన్నాహక, సమన్వయ భేటీల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు. క్షేత్రస్థాయిలో చేయాల్సిన ప్రచారం, ఎజెండా తదితరాలపై దిశా నిర్దేశం చేస్తున్నారు.

మోదీ హయాంలోనే సురక్షితం

▶ మొదటి పేజీ తరువాయి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సెగ్మెంట్ కన్వీనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశం సురక్షితంగా, సుభిక్షంగా ఉండాలంటనే మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. పదేళ్ల క్రితం అనేక వస్తువులను మనం దిగుమతి చేసుకునే వారమని, ప్రస్తుతం మనమే ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామని వివరించారు. కాంగ్రెస్ హయాంలో పదిహేను రోజులకో కుంభకోణం జరిగి రూ.వందల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. బీజేపీ పాలనలో ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాలేదని స్పష్టంచేశారు. ఆర్టికల్ 370 రద్దు చేస్తామని చెప్పిన మోదీ చేసి చూపించారన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం ఆయనతోనే సాధ్యమైందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జిన్నా రాజ్యాంగమే వస్తుందని విమర్శించారు.

రుణమాఫీకి రేవంత్ డబ్బులెక్కడి నుంచి తెస్తారో?

డిసెంబర్‌లో రుణమాఫీ చేస్తామని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి అందుకు నిధులు ఎక్కడి నుంచి తెస్తారో చెప్పాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఉచితంగా బస్సుల్లో తిప్పితే అన్నీ ఇచ్చినట్లు అనుకోవద్దని ప్రజలకు సూచించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని ఆయన జోస్యం చెప్పారు. చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాశ్, సనివెల్లి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ఆయా నియోజకవర్గాల బూత్ లెవల్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్



జాతీయ హాకీ శిబిరానికి జ్యోతి రెడ్డి

మహిళల ప్రొ హాకీ లీగ్ సన్నాహాల కోసం 33 మందితో కూడిన ప్రాబబుల్స్‌ను హాకీ ఇండియా ప్రకటించింది. వీరందరికీ మే 16వ తేదీ వరకు బెంగళూరులోని భారత స్పోర్ట్స్ అథారిటీ కేంద్రంలో శిక్షణ శిబిరం నిర్వహిస్తారు. ఈ ప్రాబబుల్స్‌లో హైదరాబాద్‌కు చెందిన ఈదుల జ్యోతి రెడ్డికి స్థానం లభించింది. గత ఏడాది జరిగిన జూనియర్ ప్రపంచకప్ టోర్నీలో జ్యోతి రెడ్డి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ప్రొ హాకీ లీగ్ మే 22 నుంచి బెల్జియం, బ్రిటన్‌లలో జరుగుతుంది.

హ్యారీ బ్రూక్ స్థానంలో లిజాడ్

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ స్థానాన్ని దక్షిణాఫ్రికా సీమర్ లిజాడ్ విలియమ్స్‌తో భర్తీ చేసుకుంది. గత డిసెంబర్‌లో జరిగిన మినీ వేలంలో ఢిల్లీ ఫ్రాంచైజీ రూ. 4 కోట్లకు బ్రూక్‌ను కొనుగోలు చేసింది. అయితే ఫిబ్రవరిలో బ్రూక్ నానమ్మ చనిపోవడంతో ఈ సీజన్‌లో ఆడేందుకు బ్రూక్ రాలేదు. దీంతో అతని స్థానంలో 30 ఏళ్ల లిజాడ్‌ను కనీస ధర రూ.50 లక్షలకు తీసుకుంది. లిజాడ్ దక్షిణాఫ్రికా తరఫున 2 టెస్టులు, 4 వన్డేలు, 11 టి20లు ఆడాడు.





హంపి పరాజయం

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో భారత నంబర్‌వన్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపికి తొలి పరాజయం ఎదురైంది. నాలుగో రౌండ్‌లో బల్గేరియా గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ 36వ ర్యాంకర్ నుర్గుల్ సలీమోవా 62 ఎత్తుల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ హంపిపై సంచలన విజయం సాధించింది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి ఈ టోర్నీలో రెండో 'డ్రా' నమోదు చేసుకుంది. ప్రపంచ మూడో ర్యాంకర్ అలెగ్జాండ్రా గొర్యాచ్‌కినా (రష్యా)తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌ను వైశాలి 40 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. ఓపెన్ విభాగం నాలుగో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్స్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. విదిత్ సంతోష్ గుజరాతి 44 ఎత్తుల్లో నిపోమ్నియాషి (రష్యా) చేతిలో ఓడిపోయాడు. నకమురా (అమెరికా)తో గేమ్‌ను ప్రజ్ఞానంద 24 ఎత్తుల్లో...ఫాబియానో కరువానా (అమెరికా)తో గేమ్‌ను గుకేశ్ 74 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించారు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో అశ్విని-తనీషా జోడీ



నింగ్బో (చైనా): పారిస్ ఒలింపిక్స్‌కు చివరి అర్హత టోర్నీ అయిన ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నేడు ప్రారంభమవుతుంది. మంగళవారం క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. బుధవారం మెయిన్ 'డ్రా' మ్యాచ్‌లు మొదలవుతాయి. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని-తనీషాలతో తలపడాల్సిన ఫెబ్రియానా-ప్రతివి (ఇండోనేసియా) జోడీ గాయంతో వైదొలిగింది. దాంతో అశ్విని జోడీకి తొలి రౌండ్‌లో 'వాకోవర్' లభించడంతోపాటు ప్రిక్వార్టర్ ఫైనల్లో స్థానం లభించింది. పురుషుల సింగిల్స్‌లో భారత్ నుంచి ప్రణయ్, లక్ష్య సేన్, కిడాంబి శ్రీకాంత్, ప్రియాన్షు...మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, ఆకర్షి కశ్యప్ బరిలో ఉన్నారు.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'
రవీంద్ర జడేజా



రుతురాజ్

చెన్నై చెలరేగింది

- కూల్చేసిన తుషార్, జడేజా
- రాణించిన రుతురాజ్
- 7 వికెట్లతో కోల్‌కతాపై జయభేరి

చెన్నై: ఈ సీజన్‌లో భారీ స్కోర్లతో, హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళ్తున్న కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై చెన్నై సూపర్‌కింగ్స్ చెలరేగింది. సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో చెన్నై ఆల్‌రౌండ్ షో ముందు నైట్‌రైడర్స్ చేతులెత్తేసింది. దీంతో సూపర్‌కింగ్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్‌రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (33 బంతుల్లో 34; 3 ఫోర్లు) టాప్ స్కోరర్! సూపర్‌కింగ్స్ బౌలర్లు రవీంద్ర జడేజా (3/18), తుషార్ దేశ్‌పాండే (3/33), ముస్తఫిజుర్ (2/22) మూకుమ్మడిగా వికెట్లను పడేశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన చెన్నై 17.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసి గెలిచింది. రుతురాజ్ గైక్వాడ్ (58 బంతుల్లో 67 నాటౌట్; 9 ఫోర్లు) రాణించగా, శివమ్ దూబే (18 బంతుల్లో 28; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరిపించాడు.

కోల్‌కతా విలవిల...

నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్ ఆరంభం నుంచి ఆఖరిదాకా కష్టాలతోనే సాగింది. తుషార్ ఇన్నింగ్స్ మొదటి ఓవర్ తొలి బంతికే ఫిల్ సాల్ట్ (0) డకౌటయ్యాడు. ఓపెనర్‌గా చెలరేగిపోతున్న సునీల్ నరైన్ (20 బంతుల్లో 27; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రఘువంశీ (18 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి కాసేపు ధాటిగా ఆడారంతే! పవర్‌ప్లేలో జట్టు 56/1 స్కోరు చేసింది. ఇక్కడిదాకా బాగానే ఉన్నా... జడేజా బౌలింగ్‌కు దిగడంతో కోల్‌కతా కష్టాల పాలైంది. తన తొలి ఓవర్లో (ఇన్నింగ్స్ 7వ) వాళ్లిద్దర్నీ అవుట్ చేసిన జడేజా మరుసటి ఓవర్లో వెంకటేశ్ అయ్యర్ (3)ను పెవిలియన్ చేర్చాడు. 64 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయింది. రమణ్‌దీప్ (13) ఐదో వికెట్‌గా వెనుదిరిగాడు. శ్రేయస్ చేసిన ఆమాత్రం స్కోరుతో కష్టంగా వంద పరుగులు దాటింది. తర్వాత తుషార్ దెబ్బకు కోల్‌కతా కుదేలైంది. హిట్టర్లు రింకూ సింగ్ (9), రసెల్ (10)లను అవుట్ చేయడంతో స్కోరులో జోరుకు ఆస్కారమే లేకపోయింది.

రుతురాజ్ అర్ధసెంచరీ

సులువైన లక్ష్యం కావడంతో హిట్టింగ్ ఓపెనర్ రచిన్ రవీంద్ర (8 బంతుల్లో 15; 3 ఫోర్లు) ఆరంభంలోనే అవుటైనా చెన్నై దూకుడుకు ఢోకా లేకపోయింది. రుతురాజ్, మిచెల్ (19 బంతుల్లో 25; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి ఇన్నింగ్స్‌ను సాఫీగా నడిపించారు. తొలి సగం (10) ఓవర్లలో 81/1 స్కోరు చేసింది. రుతురాజ్ 45 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, మిచెల్‌ను అవుట్ చేయడం ద్వారా నరైన్ ఈ జోడీని విడగొట్టాడు. దీంతో రెండో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. లక్ష్యానికి చేరువలో దూబే బౌల్డవగా లాంఛనాన్ని ధోని (1 నాటౌట్), రుతురాజ్ ముగించారు.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) జడేజా (బి) తుషార్ 0; నరైన్ (సి) తీక్షణ (బి) జడేజా 27; రఘువంశీ (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 24; శ్రేయస్ (సి) జడేజా (బి) ముస్తఫిజుర్ 34; వెంకటేశ్ (సి) మిచెల్ (బి) జడేజా 3; రమణ్‌దీప్ (బి) తీక్షణ 13; రింకూ (బి) తుషార్ 9; రసెల్ (సి) మిచెల్ (బి) తుషార్ 10; అనుకుల్ (నాటౌట్) 3; స్టార్క్ (సి) రవీంద్ర (బి) ముస్తఫిజుర్ 0; వైభవ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 137. వికెట్ల పతనం:** 1-0, 2-56, 3-60, 4-64, 5-85, 6-112, 7-127, 8-135, 9-135. **బౌలింగ్:** తుషార్ 4-0-33-3, ముస్తఫిజుర్ 4-0 -22-2, శార్దుల్ 3-0-27-0, తీక్షణ 4-0-28-1, జడేజా 4-0-18-3, రచిన్ 1-0-4-0. **చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్:** రచిన్ (సి) వరుణ్ (బి) వైభవ్ 15; రుతురాజ్ (నాటౌట్) 67; మిచెల్ (బి) నరైన్ 25; దూబే (బి) వైభవ్ 28; ధోని (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (17.4 ఓవర్లలో 3 వికెట్లకు) 141. వికెట్ల పతనం:** 1-27, 2-97, 3-135. **బౌలింగ్:** స్టార్క్ 3-0-29-0, వైభవ్ 4-0-28-2, అనుకుల్ 1.4-0- 18-0, నరైన్ 4-0-30-1, వరుణ్ చక్రవర్తి 4-0- 26-0, రసెల్ 1-0-8-0.

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ × హైదరాబాద్
వేదిక: ముల్లాన్‌పూర్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	4	4	0	8	1.120
కోల్‌కతా	4	3	1	6	1.528
లక్నో	4	3	1	6	0.775
చెన్నై	5	3	2	6	0.666
హైదరాబాద్	4	2	2	4	0.409
పంజాబ్	4	2	2	4	-0.220
గుజరాత్	5	2	3	4	-0.797
ముంబై	4	1	3	2	-0.704
బెంగళూరు	5	1	4	2	-0.843
ఢిల్లీ	5	1	4	2	-1.370

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్



సుమిత్ సంచలనం

- ప్రపంచ 38వ ర్యాంకర్‌పై విజయం
- మోంటెకార్లో మాస్టర్స్ టోర్నీ

మోంటెకార్లో (మొనాకో): ఈ ఏడాది తన జోరు కొనసాగిస్తూ భారత టెన్నిస్ నంబర్‌వన్ సుమిత్ నగాల్ మరో గొప్ప విజయం సాధించాడు. ప్రతిష్టాత్మక మోంటెకార్లో మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లో అడుగు పెట్టిన ప్రపంచ 93వ ర్యాంకర్ సుమిత్ తొలి రౌండ్‌లో ప్రపంచ 38వ ర్యాంకర్ మాటియో అర్నాల్డిని బోల్తా కొట్టించాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సుమిత్ 5-7, 6-2, 6-4తో అర్నాల్డిపై గెలిచి క్లే కోర్టు మాస్టర్స్ సిరీస్ టోర్నీల్లో రెండో రౌండ్‌కు చేరిన తొలి భారతీయ ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. 2 గంటల 37 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తొలి సెట్‌ను కోల్పోయినా ఆందోళన చెందలేదు. రెండో సెట్‌లో అద్భుతంగా ఆడి అర్నాల్డి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. నిర్ణాయక మూడో సెట్‌లోనూ సుమిత్ తన దూకుడు కొనసాగించి మూడో గేమ్‌లో, ఏడో గేమ్‌లో అర్నాల్డి సర్వీస్‌లను బ్రేక్ చేసి తన సర్వీస్‌లను నిలబెట్టుకొని చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. రెండో రౌండ్‌లో ప్రపంచ ఏడో ర్యాంకర్ హోల్గర్ రూనె (డెన్మార్క్)తో సుమిత్ ఆడతాడు. రెండో రౌండ్‌లోకి ప్రవేశించడం ద్వారా సుమిత్ వచ్చే ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ 80వ స్థానానికి చేరుకోనున్నాడు. ఈ ఏడాది సుమిత్ ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ తొలి రౌండ్‌లో ప్రపంచ 27వ ర్యాంకర్ అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్తాన్)ను ఓడించి రెండో రౌండ్‌కు చేరగా... చెన్నై ఓపెన్ చాలెంజర్ టోర్నీలో విజేతగా నిలిచాడు. దుబాయ్ ఓపెన్ ఏటీపీ-500 టోర్నీ, ఇండియన్ వెల్స్ మాస్టర్స్-1000 టోర్నీ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ఓడిపోయాడు.

రన్నరప్ శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ



కల్యాణి (బెంగాల్): ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు మరో మ్యాచ్ మిగిలి ఉండగానే రన్నరప్ స్థానం ఖరారైంది. ఇంటర్ కాశీ ఎఫ్‌సీ (వారణాసి) జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌ను శ్రీనిధి జట్టు 1-1తో 'డ్రా' చేసుకుంది. శ్రీనిధి తరఫున కాస్టనెడా (41వ ని.లో)... ఇంటర్ కాశీ తరఫున జులెన్ (87వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. 13 జట్ల మధ్య జరుగుతున్న ఈ లీగ్‌లో 23 మ్యాచ్‌లు ఆడిన శ్రీనిధి జట్టు 13 మ్యాచ్‌ల్లో గెలిచి, ఆరింటిని 'డ్రా' చేసుకొని, నాలుగు మ్యాచ్‌ల్లో ఓడి 45 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఈనెల 13న చివరి లీగ్ మ్యాచ్‌లో షిల్లాంగ్ ఎఫ్‌సీ జట్టుతో శ్రీనిధి జట్టు తలపడుతుంది. మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 52 పాయింట్లతో టైటిల్‌ను ఖరారు చేసుకుంది. 2022-2023 సీజన్‌లోనూ శ్రీనిధి జట్టుకు రెండో స్థానం దక్కింది.

సినిమా



● అల్లు అర్జున్

మాస్ జాతర

పుట్టినరోజు సందర్భంగా లేడీ గెటప్‌లో ప్రత్యక్షమయ్యారు అల్లు అర్జున్. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా 'పుష్ప'కి సీక్వెల్‌గా రూపొందుతున్న 'పుష్ప 2: ది రూల్' చిత్రంలోని లుక్ ఇది. సోమవారం (ఏప్రిల్ 8) అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఈ మూవీ టీజర్‌ని విడుదల చేశారు మేకర్స్. గంగమ్మ జాతరలో వచ్చే సన్నివేశంతో ఈ టీజర్ కట్ చేశారు. నిమిషం ఉన్న ఈ టీజర్‌లో ఒక్క డైలాగ్ కూడా లేదు. కానీ చీర కట్టులో ఊర మాస్ లుక్‌లో కనిపించి ఆశ్చర్యపరిచారు అల్లు అర్జున్. రష్మికా మందన్న హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో ఫాహద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న రిలీజ్ కానుంది.



● సిద్ధు జొన్నలగడ్డకు షీల్డ్ అందిస్తున్న ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్, విశ్వక్ సేన్...

వారిద్దర్నీ చూస్తుంటే గర్వంగా ఉంది

- ఎన్టీఆర్

''విశ్వక్ సేన్‌కి, సిద్ధుకి చాలాసార్లు చెప్పాను. మీపై నమ్మకం ఉంది.. ఇండస్ట్రీ ముందుకు వెళ్లడానికి చాలా సాయపడతారు, కష్టపడతారు అని. ఈ రోజు వారిద్దర్నీ చూస్తుంటే చాలా గర్వంగా, ఆనందంగా ఉంది. కొత్త ఆలోచనలను ముందుకు తీసుకెళ్లటానికి చిత్ర పరిశ్రమకి ఇలాంటి డేర్ డెవిల్స్ కావాలి'' అని హీరో ఎన్టీఆర్ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ జంటగా మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం మార్చి 29న విడుదలైంది. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన 'డబుల్ బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్ ఆఫ్ టిల్లు స్క్వేర్' వేడుకకి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్టీఆర్ మాట్లాడుతూ– ''నవ్వించడం ఓ వరం. నవ్వకపోవడం అనేది శాపం. నేను నవ్వడం మొదలుపెడితే ఆపుకోవడం కష్టం. అలాంటిది నేను ఇక నవ్వలేను బాబోయ్ అనేలా 'టిల్లు స్క్వేర్'తో నవ్వించాడు సిద్ధు.. చాలామందిని నవ్వించాడు. మల్లిక్ రామ్‌గారు 'టిల్లు స్క్వేర్'ని అద్భుతంగా తీశారు. అనుపమ, నేహాశెట్టి లేకపోతే ఈ సినిమా ఇంత హిట్టయ్యేది కాదు. ఇక 'దేవర' సినిమా రిలీజ్ లేట్ అయినా సరే.. రేపు మీరందరూ (ఫ్యాన్స్) కాలర్ ఎగరేసుకునేలా ఆ చిత్రాన్ని అందించటానికి ప్రయత్నిస్తాం'' అన్నారు. డైరెక్టర్ త్రివిక్రమ్ మాట్లాడుతూ– ''టిల్లు స్క్వేర్' వంద కోట్లు చేసింది. 'దేవర'తో ఎన్టీఆర్ వెయ్యి కోట్ల వసూళ్లు సాధించాలి'' అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ–''త్రివిక్రమ్‌గారి నుంచి ఎంతో నేర్చుకున్నాను. 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' సినిమాలకి నీకు ఏవైనా అవార్డులు వచ్చాయా? అని నన్ను చాలామంది అడిగారు. వారందరికీ ఎన్టీఆర్ అన్న నా గురించి మాట్లాడిన వీడియో చూపించి.. ఇంతకంటే పెద్ద అవార్డు ఏదైనా ఉందా? అన్నాను'' అన్నారు. ''అందరి కృషి వల్లే ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అయ్యింది'' అన్నారు మల్లిక్ రామ్.



● ప్రభాస్

స్వాతంత్ర్యం రాక ముందు...?

ఇప్పటికే 'సలార్ 2', 'కల్కి 2898 ఏడీ' చిత్రాలు అంగీకరించిన ప్రభాస్ తదుపరి సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' చేయనున్నారు. అరవై శాతం స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని, డిసెంబరులో షూటింగ్ ఆరంభిస్తామని సందీప్ రెడ్డి ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇక తాజాగా ప్రభాస్ సైన్ చేసిన మరో సినిమా ప్రకటన వచ్చింది. హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇది ఫిక్షనల్ పీరియాడిక్ యాక్షన్ మూవీ అని మేకర్స్ పేర్కొన్నారు. కాగా స్వాతంత్ర్యం రాక పూర్వం రజాకార్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్. యుద్ధం నేపథ్యంలో తెరకెక్కనుందని ప్రచారం జరుగుతోంది. చిత్రసంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్ నేతృత్వంలో ఇప్పటికే మూడు పాటలు కంపోజ్ చేశామని దర్శకుడు హను తెలిపారు.

లవ్ గురు నవ్వులు పంచుతుంది

- నిర్మాత రవిశంకర్



● రవిశంకర్, నవీన్, విజయ్

''విజయ్ ఆంటోనిగారి 'బిచ్చగాడు' సినిమా ఇప్పటికీ ఫ్యామిలీ ఆడియన్స్‌కి ఫేవరెట్ మూవీ. ఆయన నటించిన 'లవ్ గురు' సినిమా నవ్వులు పంచుతుంది'' అన్నారు నిర్మాత రవిశంకర్. విజయ్ ఆంటోని, మృణాళినీ రవి జంటగా వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వం వహించిన చిత్రం 'లవ్ గురు'. మీరా విజయ్ ఆంటోని సమర్పణలో విజయ్ ఆంటోని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదలవుతోంది. తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేస్తోంది. సోమవారం నిర్వహించిన 'లవ్ గురు' ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ– ''లవ్ గురు' చాలా బాగుంది. ఈ సినిమా తమిళంలోనే కాదు.. తెలుగులోనూ మంచి హిట్ అవుతుంది'' అన్నారు. హీరో, నిర్మాత విజయ్ ఆంటోని మాట్లాడుతూ– ''లవ్ గురు' కథ విన్నాక నా కెరీర్‌లో 'బిచ్చగాడు' తర్వాత అంత పెద్ద హిట్ అవుతుందని వినాయక్‌కు చెప్పాను. ఈ సినిమాను హిందీలో వినాయక్ డైరెక్షన్‌లోనే చేస్తాను'' అన్నారు. ''ఈ ప్రపంచంలో ప్రేమ ద్వారా ఏదైనా సాధించొచ్చు అనే అంశాన్ని మా మూవీలో చెబుతున్నాం'' అన్నారు వినాయక్ వైద్యనాథన్.

ఇక సినిమాల్లో చేయడానికి ఏమీ లేదు!



● ఉడీ అలెన్

హాలీవుడ్ సినీ చరిత్రలో దర్శకుడు-నటుడు ఉడీ ఆలెన్‌ది ప్రముఖ స్థానం. ముఖ్యంగా రొమాంటిక్ జానర్‌లో ఆయన తెరకెక్కించిన 'అన్నీ హాల్, మాన్‌హాట్టన్, మిడ్‌నైట్ ఇన్ ప్యారిస్, టు రోమ్ విత్ లవ్, ఎ రెయినీ డే ఇన్ న్యూయార్క్' వంటివి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పలు రొమాంటిక్ చిత్రాలు తెరకెక్కించిన ఉడీ ఆలెన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో 'రొమాన్స్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్ ఈజ్ గాన్' అన్నారు. ఇక సినిమాలపరంగా చేయడానికి ఏమీ లేదన్నట్లుగా మాట్లాడారు 88 ఏళ్ల ఉడీ. ఆయన తెరకెక్కించిన 'కూప్ ది చాన్స్' గత ఏడాది ఫ్రాన్స్‌లో విడుదలైంది. దర్శకుడిగా ఉడీకి ఇది 50వ చిత్రం. ఇదే చివరి చిత్రం అన్నట్లుగా పేర్కొన్నారు. ఈ చిత్రం రిలీజ్ నార్త్ అమెరికాలో లేట్ అయింది. ఆ ఇంటర్వ్యూలో ఉడీ ఆలెన్ మాట్లాడుతూ – ''నేనొక సినిమా చేశాక దాని గురించి పట్టించుకోను. డిస్ట్రిబ్యూషన్ అనేది నా పని కాదు. ఇప్పుడు పంపిణీ అంటే ఏ మూవీ అయినా రెండు వారాలే. ఒకప్పుడు నా 'అన్నీ హాల్' సినిమా న్యూయార్క్ థియేటర్లలో ఏడాది ఆడింది. ఒక థియేటర్లో 6, 7 నెలలు ఆడాక వేరేవాళ్లు తీసుకునేవారు. అక్కడ కొన్ని నెలలాడేది. కానీ ఇప్పుడు సినిమా వ్యాపారం మారిపోయింది. ఈ మార్పు ఆకర్షణీయంగా లేదు'' అన్నారు.



హారర్... కామెడీ సమానంగా ఉంటాయి

- అంజలి

''గీతాంజలి మళ్లీ వచ్చింది' సినిమా పాయింట్‌ను కోన వెంకట్ గారు నాలుగేళ్ల ముందే చెప్పారు. అయితే అప్పుడు నేను బిజీగా ఉండటం, ఆ తర్వాత ఈ సినిమాలోని ఇతర నటీనటులు బిజీగా ఉండటంతో కుదరలేదు. మధ్యలో కరోనా వచ్చింది. హారర్, కామెడీని బ్యాలెన్స్ చేస్తూ చేసిన ఈ మూవీ ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు హీరోయిన్ అంజలి. 'గీతాంజలి'కి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. శివ తుర్లపాటి దర్శకత్వంలో ఎంవీవీ సినిమాస్‌తో కలిసి కోన వెంకట్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 11న రిలీజవుతోంది. ఈ సందర్భంగా అంజలి మాట్లాడుతూ– ''గీతాంజలి'కి ఇది సీక్వెల్ కాబట్టి పాత్రలని మార్చలేదు. కానీ, కొత్త క్యారెక్టర్స్‌ను (అలీ, సునీల్, సత్య) తీసుకొచ్చాం. రొటీన్‌గా చేస్తే నటిగా నాకు ఆసక్తి ఉండదు కాబట్టి ప్రతి సినిమాకి కొత్తగా ఉండాలనే చూస్తున్నాను. ఈ ఉగాదికి 'గీతాంజలి మళ్లీ వచ్చింది'తో వస్తుండటం హ్యాపీ'' అన్నారు.

నీదేలే జన్మ



● కృష్ణ, అమృత

ప్రేయసిని ఉద్దేశించి 'నీదేలే జన్మ...' అంటూ కన్నడ ప్రముఖ నటుడు-దర్శకుడు డార్లింగ్ కృష్ణ పాట అందుకున్నారు. డార్లింగ్ కృష్ణ హీరోగా నటించి, స్వీయదర్శకత్వంలో రూపొందించిన కన్నడ చిత్రం 'లవ్ మాక్‌టైల్ 2'. నకుల్ అభయాన్కర్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'నీదేలే నీదేలే జన్మ..' పాటను విడుదల చేశారు. గురు చరణ్ సాహిత్యం అందించిన ఈ పాటను సురేంద్రనాథ్ పాడారు. మిలినా నాగరాజ్, అమృతా అయ్యంగార్ ముఖ్య పాత్రలు పోషించారు. తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్న ఎంవీఆర్ కృష్ణ మాట్లాడుతూ – ''తెలుగులోనూ 'లవ్ మాక్‌టైల్ 2' హిట్టవుతుందనే నమ్మకం ఉంది. ఈ వేసవిలోనే చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు.

ప్రియమైన మాజీల్లారా...!



● నిత్య

కూలింగ్ గ్లాసెస్, ఒక చేతిలో మాక్‌టైల్.. మరో చేతిలో మొబైల్ ఫోన్‌తో ఆధునిక యువతిలా కనిపిస్తూనే... పసుపురంగు చీరలో సంప్రదాయబద్ధంగానూ కనిపించారు నిత్యా మీనన్. ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'డియర్ ఎక్సెస్' (ప్రియమైన మాజీల్లారా) లోని లుక్ ఇది. సోమవారం (ఏప్రిల్ 8) నిత్యా పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం టైటిల్ ప్రకటించి, లుక్ రిలీజ్ చేశారు. కామినీ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఓ యువతికి ఎదురయ్యే సవాళ్లు, అనుబంధాలపై ఆమె దృక్పథం నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది.

డియర్ కథ సహజంగా ఉంటుంది

- సందీప్ కిషన్



● జీవీ ప్రకాశ్, ఐశ్వర్య, సందీప్ కిషన్

''డియర్' టీజర్, ట్రైలర్ చూస్తుంటే సినిమా సహజంగా ఉంటుందనిపిస్తోంది. ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అని హీరో సందీప్ కిషన్ అన్నారు. జీవీ ప్రకాశ్‌కుమార్, ఐశ్వర్యా రాజేశ్ జంటగా ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన చిత్రం 'డియర్'. వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి. పృథ్వీరాజ్ నిర్మించిన ఈ చిత్రం తమిళంలో ఈ నెల 11న, తెలుగులో 12న విడుదలవుతోంది. ఈ మూవీని ఆంధ్రప్రదేశ్‌లో అన్నపూర్ణ స్టూడియోస్, తెలంగాణలో ఏషియన్ సినిమాస్ రిలీజ్ చేస్తున్నాయి. సోమవారం నిర్వహించిన 'డియర్' ప్రీ రిలీజ్ వేడుకకి సందీప్ కిషన్, నిర్మాత నాగవంశీ, దర్శకులు వెంకీ అట్లూరి, నందినీ రెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. ''ఈ సినిమా అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అన్నారు జీవీ ప్రకాశ్ కుమార్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	494	74,742
నిఫ్టీ ▲	153	22,666

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,273	▲ 24
డోజోన్స్	38,930	▲ 26
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,943	▲ 32
డాక్స్	18,314	▲ 139
షాంఘై	3,047	▽ 22
నికాయ్	39,315	▲ 305

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్లు)	71,064
బంగారం (22 క్యారెట్లు)	65,095
వెండి (కేజీ)	84,500

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.87	83.89
£	బ్రిటన్ పౌండ్		104.04	106.59
€	యూరో		89.17	91.53
¥	జపాన్ ఎన్ (100)		54.33	55.55
AUS	ఆస్ట్రేలియా డాలర్		53.83	55.76
S$	సింగపూర్ డాలర్		59.42	64.11
SAR	సౌదీ రియాల్		21.32	22.88
UAE D	యూఏఈ దిర్హామ్		21.80	23.58
¥	చైనా యువాన్		10.40	12.47

దేశీయంగా ఈవీ బ్యాటరీల తయారీ

ఎక్సైడ్ ఎనర్జీ సొల్యూషన్స్‌తో కియా, హ్యుందాయ్ మోటార్స్ జట్టు




న్యూఢిల్లీ: దేశీయంగా ఎలక్ట్రిక్ వాహన బ్యాటరీల తయారీని చేపట్టే దిశగా ఎక్సైడ్ ఎనర్జీ సొల్యూషన్స్‌తో దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజాలు హ్యుందాయ్, కియా జట్టు కట్టాయి. భారత్‌లో తమ ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విస్తరణ ప్రణాళికలకు అనుగుణంగా ఇందుకు సంబంధించి ఎక్సైడ్ ఎనర్జీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు హ్యుందాయ్ తెలిపింది. దీని ప్రకారం లిథియం-ఐరన్-ఫాస్ఫేట్ (ఎల్‌ఎఫ్‌పీ) సెల్స్ తయారీపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు వివరించింది. స్థానికంగా తయారీ వల్ల బ్యాటరీ వ్యయాలు కొంత మేర తగ్గగలవని, తద్వారా ఇతర సంస్థలతో మరింత మెరుగ్గా పోటీపడగలమని హ్యుందాయ్ మోటార్ .. కియా ఆర్‌అండ్‌డీ విభాగం హెడ్ హుయి వాన్ యాంగ్ తెలిపారు. భారత మార్కెట్లో తమ బ్యాటరీల అభివృద్ధి, ఉత్పత్తి, సరఫరా తదితర కార్యకలాపాల విస్తరణకు ఎక్సైడ్ ఎనర్జీతో వ్యూహాత్మక భాగస్వామ్యం తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు. హ్యుందాయ్ ప్రస్తుతం భారత్‌లో అయోనిక్ 5, కోనా ఎలక్ట్రిక్ వాహనాలను, కియా ఇండియా ఈవీ6 మోడల్‌ను విక్రయిస్తున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	405-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	390-00
విజయవాడ	390-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	375-00
వరంగల్	377-00
రిటైల్ ధర	4.35

జీఆర్‌టీ తగ్గింపు ఆఫర్లు



హైదరాబాద్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జీఆర్‌టీ జ్యువెలర్స్ ప్రత్యేక తగ్గింపు ఆఫర్లు ప్రకటించింది. ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన ప్రకారం- ఆభరణాల కొనుగోలుపై గ్రాముకు రూ.50 రిబేట్, వజ్రాలు, అన్‌కట్ వజ్రాల విలువపై 10 శాతం తగ్గింపు (సాలిటైర్స్ మినహా) వెండి వస్తువుల మేకింగ్ చార్జీలపై 25 శాతం తగ్గింపు, వెండి ఆభరణాల ఎంఆర్‌పీపై 10 శాతం రిబేట్ వంటి ఆఫర్లు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. వినియోగదారులకు స్వర్ణ ఉగాది అనుభూతిని అందించడమే లక్ష్యమని సంస్థ తెలిపింది.

రికార్డులను తిరగరాస్తున్న బంగారం ధరలు

- న్యూఢిల్లీలో రూ.350 పెరిగి రూ.71,700కు చేరిక
- అంతర్జాతీయంగా ఆల్ టైమ్ హై 2,372 డాలర్లకు అప్




న్యూఢిల్లీ: బంగారం ధర గత వారం రోజులుగా ఏరోజుకారోజు కొత్త రికార్డులకు చేరుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో సోమవారం పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర రూ.350 పెరిగి 71,700కు చేరింది. అంతర్జాతీయంగా కూడా ధరలు సరికొత్త రికార్డులను తాకడం దీనికి నేపథ్యం. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ (31.1 గ్రాములు) ధర జూన్‌తో ముగిసే కాంట్రాక్ట్ ఒక దశలో భారీగా క్రితం ముగింపుతో పోల్చితే 27 డాలర్లు పెరిగి 2,372డాలర్లపైకి ఎగసింది. అమెరికా ఫెడ్ వడ్డీరేట్లు తగ్గించవచ్చన్న అంచనాలు, ఈజీ మనీ, ద్రవ్యోల్బణం భయాలు, సెంట్రల్ బ్యాంక్‌ల కొనుగోళ్లు, భౌగోళిక ఉద్రిక్తతలు పసిడి పరుగుకు కారణమవుతున్నాయి. 2024లో దేశంలో పసిడి 10 గ్రాములకు రూ.7,700 పెరిగినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ఫ్యూచర్స్ మార్కెట్- మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో పసిడి విలువ 10 గ్రాములకు ఏకంగా రూ.71,080కి ఎగసింది. సోమవారం ఈ వార్త రాసే సమయానికి క్రితం ముగింపుతో పోల్చితే రూ.158 లాభంతో రూ.70,794 వద్ద ట్రేడవుతోంది.

వెండి కూడా...

ఇదిలావుండగా, వెండి కూడా న్యూఢిల్లీలో కొత్త గరిష్టాలను చూసింది. సోమవారం కేజీకి రూ.800 ఎగసి రూ.84,000 స్థాయిని చూసింది. దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్‌లో వెండి కేజీ ధర (మే కాంట్రాక్ట్) ఒక దశలో 82,109ని తాకింది. ఈ వార్త రాసే రాత్రి 9 గంటల సమయానికి ధర రూ.942 ఎగసి రూ.81,805 వద్ద ట్రేడవుతోంది.

తనిష్క్ పండుగ కలెక్షన్



హైదరాబాద్: ఆభరణాల రిటైల్ బ్రాండ్ తనిష్క్- ఉగాది సందర్భంగా అత్యంత ఆకర్షణీయమైన ఆఫర్లను అందిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు విడుదలైన ప్రకటన ప్రకారం, ప్రత్యేక కలెక్షన్‌లో నెక్లెస్‌లు, చెవి పోగులు, ఉంగరాలు, అందమైన ఆభరణాలు ఉన్నాయి. దీనితోపాటు కస్టమర్లు తమ పాత బంగారాన్ని ఆకర్షణీయమైన కొత్త డిజైన్‌లుగా మార్చుకునేందుకు తనిష్క్ ప్రత్యేకంగా 'గోల్డ్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్'ను ఆవిష్కరించింది. వినియోగదారులు ప్రతి ఆభరణం కొనుగోలుతో ఉచిత బంగారు నాణెం పొందే ఆఫర్ ఏప్రిల్ 9తో ముగుస్తుంది.

స్టాక్స్ బుల్ సవారీ

సరికొత్త గరిష్టాలకు మార్కెట్లు



ముంబై: ప్రధానంగా బ్లూచిప్స్‌లో కొనుగోళ్లతో దేశీ స్టాక్ మార్కెట్లు మరోసారి హైజంప్ చేశాయి. వెరసి ప్రామాణిక ఇండెక్సులు సరికొత్త గరిష్టాలకు చేరాయి. సెన్సెక్స్ 494 పాయింట్లు ఎగసి 74,742 వద్ద ముగిసింది. నిఫ్టీ 153 పాయింట్లు జమ చేసుకుని 22,666 వద్ద స్థిరపడింది. ఒక దశలో సెన్సెక్స్ 621 పాయింట్లు పురోగమించి 74,869ను తాకింది. ఇక నిఫ్టీ 183 పాయింట్లు బలపడి 22,697 వద్ద గరిష్టాన్ని అందుకుంది. ప్రపంచ స్టాక్ మార్కెట్ల ర్యాలీ సెంటిమెంటుకు ప్రోత్సాహాన్నిచ్చినట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. వారాంతాన యూఎస్ మార్కెట్లు లాభపడిన సంగతి తెలిసిందే.

మార్కెట్ విలువ రికార్డ్

ఇన్వెస్టర్ల సంపదగా పేర్కొనే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల ఉమ్మడి మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) తొలి సెషన్‌లో రూ. 401 లక్షల కోట్లను అధిగమించింది. మార్కెట్ చరిత్రలో ఇది తొలిసారికాగా.. డాలర్లలో 4.81 ట్రిలియన్లను తాకింది. చివరికి బీఎస్‌ఈ మార్కెట్ విలువ రూ. 4,00,86,722 వద్ద స్థిరపడింది. గతేడాది జులైలో తొలిసారి బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల విలువ రూ. 300 లక్షల కోట్లను తాకిన విషయం విదితమే.

బ్లూచిప్స్ దన్ను

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా ఆటో, ఆయిల్, రియల్టీ, మెటల్ రంగాలు 2.2-1.2 శాతం మధ్య పుంజుకోగా.. పీఎస్‌యూ బ్యాంక్స్, మీడియా, ఐటీ 0.5 శాతం స్థాయిలో బలహీనపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఐషర్, ఎంఅండ్‌ఎం, మారుతీ, ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ లైఫ్, జేఎస్‌డబ్ల్యూ, గ్రాసిమ్, టాటా కన్జూమర్, ఎల్‌అండ్‌టీ, ఆర్‌ఐఎల్, యాక్సిస్, హీరోమోటో, ఎయిర్‌టెల్ 4-1 శాతం మధ్య ఎగశాయి. అయితే అదానీ పోర్ట్స్, నెస్లే, అపోలో హాస్పిటల్, విప్రో, సన్ ఫార్మా 1.6-0.6 శాతం మధ్య నీరసించాయి.

మే 20న మార్కెట్లకు సెలవు

ముంబైలో సాధారణ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో మే 20న బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలకు సెలవు ప్రకటించారు. ఈ నెల 11న ఈద్(రంజాన్), 17న శ్రీరామ నవమి, మే 1న మహారాష్ట్ర డే సందర్భంగా సైతం స్టాక్ మార్కెట్లు పనిచేయవు.

ఆధార్ హౌసింగ్ ఐపీవోకు రెడీ



ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఐపీవో ద్వారా రూ. 5,000 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది.

అనధికారిక ఫారెక్స్ ప్లాట్‌ఫాంలపై నిఘా పెంచాలి..

బ్యాంకులకు శక్తికాంత దాస్ సూచన



న్యూఢిల్లీ: అనధికారిక ఫారెక్స్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌ల విషయంలో అప్రమత్తత వహించాలని బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ సూచించారు. కొందరు వ్యక్తులు, సంస్థలు వీటిలో లావాదేవీలు నిర్వహించేందుకు నిధుల కోసం బ్యాంకింగ్ మాధ్యమాన్ని ఉపయోగించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ తరహా ప్లాట్‌ఫామ్‌లలో జరుగుతున్న మోసాలపై ఫిర్యాదులు వస్తుండటంతో వాటిల్లో ట్రేడింగ్ చేయరాదంటూ ఆర్‌బీఐ ఇప్పటికే సూచన జారీ చేసినట్లు దాస్ చెప్పారు. బార్సెలోనాలో జరిగిన ఎఫ్‌ఐఎంఎండీఏ-పీడీఏఐ వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ అంశాలు వివరించారు. మరోవైపు, రూపీ డెరివేటివ్స్‌లో భారతీయ బ్యాంకుల పాత్ర మరింతగా పెరగాలని దాస్ సూచించారు.

టెలికం చందాదార్లు 119.7 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా 2024 ఫిబ్రవరి నాటికి టెలికం చందాదార్ల సంఖ్య 119.7 కోట్లకు చేరింది. జనవరితో పోలిస్తే 0.38 శాతం వృద్ధి నమోదైంది. టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ప్రకారం.. మొత్తం టెలికం సబ్‌స్క్రైబర్స్‌లో పట్టణ ప్రాంతాల నుంచి 66.37 కోట్లు, గ్రామీణ ప్రాంతాల వారు 53.13 కోట్ల మంది ఉన్నారు. ఈ ఏడాది జనవరితో పోలిస్తే ఫిబ్రవరిలో అర్బన్ కస్టమర్ల సంఖ్య 0.40 శాతం, గ్రామీణ వినియోగదార్ల సంఖ్య 0.34 శాతం పెరిగింది.

2023-24లో వాహనాల జోరు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా గత ఆర్థిక సంవత్సరంలో అన్ని విభాగాల్లో కలిపి 2,45,30,334 వాహనాలు రోడ్డెక్కాయి. 2022-23తో పోలిస్తే విక్రయాల్లో 10 శాతం వృద్ధి నమోదైందని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఎఫ్‌ఏడీఏ) తెలిపింది. '2023-24లో ప్యాసింజర్ వెహికిల్స్ రిటైల్ అమ్మకాలు 8 శాతం అధికమై 39,48,143 యూనిట్లను తాకాయి. త్రిచక్ర వాహనాలు 49% దూసుకెళ్లి 11,65,699 యూనిట్లకు చేరాయి. ట్రాక్టర్ల సేల్స్ 8,29,639 నుంచి 8,92,313 యూనిట్లకు, టూ-వీలర్స్ విక్రయాలు 9% అధికమై 1,75,17,173 యూనిట్లకు చేరాయి. వాణిజ్య వాహనాల సంఖ్య 5% ఎగసి 10,07,006 యూనిట్లు నమోదయ్యాయి.

షార్ప్ ఇండియా చైర్మన్‌గా సుజయ్



న్యూఢిల్లీ: జపాన్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం షార్ప్ తమ భారత విభాగం చైర్మన్‌గా సుజయ్ కరమ్‌పురిని నియమించింది. ఈ ఏడాది మార్చి 1 నుంచి ఆయన నియామకం అమల్లోకి వచ్చిందని సంస్థ తెలిపింది. డిస్‌ప్లే వ్యాపార విభాగానికి సారథ్యం వహిస్తూ భారత్‌లో షార్ప్ బ్రాండ్‌ను వృద్ధిలోకి తేవడం, ఇంజినీరింగ్ ఉత్పత్తులు.. సొల్యూషన్స్ తయారీ, టెక్నాలజీ బదలాయింపునకు వ్యూహాత్మక భాగస్వాములతో ఒప్పందాలు కుదుర్చుకోవడం తదితర బాధ్యతలు ఆయన నిర్వర్తిస్తారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో సుజయ్ పలు కీలక హోదాల్లో పని చేశారు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐఎస్సీ బెంగళూరులో బీఎస్సీ(రీసెర్చ్) ప్రవేశాలు

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగేళ్ల బీఎస్సీ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు.
- » **పరిశోధనాంశాలు:** బయాలజీ, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మెటీరియల్స్, మ్యాథ్స్, ఫిజిక్స్.
- » **అర్హత:** 60 శాతం మార్కులతో 2023లో 10+2 /ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా) తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పరీక్షకు హాజరయ్యే వారు అర్హులే.
- » **ఎంపిక విధానం:** జేఈఈ మెయిన్-2024/జేఈఈ అడ్వాన్స్‌డ్-2024/నీట్(యూజీ)-2024 /ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024 స్కోరు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.05.2024
- » **వెబ్‌సైట్:** https://iisc.ac.in/admissions

సీఐటీడీ హైదరాబాద్‌లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్ బాలానగర్‌లోని ఎంఎస్‌ఎంఈ టూల్ రూమ్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ) 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు వివరాలు

- » డిప్లొమా ఇన్ టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్ (డీటీడీఎం)-60 సీట్లు
- » డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(డీఈసీఈ)-60 సీట్లు.
- » డిప్లొమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇంజనీరింగ్(డీఏఆర్‌ఈ)-60 సీట్లు.
- » డిప్లొమా ఇన్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్(డీపీఈ)-60 సీట్లు.
- » **కోర్సు వ్యవధి:** డీటీడీఎం కోర్సుకు నాలుగేళ్లు, మిగిలిన కోర్సులకు మూడేళ్లు.
- » **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** 20.05.2024 నాటికి 15 నుంచి 19 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల వరకు వయసు సడలింపు ఉంటుంది.
- » **ఎంపిక విధానం:** జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష ద్వారా సీటు కేటాయిస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్/ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.05.2024.
- » **ప్రవేశ పరీక్ష తేది:** 26.05.2024
- » **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్.
- » **వెబ్‌సైట్:** https://citdindia.org/diplomaadmissions2024

నైసర్ భువనేశ్వర్‌లో ఎంఎస్సీ ప్రవేశాలు

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్), సెంటర్ ఫర్ మెడికల్ అండ్ రేడియేషన్ ఫిజిక్స్ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఎస్సీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం సీట్ల సంఖ్య:** 10.
- » **కోర్సు:** ఎంఎస్సీ(మెడికల్ అండ్ రేడియోలాజికల్ ఫిజిక్స్)
- » **కోర్సు వ్యవధి:** రెండేళ్లు. ఏడాది ఇంటర్న్‌షిప్.
- » **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. జామ్ 2024/జెస్ట్ 2025 వ్యాలిడ్ స్కోరు సాధించి ఉండాలి.
- » **ఎంపిక విధానం:** జామ్ 2024/జెస్ట్ 2024 స్కోరు,ఇంటర్వ్యూ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.04.2024.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.05.2024
- » **ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి:** 31.05.2024.
- » **ఇంటర్వ్యూ తేదీలు:** 01.07.2024 నుంచి 04.07.2024 వరకు
- » **తుది జాబితా వెల్లడి:** 05.07.2024.
- » **వెబ్‌సైట్:** https://www.niser.ac.in

నైసర్ భువనేశ్వర్‌లో పీహెచ్‌డీ ప్రవేశాలు

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్).. 2024 ఆగస్ట్ నుంచి ప్రారంభం కానున్న పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **విభాగాలు:** బయాలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, కంప్యూటర్ సైన్సెస్, ఎర్త్ అండ్ ప్లానెటరీ సైన్సెస్,హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మ్యాథమేటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్.
- » **అర్హత:** కనీసం 60శాతం మార్కులతో ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్(ఎల్ఎస్ లేదా జేఆర్ఎఫ్) /గేట్/జెస్ట్/జీప్యాట్/డీబీటీ-బీఈటీ/ఐసీఎంఆర్/జేజీఈఈబీఐఎల్ఎస్ లేదా ఇతర తత్సమాన జాతీయ స్థాయి పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
- » **ఫెలోషిప్:** నెలకు రూ.37,000 నుంచి 42,000.
- » **ఎంపిక విధానం:** టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2024
- » **వెబ్‌సైట్:** https://www.niser.ac.in

కేంద్రంలో జూనియర్ ఇంజనీర్ కొలువు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని శాఖల్లో.. జూనియర్ ఇంజనీర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్‌తోపాటు డిప్లొమా ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఎంపికైతే గ్రూప్-బి(నాన్-గెజిటెడ్) హోదాలో.. జూనియర్ ఇంజనీర్‌గా కొలువుదీరొచ్చు. నెలకు రూ.60వేలకు పైగానే వేతనం లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ జూనియర్ ఇంజనీర్ పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, సిలబస్ అంశాలు, పరీక్షలో విజయానికి మార్గాలపై ప్రత్యేక కథనం..

- » మొత్తం 968 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల
- » సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో కొలువులు
- » డిప్లొమా అర్హతతో దరఖాస్తుకు అవకాశం
- » రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక
- » వేతన శ్రేణి రూ.35,400 -రూ.1,12,400

మొత్తం 968 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్.. తాజా నోటిఫికేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 9 విభాగాల్లో, 3 బ్రాంచ్‌లలో(సివిల్,మెకానికల్, ఎలక్ట్రికల్) మొత్తం 968 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఇందుకోసం జూనియర్ ఇంజనీర్(సివిల్,మెకానికల్,ఎలక్ట్రికల్)ఎగ్జామ్-2024ను నిర్వహించనుంది.

అర్హతలు

• గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా ఇన్‌స్టిట్యూట్ నుంచి సివిల్/మెకానికల్/ ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లతో బీటెక్ లేదా డిప్లొమా ఉత్తీర్ణత ఉండాలి. బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్, డీజీఏక్యూ (నావల్), మిలటరీ ఇంజనీర్ సర్వీసెస్ పోస్టుల అభ్యర్థులకు డిప్లొమాతోపాటు సంబంధిత విభాగంలో రెండేళ్ల పని అనుభవం ఉండాలి. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ పోస్టులకు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

• **వయసు:** ఆగస్ట్ 1, 2024 నాటికి 30 ఏళ్లలోపు ఉండాలి. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ పోస్టులకు మాత్రం గరిష్ట వయో పరిమితి 32 ఏళ్లు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఐదేళ్లు, ఓబీసీ వర్గాలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం

పే లెవల్-6లో రూ.35,400-రూ.1,12,400 వేతన శ్రేణితో ప్రారంభ వేతనం అందుతుంది. ప్రారంభంలోనే నెలకు రూ.60 వేల వరకు వేతనం లభిస్తుంది. భవిష్యత్తులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్, డివిజనల్ ఇంజనీర్ స్థాయికి చేరుకునే అవకాశముంది.

రాత పరీక్షలో ప్రతిభతో కొలువు

ఆయా పోస్టులకు రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి నియామకాలు ఖరారు చేస్తారు. రాత పరీక్షను రెండు పేపర్లుగా(పేపర్-1, పేపర్-2) నిర్వహిస్తారు.



పేపర్-1.. మూడు విభాగాలుగా

ఎంపిక ప్రక్రియలో తొలి దశగా పేపర్-1ను ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. ఈ పేపర్ మూడు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది.

• జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 50 ప్రశ్నలు-50 మార్కులకు, జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-50 మార్కులకు ఉంటాయి. దీంతోపాటు అభ్యర్థులు తాము డిప్లొమా లేదా బీటెక్‌లో చదివిన బ్రాంచ్‌కు అనుగుణంగా పార్ట్-ఎ లేదా పార్ట్-బి లేదా పార్ట్-సిలలో ఏదో విభాగంలోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఇది వంద ప్రశ్నలు-వంద మార్కులకు ఉంటుంది. ఇలా మొత్తం 200 మార్కులకు రెండు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు. పేపర్-1లో పొందిన మార్కులను నార్మలైజేషన్ ప్రక్రియ ద్వారా క్రోడీకరించి కటాఫ్ స్కోర్లను నిర్ణయిస్తారు. ఆ తర్వాత పోస్టుల సంఖ్య ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. వారికి పేపర్-2కు అర్హత లభిస్తుంది.

పేపర్-2.. 300 మార్కులకు

పేపర్-2ను పూర్తిగా సబ్జెక్ట్ పేపర్లతో డిస్క్రిప్టివ్ విధానంలో 300 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో పార్ట్-ఎ జనరల్ ఇంజనీరింగ్ (సివిల్ అండ్ స్ట్రక్చరల్), పార్ట్-బి జనరల్ ఇంజనీరింగ్ (ఎలక్ట్రికల్), పార్ట్-సి జనరల్ ఇంజనీరింగ్ (మెకానికల్) పేరుతో పేపర్లు ఉంటాయి. అభ్యర్థులు తమ అర్హతలకు అనుగుణంగా సంబంధిత సబ్జెక్ట్ విభాగంలో పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది. పరీక్షకు లభించే సమయం 2 గంటలు.

మెరిట్ ప్రాతిపదికన ఎంపిక

రెండు పేపర్లలోనూ పొందిన మార్కుల ఆధారంగా తుది విజేతల జాబితా రూపొందిస్తారు. దరఖాస్తులో పేర్కొన్న ప్రాథమ్యాలు, ఆయా విభాగాల్లో ఉన్న ఖాళీలు, రిజర్వేషన్లు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నియామకాలు ఖరారు చేసి సంబంధిత శాఖలు, విభాగాలకు పంపుతారు. ఆ తర్వాత సంబంధిత శాఖల్లో నిర్దీత కాల వ్యవధిలో అంతర్గత శిక్షణనిస్తారు. దాన్ని పూర్తి చేసుకున్న వారికి విధులు కేటాయిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 18
- **ఆన్‌లైన్ దరఖాస్తులో సవరణలకు అవకాశం:** ఏప్రిల్ 22, 23 తేదీల్లో
- **పేపర్-1 (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) తేదీ:** 2024, జూన్ 4 నుంచి జూన్ 6
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.gov.in

సబ్జెక్టుపై పట్టు.. విజయానికి మెట్టు

జూనియర్ ఇంజనీర్ పోస్టులకు పోటీ పడే అభ్యర్థులు ప్రధానంగా ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌లపై పట్టు సాధించాల్సి ఉంటుంది. డిప్లొమా, బీటెక్ స్థాయిలో అకడమిక్ పుస్తకాలను అధ్యయనం చేయాలి.

సివిల్

సివిల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు బిల్డింగ్ మెటీరియల్స్, ఎస్టిమేటింగ్, కాస్టింగ్ అండ్ ఎవాల్యుయేషన్, సర్వేయింగ్, సాయిల్ మెకానిక్స్, హైడ్రాలిక్స్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌లపై పట్టు సాధించాలి. అదే విధంగా..స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌కు సంబంధించి స్ట్రక్చర్స్ థియరీ, కాంక్రీట్ టెక్నాలజీ, ఆర్‌సీసీ డిజైన్, స్టీల్ డిజైన్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

ఎలక్ట్రికల్

ఈ విభాగం అభ్యర్థులు బేసిక్ కాన్సెప్ట్స్‌తోపాటు సర్క్యూట్ లా, మ్యాగ్నటిక్ సర్క్యూట్, ఏసీ ఫండమెంటల్స్, మెజర్‌మెంట్ అండ్ మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఎలక్ట్రికల్ మెషీన్స్, ఫంక్షనల్ కిలోవాట్ మోటార్స్ అండ్ సింగిల్ ఫేజ్ మోటార్స్, సింక్రనస్ మెషీన్స్, జనరేషన్, ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్, ఎస్టిమేషన్ అండ్ కాస్టింగ్, బేసిక్ ఎలక్ట్రానిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి.

మెకానికల్

ఈ విభాగంలో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు..థియరీ ఆఫ్ మెషీన్స్, మెషీన్ డిజైన్, ఇంజనీరింగ్ మెకానిక్స్, స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్, ప్రాపర్టీస్ ఆఫ్ ప్యూర్ సబ్‌స్టాన్సెస్, ఫస్ట్ అండ్ సెకండ్ లా ఆఫ్ థర్మోడైనమిక్స్, ఎయిర్ స్టాండర్డ్ సైకిల్స్ ఫర్ ఐసీ ఇంజన్స్, ఐసీ ఇంజన్ పెర్ఫార్మెన్స్, ఐసీ ఇంజన్స్ కంబస్టన్, ఐసీ ఇంజన్ కూలింగ్ అండ్ లూబ్రికేషన్, ఫ్లూయిడ్ స్టాటిక్స్, ఫ్లూయిడ్ ప్రెజర్, ఫ్లూయిడ్ కైనమాటిక్స్, డైనమిక్స్ ఆఫ్ ఫ్లూయిడ్స్, మెజర్‌మెంట్ ఆఫ్ ఫ్లో రేట్, బేసిక్ ప్రిన్సిపుల్స్, హైడ్రాలిక్ టర్బైన్స్, క్లాసిఫికేషన్ ఆఫ్ స్టీల్ తదితర కోర్ మెకానికల్ అంశాలపై పట్టు సాధించాలి.

సిద్ధాంతాలు, అన్వయ దృక్పథం

ఇంజనీరింగ్ పేపర్లలో మెరుగైన మార్కుల కోసం అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌లలోని అంశాలు, వాటికి సంబంధించిన ప్రాథమిక భావనలు, సిద్ధాంతాలు, నియమాలు, ధర్మాలు వంటి అంశాలను చదవాలి. దీంతోపాటు అన్వయ నైపుణ్యం కూడా అలవర్చుకోవాలి. అప్పుడే పరీక్షలో ఎలాంటి ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

ఉమ్మడి సబ్జెక్ట్‌లకు సన్నద్ధత ఇలా

• పేపర్-1లో అభ్యర్థులందరూ రాయాల్సిన, ఉమ్మడి సబ్జెక్ట్‌లుగా పేర్కొన్న జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ సబ్జెక్ట్‌లలో రాణించడానికి కూడా ప్రత్యేకంగా ప్రిపరేషన్ సాగించాలి.

• జనరల్ అవేర్‌నెస్‌లో రాణించేందుకు.. చరిత్ర, భారత రాజ్యాంగం, భౌగోళిక శాస్త్రం, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్, స్టాక్ జీకే అంశాలను చదవాలి. ఆధునిక భారత దేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ దశలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. జాగ్రఫీకి సంబంధించి దేశ భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, నదులు, అడవులు, పర్వతాలు తదితర అంశాలను తెలుసుకోవాలి.

• రాజ్యాంగానికి సంబంధించి ముఖ్యమైన అధికరణలు, ప్రకరణలు, తాజా సవరణలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి. సైన్స్ అండ్ టెక్నాలజీలో తాజాగా దేశ శాస్త్ర, సాంకేతిక రంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, రక్షణ వ్యవస్థ, ఇస్రో తదితర సంస్థల ప్రయోగాల గురించి అధ్యయనం చేయాలి.

• జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్‌లో రాణించడానికి.. నంబర్ సిరీస్, కోడింగ్ - డీకోడింగ్ నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్, స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.



మాట నిలబెట్టుకున్నాను: కేటీఆర్



- అమ్మమ్మ ఊరిలో సొంత ఖర్చులతో స్కూల్ భవనం నిర్మాణం

బోయినపల్లి (చొప్పదండి): మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారకరామారావు సొంత నిధులతో బోయిన పల్లి మండలం కొదురుపాకలో నిర్మిస్తున్న స్కూల్ భ వ నం దాదాపు పూర్తికావచ్చింది. తన అమ్మమ్మ–తాత య్యలు జోగినిపల్లి లక్ష్మి–కేశవరావుల జ్ఞాపకార్థం ఈ స్కూల్‌ని నిర్మిస్తున్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమం కింద కొదురుపాకలో 2023, జనవరి 10న రూ.2 కోట్ల అంచనాలతో భవనం పనులకు శంకుస్థాపన చేశారు. భవనం పనులు పూర్తయ్యాయని రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందుబాటులోకి వస్తుందంటూ 'ఎక్స్'లో కేటీఆర్ సోమవారం ట్వీట్ చేశారు. ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నానని పేర్కొన్నారు.



ఎంసీఆర్ హెచ్చార్డీలో ఏఎస్‌వోల శిక్షణ కార్యక్రమం



కోర్సు మాన్యువల్‌ను విడుదల చేస్తున్న గోయల్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఎంసీఆర్ హెచ్చార్డీ కేంద్ర ప్రభుత్వంలోని సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ (డైరెక్ట్ రిక్రూట్) కోసం 9 వారాల ఫౌండేషన్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. న్యూఢిల్లీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియట్ ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఐఏఎస్ అధికారి శశాంక్ గోయల్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియట్ ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ నరేశ్ భరద్వాజ్ కోర్సు మాన్యువల్‌ను విడుదల చేశారు. సెంటర్ ఫర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్, కోర్సు డైరెక్టర్ కందకూరి ఉషారాణి స్వాగత ఉపన్యాసం చేశారు.

'సన్ పరివార్' స్కాంలో రూ. 25 కోట్ల ఆస్తులు జప్తు

సాక్షి, హైదరాబాద్: అధిక లాభాలు ఆశ జూపి వేలాది మంది అమాయకుల నుంచి రూ. కోట్లలో కొల్లగొట్టిన సన్ పరివార్ గ్రూప్ కంపెనీల కుంభకోణం కేసులో ఈడీ అధికారులు వేగం పెంచారు. కంపెనీకి చెందిన మెతుకు రవీందర్, ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులకు చెందిన రూ. 25.20 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను జప్తు చేసినట్లు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంస్థలో పెట్టుబడుల పేరుతో 10 వేల మంది అమాయకుల నుంచి రూ. 158 కోట్లు వసూలు చేసి మోసానికి పాల్పడ్డ ఆరోపణలపై తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ.. ఇందులో మనీలాండరింగ్ కోణంపై దర్యాప్తు ప్రారంభించింది.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.